Mana Telangana

ఆదివారం మన తెలంగాణ

www.manatelangana.news

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 198
7, ఆదివారం
జనవరి, 2018

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పాక్‌ను ఎలా దారికి తేవాలో తెలుసు : యుఎస్ 11

మూడున్నరేళ్ల జైలు

దాణా కుంభకోణం కేసులో లాలూ ప్రసాద్ యాదవ్ తదితరులకు శిక్షలు

- లాలూ మరి 15 మందికి రూ.5 లక్షలు జరిమానా సహా ఒకే వ్యవధి శిక్షలు విధించిన రాంచీ సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం
- రెండు గంటలు ఆలస్యంగా శిక్షల ఖరారు
- వరుసగా రెండుసార్లు ప్రకటన వాయిదా
- హైకోర్టుకు వెళ్తాం : తేజస్వీ యాదవ్



రాంచీ: పశు దాణా కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌కు సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం మూడున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. శనివారం రాంచీలోని సిబిఐ ప్రత్యేక కోర్టు శిక్షలు ఖరారు చేసింది. విడియో కాన్ఫరెన్స్ ద్వారా లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు మరో 15 మంది దోషులు న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో లాలూ సహా మరో ఏడుగురికి మూడున్నరేళ్ల పాటు జైలు శిక్ష, ఐదు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శనివారం సాయంత్రం తీర్పు వెలువరించారు. మధ్యాహ్నం 2 గంటలకు శిక్షలు ఖరారు చేయాల్సి ఉండగా.. నాలుగు గంటలకు వెల్లడిస్తామని సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి శివపాల్ సింగ్ ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం శిక్ష ఖరారుకు సంబంధించిన వాదనలు ముగిశాయి. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'ఇటువంటి దోషులకు ఓపెన్ జైలు సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే తరువాయి 6లో



మళ్లీ ఉత్తమ్

టిపిసిసి అధ్యక్షుడిగా కొనసాగుతారని ఎఐసిసి ప్రకటన

పార్టీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ తొలి నిర్ణయం

మన తెలంగాణ/ హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత టిపిసిసి చీఫ్ కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డినే సారథ్యం వహిస్తారని స్పష్టమైంది. అన్ని రాష్ట్రాల పిసిసి అధ్యక్షులను కొనసాగిస్తూ ఎఐసిసి అధ్యక్షులు రాహుల్‌గాంధీ శనివారం ఆదేశాలు జారీ చేయడంతో సందిగ్ధతకు తెరపడింది. ఉత్తమ్‌ను పిసిసి అధ్యక్షునిగా కొనసాగిస్తూ ఎఐసిసి ఆదేశాలు వెలువడిన వెంటనే గాంధీభవన్‌లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు. టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, కుమార్‌రావు, ప్రేమ్‌లాల్, అఫ్జలుద్దీన్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. మిఠాయిలు పంచి, బాణా సంచా కాల్చి, నృత్యాలు చేశారు. ఉత్తమ్ ఇంటికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్ళి తరువాయి 6లో

17 పంటలకు మెరుగైన మద్దతు ధరలిస్తాం : ఉత్తమ్ 2



రాహుల్‌పై సభా హక్కుల నోటీసు

- లోక్‌సభ స్పీకర్‌కు పంపిన రాజ్యసభ చైర్మన్
- ట్విట్టర్‌లో జైట్లీని జైట్ 'లై'గా ఎద్దేవా చేసినందుకు ఎగువసభ సభ్యుడు ఇచ్చిన నోటీసు 10

సాగు పెట్టుబడి సాయం

రూ.11,370 కోట్లు

1.42 కోట్ల ఎకరాలకు సంవత్సరానికి ఎనిమిదేసి వేల రూపాయలు

వ్యవసాయశాఖ ప్రాథమిక లెక్క, ప్రత్యేక సాగు బడ్జెట్‌కు రూ.15 వేల కోట్లు?

మన తెలంగాణ/ హైదరాబాద్ : రైతులకు వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకానికి ఏటా రూ. 11,370.26 కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. రైతు సమగ్ర సర్వే, భూ ప్రక్షాళనలో వెల్లడైన వివరాల ఆధారంగా పెట్టుబడి పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన మొత్తాన్ని లెక్కగట్టింది. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపినట్లు తెలిసింది. అంతే కాకుండా మార్చిలో తొలిసారిగా ప్రవేశపెట్టనున్న వ్యవసాయ ప్రత్యేక బడ్జెట్ రూ.15 వేల కోట్లుగా ఉండే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. రైతులు వ్యవసాయానికి సంబంధించిన పెట్టుబడి వనరులు (విత్తనాలు, ఎరువులు, కొంత మొత్తం కూలీలకు) సమకూర్చుకునేందుకు అవసరమైన సొమ్మును ఎకరాకు రూ. 4 వేల చొప్పున వానకాలం, యాసంగిలలో



అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిని మే 15 నుండి అమలు చేయనున్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గత జూన్‌లో రైతు సమగ్ర సర్వే చేపట్టింది. ఈ సర్వేలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 1.23 కోట్ల ఎకరాల సాగుకు యోగ్యమైన భూములు ఉన్నట్లు గుర్తించారు. అయితే ప్రభుత్వం పాత అంచనా ప్రకారం 1.55 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంది. భారీ వ్యత్యాసం రావడంతో ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూప్రక్షాళన చేపట్టింది. అందులో 1, 42,12,816 ఎకరాలు తరువాయి 6లో



సిఎం కెసిఆర్‌కు స్వామినాథన్ కృతజ్ఞతలు

- రైతులకు నిరంతర విద్యుత్‌పై హర్షం వ్యక్తం చేస్తూ లేఖ

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటలు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తుండడం పట్ల ఎం.ఎస్.స్వామినాథన్ రీసర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, తరువాయి 6లో

ఉపాధి నిర్వాసితుల

గోడు వినండి

ప్రాజెక్టుల భూసేకరణ పట్ల ఉపాధి కోల్పోయే వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి

వారి అభిప్రాయాలు తెలుసుకున్నాకే పరిహారం చెల్లింపుపై విచారణ జరపాలి : హైకోర్టు



మన తెలంగాణ/ హైదరాబాద్ : భూసేకరణ చేయదలిచ్చినప్పుడు రైతులే కాకుండా భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోయే వారి అభ్యంతరాలను కూడా అధికారులు తెలుసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. సిద్దిపేట జిల్లా తోగుట మండలం వేములఘాట్ గ్రామంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం జరిపే భూసేకరణలో అధికారులు తమ తరువాయి 6లో

జలమే జీవనాధారం

- ఇంటింటా ఇంకుడు గుంతలు తవ్వాలి, హైదరాబాద్‌లో జలం జీవం చేపడుతాం
- మన నగరం కార్యక్రమంలో మంత్రి కెటిఆర్



మన తెలంగాణ-/ హైదరాబాద్/ మియాపూర్ : మహానగరంలో నీటి సంరక్షణ కోసం జలం జీవం కార్యక్రమాన్ని చేపడుతామని రాష్ట్ర ఐటి, పురపాలక శాఖమంత్రి కల్వకుంట్ల తారకరామరావు పేర్కొన్నారు. శనివారం మియాపూర్‌లోని విశ్వనాథ్ గార్డెన్స్‌లో 'మన నగరం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు కెటిఆర్, మహేందర్‌రెడ్డి, చేవెళ్ళ ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, నగర మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దిన్, హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ నగర అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడమే మన నగరం కార్యక్రమన్నారు. దీని ద్వారా సమస్యలు, పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పట్ల అవగాహన తరువాయి 6లో

కుంచెపోటు



ఆయనా వ్యవసాయం చేస్తున్నారట, రైతు కష్టాలు అర్థమవుతున్నట్లుంది!



డబ్బులు వెదజల్లి.. దృష్టి మళ్లించి

కారు లూటీ

వరంగల్ బస్టాండ్ వద్ద పట్టపగలు ఘటన

మన తెలంగాణ/ కాశిబుగ్గ : వరంగల్ నగరం నడిబొడ్డున సినిమా పక్కీలో దొంగతనం జరిగింది. కారులో వెళ్తున్న దంపతుల దృష్టి మళ్లించి తరువాయి 6లో

రాజ్యసభకు

సంతన్న?

మన తెలంగాణ / హైదరాబాద్ : రానున్న ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు కేంద్ర రాజకీయాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించే పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో సిఎం కెసిఆర్ సైతం ఆ దిశగా ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే లోక్‌సభలో 14 మంది, రాజ్యసభలో ముగ్గురు ఎంపిలు ఉండగా, ఏప్రిల్ నాటికి మరో ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఎన్నిక కానున్నారు. దీంతో పార్లమెంటులో ఎంపిల సంఖ్య ఇరవైకి చేరుకోనుంది. కొత్తగా ఎన్నికయ్యే ముగ్గురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరు 'యాదవ్' ఉంటారని సిఎం కెసిఆర్ ఇప్పటికే స్పష్టంగా ప్రకటించారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు ఆయన చేదోడు వాదుడుగా ఉండే సన్నిహిత బంధువు జోగినపల్లి సంతోష్‌కుమార్ పేరు తరువాయి 6లో



గోదావరి ఖనిలో

విష వాయువులు

- తక్షణమే స్పందించిన అధికారులు
- గని పనిలో ఉన్న 180 మంది కార్మికులు క్షేమం

మన తెలంగాణ/ గోదావరిఖని: జిడికె 1వ బొగ్గుగని 33వ డిప్ 44వ సీమ్‌లో విషవాయువులు వెలువడ్డాయి. ఈ ప్రమాదంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదు. అయితే విషవాయువుల ప్రభావంతో అస్వస్థతకు గురైన కొంత మంది కార్మికులను ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా పనిచేస్తున్న మరికొంత మంది కార్మికులను గని ఉపరితల ప్రాంతాలకు తరలించారు. గోదావరిఖని 1వ గనిలో కార్మికులు 2వ షిఫ్టులో పనికి వెళ్లారు. గని అధికారులు సూచించిన ప్రాంతంలో వారు పనిచేస్తున్నారు. అంతకుముందే అక్కడ సేఫ్టీవాల్‌ని ఉంచారు. అదే ప్రాంతంలో శనివారం కార్మికులు పనిచేస్తున్న క్రమంలో విషవాయువులు వెలువడడం గుర్తించారు. కార్మికులు శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులకు గురయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న సేఫ్టీ విభాగం, గని ఉన్నతాధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకొని ప్రమాద తీవ్రతను తరువాయి 6లో

పని పాట లేనివారే విమర్శలు చేస్తున్నారు : జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకర్

మన తెలంగాణ /హైదరాబాద్/ముషీరాబాద్ : ఎవరో కొంత మంది పని పాట లేని వారు తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కోలపై విమర్శలు చేస్తున్నారని, విద్యుత్‌ను ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారని, వారికే ఒకే సవాల్ అని విద్యుత్ కొనుగోలులో ఒక్క రూపాయి కూడా వృధా అయినట్లు రుజువు చేస్తే ఏ వేదికపైనా అయినా, ఎక్కడైనా చర్చకు సిద్ధమని, ఏ శిక్ష వేసినా శిరసావహిస్తామని తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి డి.ప్రభాకర్‌రావు సవాల్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన తొలి రోజుల్లో 6570 మెకావాట్లకు విద్యుత్‌ను ఇప్పుడు 14,890 మెగా వాట్లకు పెంచామన్నారు. విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్ల అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (విఎఒఎటి) ఆధ్వర్యంలో అకౌంట్స్ ఆఫీసర్స్ 2018డైరీ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి డి.ప్రభాకర్‌రావు హాజరై డైరీ ఆవిష్కరించి ప్రసంగించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందచేస్తున్నామంటే అది సీఎం కేసిఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిల సలహాలు, సూచనలతో పాటు విద్యుత్ రంగం ఉద్యోగులు, కార్మికుల కృషి ఎంతో ఉందన్నారు. 99 శాతం నిరంతరాయంగా విద్యుత్‌ను అందచేస్తున్న రాష్ట్రంగా దేశంలో తెలంగాణకు ఘనత ఉందన్నారు.



10 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఆదేశం



మన తెలంగాణ/హైదరాబాద్ : సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 10 మెగావాట్ల సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయాలని సింగరేణి సిఎండి ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. నగరంలో శనివారం ఆయన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోలార్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలని అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం డిసెంబర్ నెలలో జాతీయ స్థాయిలో 4వ స్థానాన్ని సాధించడంపై అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దీనిని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలపడానికి అధికారులు, ఉద్యోగులు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ నెలలో ఎన్‌టిపిసి యూనిట్ వన్ ప్లాంటు వంద శాతం పిఎల్‌ఎఫ్, యూనిట్ 2 ప్లాంటు 99 శాతం సాధించడంపై అభినందనలు తెలిపారు. డిసెంబర్ నెలలో స్టేషన్ సాధించిన 99.5 శాతం పిఎల్‌ఎఫ్ వలన ఈ దేశంలోని అత్యుత్తమ 25 ప్లాంటుల జాబితాలో 4వ స్థానం సాధించగలిగిందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 3 నెలల్లో కూడా మంచి సామర్థ్యంతో పని చేసి అత్యుత్తమ పిఎల్‌ఎఫ్‌తో దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి ఎదగాలని ఆయన అధికారులను కోరారు. ఇది సింగరేణికి, రాష్ట్రానికి మంచి పేరు తెస్తుందని పేర్కొన్నారు. ప్లాంటు ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ తెలంగాణా రాష్ట్రానికి 10,658 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశామని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును అందిస్తున్న నేపథ్యంలో పూర్తి సామర్థ్యంతో ప్లాంటు నుండి విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలని అధికారులకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

ఫిబ్రవరి 15లోగా మిడ్‌మానేరు పనులు పూర్తి

అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం



మన తెలంగాణ/హైదరాబాద్ : మిడ్ మానేరు ప్రాజెక్టు గెట్ల బిగింపు సహా అన్నీ సివిల్, మెకానికల్, సాంకేతిక పనులన్నీ ఫిబ్రవరి 15వ తేదీ లోపు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు ఊపందుకున్నందున ఆ ప్రాజెక్టులో మిడ్ మానేరు పూర్తి కావడం అత్యంత కీలకమన్నారు. జలసౌధలో శనివారం మిడ్ మానేరు పనుల పురోగతిని, భూ నిర్వాసితుల నష్టపరిహారం, పునరావాస కార్యక్రమాలను మంత్రి సమీక్షించారు. మిడ్ మానేరు భూనిర్వాసితుల నష్టపరిహారం కోసం తప్పుడు అఫిడవిట్లు సమర్పించిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి అఫిడవిట్లు జారీ చేసిన మండల అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని మంత్రి ఆదేశించారు.నిర్వాసితుల నష్టపరిహారం చెల్లింపుల సందర్భంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామంలోనూ నిజ ధృవీకరణ చేయాలని కోరారు. ముంపునకు గురయ్యే స్ట్రక్చర్ల అంచనాలు రూపొందించడంలో అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిడ్ మానేరులో మొత్తం 25 గెట్ల ఫ్యాబ్రి కేషన్ పనులు, బిగింపు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన కోరారు.ఇందులో 24 గెట్ల ఫ్యాబ్రుకేషన్ పూర్తయినట్టు ఏజెన్సీ ప్రతినిధులు మంత్రికి చెప్పారు. మిడ్ మానేరులో భాగంగా నిర్వాసితులైన వారికి స్ట్రక్చర్ల నష్టపరిహారం కింద రూ. 40 కోట్లు, వారి రీ సెటిల్మెంట్ , పునరావాసం కోసం మరో రూ.25 కోట్లు మంజూరు చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

మిడ్ మానేరు కింద ముంపునకు గురవుతున్న 7419 ఇండ్ల లో ఇప్పటికే 3 వేలకు పైగా ఇండ్లు నిర్మిచ్చినట్లు సిరిసిల్ల రాజన్న జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ మంత్రికి వివరించారు. మరో 1500 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నట్టు కలెక్టర్ చెప్పారు.మిగతా వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 7419 ఇండ్లు కోల్పోయిన వారిలో 7159 ఇండ్లకు పరిహారం చెల్లించినట్లు హరీష్ రావు చెప్పారు. మిగతా 260 ఇండ్ల పరిహారాన్ని వారం రోజుల్లో చెల్లించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. మిడ్ మానేరు రికార్డు వ్యవధిలో పూర్తి చేసినా ఆర్ అండ్ ఆర్ సమస్యలు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. మిడ్ మానేరు పరిధిలో ముంపునకు గురయ్యే గ్రామాల నిర్వాసితులకు, ప్రాజెక్టు నిర్మాణంలో నిరాశ్రయులైన కుటుంబాలకు పరిహారం చెల్లింపులు వెంటనే జరపాలని జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, జాయింట్ కలెక్టర్ యాస్మిన్ బాషాను ఆదేశించారు. నిర్వాసితుల ఇళ్ళకు ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద నిధులు మంజూరు చేయాలని గృహనిర్మాణ శాఖ ఎం.డి.చిత్రా రామచంద్రన్ ను మంత్రి ఆదేశించారు. మిడ్ మానేరు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 639 కోట్లు అని రాష్ట్రం ఏర్పాటు కు ముందు దాదాపు 11 సంవత్సరాలలో రూ. 107 కోట్లు ఖర్చు చేశారని, టిఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 358 కోట్లు ఖర్చు చేసిందన్నారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ సి. ఎస్. జోషి, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వికాసరాజ్,రాజన్న జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, జె.సి .యాస్మిన్ బాషా, ఇఎన్సి.మురళీధరరావు, సిఈలు అనిల్, ఒఎస్‌డి.దేశ్ పాండే పాల్గొన్నారు.

చనాకా కోరటా ఆలస్యంపై ఆగ్రహం

చనాకా కోరటా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మంత్రి హరీష్ రావు ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పనులునత్త నడకన సాగుతుండడంపై అధికారులు, ఏజెన్సీలపై మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు 1000 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు జరగని పక్షంలో ఏజెన్సీని మార్చుతామని ఆయన హెచ్చరించారు. 15 రోజులలో పనుల పురోగతి లేకపోతే సంబంధిత ఏజెన్సీలపై అగ్రిమెంటు క్లాజు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చనాకా కొరటా బ్యారేజే, పంపు హౌజ్, గ్రావిటీ కెనాల్, సబ్ స్టేషన్లు, టవర్ల నిర్మాణం, గెట్ల నిర్మాణం, బిగింపు తదితర పనులను హరీష్ రావు సమీక్షించారు. మార్చి నెలాఖరు లోపున బ్యారేజి పియర్స్‌ను బ్రిడ్జి లెవల్ వరకు లేపాలని, ఈలోగా గెట్ల తయారీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జనవరి 15 లోపు సర్జ్ పూల్ డిజైను, డెలివరీ సిస్టమ్, ప్రజర్ పైపు లైను వ్యాలీ క్రాసింగు డిజైన్లను పూర్తి చేయాలని సిడిఓసిఈ ని ఆదేశించారు. మిగిలిన పైపులైను నిర్మాణాన్ని మార్చి చివరిలోగా పూర్తి చేయాలని హరీష్ రావు కోరారు. పవర్ లైన్స్ ఏర్పాటుకు 11 లోకేషన్స్ లో భూయజమానులతో ఇబ్బందులు ఉన్నట్టు ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశరావు మంత్రికి తెలిపారు. దీనిపై ఆదిలాబాద్ జిల్లా మంత్రి జోగు రామన్నతో హరీష్ రావు ఫోన్ లో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

11న పిసిబి పోస్టులకు ధృవపత్రాల పరిశీలన

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పిసిబి)లో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, అనలిస్ట్ (గ్రేడ్–2, స్టేనో కమ్ టైపిస్ట్ పోస్టులకు ఈ నెల 11న టిఎస్‌పిఎస్‌సి కార్యాలయంలో ధృవపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు కమిషన్ కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలోA తెలిపారు. అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

స్టాఫ్‌నర్స్ నోటిఫికేషన్‌లో అదనంగా 1,361 పోస్టులు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో మొత్తం 1,603 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో ఇప్పటికే 242 పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో అదనంగా 1,361 ఖాళీలను కలుపుతున్నామని టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

మూడు నెలల్లో రూ.500 కోట్ల ఉపాధి పనులే లక్ష్యం

మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



మన తెలంగాణ/హైదరాబాద్ : మూడు నెలల్లో రూ.500 కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులను పంచాయతి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల (డిఆర్‌డిఒ)లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 2017, 2018 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్క కూలీకి 100 రోజుల పని దినాలు కల్పించే లక్ష్యంతో కార్యక్రమాలను రూపొందించుకోవాలని సూచించారు. రాబోయే మూడు నెలల కాలంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో కనీసం 500 కోట్ల విలువైన వేతన పనులు చేయించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామ పంచాయతి భవనాలు, వైకుంఠ దామాలు, స్కూల్ టాయిలెట్స్, ఫార్మా పాండ్స్ వంటి కార్యక్రమాలన్నింటిని మార్చి 31వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు.

ఈ సంవత్సరం చివరి నాటికి ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా లక్ష్యం పెట్టుకొని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు సంబంధించి సస్పెండ్ అకౌంట్స్‌లో జమ అయిన డబ్బులను బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాలు తీయించి కూలీల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ఉపాధి హామి పథకం కింద పండ్ల తోటల పెంపకం లక్ష్యం పూర్తి చేయాలని, ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఉపాధి హామి పనుల గురించి ప్రతి గ్రామంలో మైక్‌సెట్ ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడంతో పాటు వచ్చేఏడాదిలో మొక్కలను నాటడానికి నర్సరీలను పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని మంత్రి జూపల్లి దిశానిర్దేశం చేశారు. అలాగే రూర్బన్ పథకం కింద మంజూరైన అన్ని క్లస్టర్లలలో పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలలో వాటర్ షెడ్ కార్యక్రమంలో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేసి భూగర్భ జలాలను పెంపొందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్, అధికారులు సైదులు, జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మెరుగైన మద్దతు ధరలిస్తాం

పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి

మన తెలంగాణ/ఆర్మూర్ (నిజామాబాద్ జిల్లా): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆర్మూర్ వేదికగా రైతులకు వరాల జల్లును కురిపించారు. శనివారం ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామంలో జరిగిన రైతు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ స్పీకర్ కెఆర్ సురేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ తాము 2019 ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని, అధికారం చేపట్టిన 100 రోజుల్లో 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని, రాష్ట్రంలో ఉన్న సుమారు 7 లక్షల రైతుల పంటల బీమాను తమ ప్రభుత్వమే భరిస్తుందని, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి రూ.5 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ను రైతుల కోసం కేటాయిస్తామని, పండిన అన్ని పంటలను కొనుగోలు అయ్యే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని, కౌలు రైతులను కూడా అదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కల్తీ విత్తనాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా విభాగాలను, ఎప్పటికప్పుడు భూ రికార్డుల ప్రక్షాళన, నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి రైతులకు అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. దీనితో పాటు ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర వరి ధాన్యానికి 1590 రూపాయలు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం 2000 రూపాయలకు తక్కువ కాకుండా కొంటామని అలాగే వరి, సాధారణ రకానికి ప్రస్తుతం రూ॥ 1470 ఉంటే రూ॥ 2000 లకు, పత్తి పంటకు రూ॥ 4320 నుండి రూ॥ 6000లకు, పత్తి మధ్య రకానికి రూ॥ 3860 ఉంటే రూ॥ 6000లకు, మొక్కజొన్న రూ॥ 1425 నుండి రూ॥ 2000లకు, సోయాబిన్ రూ॥ 2775 నుండి రూ॥ 3500 లకు, కందులు రూ॥ 5050 నుండి రూ॥ 7000లకు, మినుములు రూ॥ 5000 నుండి రూ॥ 7000 లకు, పెసలు రూ॥ 5225 నుండి రూ॥ 7000 లకు, వెరుశేనగ రూ॥ 4220 నుండి రూ॥ 5000 లకు, పొద్దుతిరుగుడు రూ॥ 3950 నుండి రూ॥ 5000లకు, సజ్జలు రూ॥ 1330 నుండి రూ॥ 2000లకు, జొన్నలు (హైబ్రిడ్) రూ॥ 1625 నుండి రూ॥ 2000లకు, జొన్నలు (మలదండి) రూ॥ 1650 నుండి రూ॥ 2000లకు, మిర్చి రూ॥ 10000లకు, పసుపు రూ॥ 10000లకు, ఎర్రజొన్నలు రూ॥ 3000లకు తగ్గకుండా కొనుగోలు చేస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు వరాల జల్లును కురిపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు మారుతాయని తలచిన రైతులకు తము తలచింది ఒకటైతే కెసిఆర్ ప్రభుత్వం పాలనలో మరోకటి జరుగుతుందని ఆయన మండిపడ్డారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర, రైతు రుణాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ఉద్యమ సమయంలో హామీలిచ్చిన కెసిఆర్ నాటి మాటను మరిచి రైతుల వెన్నువిరిస్తున్నారన్నారు. ఆర్మూర్ ప్రాంతాంలో పలు మార్లు కెసిఆర్ పర్యటించి ఇక్కడి ప్రాంత రైతులు పండించే పసుపు, ఎర్రజొన్న, సజ్జ మొక్కజొన్న పంటలు రాష్ట్రంలో మరెక్కడా పండవని ఇక్కడి రైతులను ఆహార ఉత్పత్తిని చేసే ధాన్యగారంగా అభివర్ధించి వారికి ఏదో చేస్తానని హామీలిచ్చి ముఖం చాటేసారని అన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించని కెసిఆర్ ప్రభుత్వ పాలనలో రైతులు చితికి పోతున్నారని కాంగ్రెస్ పార్టీ హయాంలో ఏర్పాటు చేసిన పసుపు పరిశోధన కేంద్రాలకు రూపాయి నిధులను కేటాయించకుండా మరుగున పడేశారని ఆయన ఆగ్రహించారు. దఫాదఫాలుగా చేస్తున్న రుణమాఫీ వడ్డీలను ప్రభుత్వమే భరిస్తుందని అంసెబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మాటలు నీటి మూటలుగానే మారి వడ్డీ భారం రైతులపై పడిందన్నారు. నాలుగు సంవత్సరాల టిఆర్‌ఎస్ ప్రభు త్వం రూ. 5లక్షల కోట్ల బడ్జెట్ ను ప్రకటించినప్పటికీ ఐదు రూపాయలను కూడా రైతుల మద్దతు ధరలకు గాని, రైతు అవసరానికి ఉపయోగపడే పనిముట్ల కొనుగోలు చేయ డానికి ఉపయోగించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ మాజీ ఎం.పి మధుయాష్కి గౌడ్, కామారెడ్డి యం.ఎల్.సి షబ్బీర్ అలీ, నిజామాబాద్ యం.ఎల్.సి ఆకుల లలిత, జగిత్యాల ఎంఎల్‌ఏ జీవన్ రెడ్డి, మాజీ జుక్కల్ ఎమ్మెల్యే గంగారాం, మాజీ ఎం.ఎల్.ఏ అనిల్, కొదాంరెడ్డిలు పాల్గొన్నారు.



అమరావతి భవనాల పరిశీలనకు మరి రెండు కమిటీలు

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజనకు రెండో అడుగు పడింది. అమరావతిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఏర్పాట్లు, భవనాల పరిశీలనకు ఐదుగురు న్యాయమూర్తులతో ఒక కమిటీతోపాటు మరో రెండు కమిటీలు శనివారం ఏర్పాటయ్యాయి. ఉద్యోగుల విభజన, రికార్డుల డిజిటలైజేషన్‌లకు మరి రెండు కమిటీలను కూడా ఏర్పాటు చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల విభజన కమిటీలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇతర న్యాయమూర్తులు సురేష్ కుమార్‌కైత్, రాజశేఖర్‌రెడ్డి, శంకరనారాయణ, షమీమ్ అక్తర్ ఉన్నారు.రికార్డుల డిజిటలైజేషన్ కమిటీలో న్యాయమూర్తులు సీవీ నాగార్జునరెడ్డి, సంజయ్‌కుమార్, నవీన్‌రావు, ఎస్వీ భట్, దుర్గాప్రసాదరావులున్నారు. అమరావతిలో తాత్కాలికం భవనాల పరిశీలన కమిటీలోన్యాయమూర్తులు రామసుబ్రమణియన్, ప్రవీణ్‌కుమార్, శేషసాయి, సునీల్‌చౌదరి, సత్యనారాయణమూర్తి ఉన్నారు.

నిరుపేదలకు వరం కళ్యాణలక్ష్మి

రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



మన తెలంగాణ/పరిగి(వికారాబాద్ జిల్లా):నిరుపేదల పాలిట వరంగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం మారిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పరిగిలో శనివారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.రాంమ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓమర్ జలాల్, టిఆర్‌ఎస్ నాయకులు కొప్పుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లు నిరుపేదలకు భారం కాకూడదని మన ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను తీసుకువచ్చి వారికి ఆసరాగా నిలిచారన్నారు. అనంతరం పరిగి, పూడూరు మండలాల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ విశ్వనాథం, తహసిల్దార్ ఆబేద్‌అలీ, జెడ్పీటీసీ పద్మమ్మ, నాయకులు నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొయ్యల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉప్పరి రవి, సర్పంచ్ అంతిగారి విజయమాల, నాయకులు బి.నారాయణరెడ్డి, బేతు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రవి, సర్పంచులు మదుసూదన్, చిల్కమర్రి వెంకటేష్, అంతిగారి సురేందర్‌కుమార్, ఎర్రగడ్డపల్లికృష్ణ, లాల్‌కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూల రాజధానిగా హైదరాబాద్



మన తెలంగాణ/హైదరాబాద్ : భవిష్యత్తులో హైదరాబాద్‌ను పూల రాజధానిగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వేంకటేశం అన్నారు. నగరంలోని మ్యారీగోల్డ్ హోటల్లో శనివారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్‌తో కలిసి అంతర్జాతీయ 20వ ఇకబెన పూల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రదర్శన రెండు రోజుల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ సంవత్సరానికి బాస్కెట్స్ అండ్ బ్లూమ్స్ థీమ్‌తో భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో లభించే పూలతో ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. ఇకబెన జపాన్ నుంచి వచ్చిన సంప్రదాయం కాగా ఇది బుద్ధున్ని ప్రత్యేకంగా పూజించే పద్ధతని అన్నారు. మనుష్యుల జీవితాల్లో పూల ప్రదర్శనలు ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రధాన వేదికను, బతుకమ్మ సంబరాల్లో అందమైన పెద్ద బతుకమ్మను అందంగా అలంకరించిన ఘనత ఇకబెన ఇంటర్నేషనల్ ఫ్లవర్ అసోసియేషన్‌కి దక్కుతుందన్నారు.

గుజరాత్‌లో ప్రజలు కాంగ్రెస్‌కు సరైన బుద్ధి చెప్పారు : డాక్టర్ కె.లక్ష్మణ్



మన తెలంగాణ/వేములవాడ: గుజరాత్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు సరైన బుద్ధి చెప్పారని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె లక్ష్మణ్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలో జరిగిన బిజెపి దళిత మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాహుల్‌గాంధీ, విచ్ఛిన్నకర్త శక్తులతో జతకటి గుజరాత్ ఎన్నికల్లో రెచ్చగొట్టినా ప్రజలు తమ ఓటుహక్కుతో గుణపాఠం చెప్పారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుండగా కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికార కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయాత్నాం చేసిందన్నారు. గుజరాత్ ఎన్నికల ఫలితాలే మోడీ పాలనకు నిదర్శమన్నారు. 2018 సంవత్సరం ఎన్నికలకు సిద్ధమయ్యే సంవత్సరంగా భావించి బిజెపిని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దళితుల జనాభా 16శాతం ఉందనీ, రానున్న రోజుల్లో ప్రభుత్వాల ఏర్పాటులో దళితుల పాత్ర అత్యంత కీలకం కాబోతుందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన మాటలను, వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందనీ, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో బిజెపి దళిత మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి రాము, రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్, ప్రధాన కార్యదర్శి గడ్డం నాగారాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు కుమ్మరి శంకర్, బిజెపి పట్టణ అధ్యక్షుడు జంగం రాజేందర్‌లతో పాటు తదితరులు ఉన్నారు.

అసూయతోనే విమర్శలు

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వం విజయవంతంగా వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ ఇస్తుండడంతో కొంత మంది అసూయతో విమర్శలు చేస్తున్నారని, దీన్ని విద్యుత్ ఇంజనీర్లు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని టిఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు పిలుపునిచ్చారు. పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నాడు 'పవర్ ఇంజనీర్స్ డైరీ – 2018'ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల రాత్రింబవళ్లు కష్టపడి, కోతలు లేకుండా కరెంటు ఇస్తూ పురోగతి సాధిస్తుంటే కొంత మంది ఓర్వడం లేదన్నారు. గతంలో యూనిట్‌కు రూ.11 వెచ్చించి మరీ కొనుగోళ్లు చేసిన సందర్భాలు ఉన్నాయని, అటువంటి సందర్భాలు రాకుండా ముందస్తుగా టెండర్లు పిలిచి కొనుగోలు ఒప్పందాలు చేశామని స్పష్టం చేశారు. పదే పదే పిఎల్‌ఎఫ్ తగ్గిందంటూ విమర్శలు రావడంపై ప్రభాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఎల్‌ఎఫ్ కాదు విద్యుత్ లభ్యత, కారిడార్ లభ్యత ముఖ్యమని వివరించారు. చత్తీస్‌గడ్ ప్రభుత్వంతో కొనుగోలు ఒప్పందం చేసుకున్నందుకే కారిడార్ లభించిందని, రూ.12,300 కోట్లతో విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామన్నారు. గరిష్టంగా 9500 మెగావాట్ల డిమాండ్‌ను చేరుకున్నామని, వచ్చే మార్చిలో 11,000 మెగావాట్ల డిమాండ్ వచ్చిన సరఫరాకు లోటు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం పూట 7 నుంచి 8 గంటల మధ్యనే పీక్ డిమాండ్ ఉంటుందని, ఆ సమయంలో సోలార్ విద్యుత్ కూడా ఉత్పత్తి కాదని, దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు కొనుగోళ్లు చేస్తున్నామని వివరించారు. మార్చి 15 వరకు అదనంగా 500 మెగావాట్ల కొనుగోలుకు టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. బ్యూరోక్రాట్లకు బదులుగా టెక్నోక్రాట్ల చేతిలో విద్యుత్ సంస్థలు ఉండడం, ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించడం మూలంగానే నిరంతర విద్యుత్ సాధ్యమయ్యిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అంతర్గతంగా ఖర్చులు భారీగా తగ్గించుకోవాలన్నారు.

పైసా వసూలు కాని ఆస్తులపై

పురపాలక శాఖ నజర్



- 63 పురపాలికలలో తప్పుడు కొలతలు
- ఆదాయాన్నిపెంచే దిశగా చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్: ఇప్పటి వరకు ఒక్క పైసా వసూలు కాని ఆస్తుల నుంచి పన్నులను వసూలు చేసేందుకు పురపాలక శాఖ సన్నద్ధమైంది. అలాగే తప్పుడు కొలతలు చూపి తక్కువ ఆస్తి పన్ను కడుతున్న వాటిపై కూడా దృష్టి సారించింది. ఏ పురపాలికల పరిధిలో పైసలే వసూలు కాని ఆస్తి పన్నుల వివరాలు, తప్పుడు కొలతలు ఉన్న అసెస్‌మెంట్ల వివరాలతో కూడిన జాబితాను ఆయా పురపాలికలకు అందజేసింది. తప్పుడు కొలతల సవరణ, పన్నుల వసూల ప్రక్రియను ఈ నెలాఖరుల వరకు పూర్తి చేసి, తమకు నివేదికను అందించాలని స్థానిక సంస్థలను పురపాలక శాక ఆదేశించినట్లు తెలిపింది. రాష్ట్రంలోని 63 పురపాలికలలో పన్ను చెల్లింపులకు, ఆస్తుల కొలతలకు మధ్య వ్యత్యాసం బాగా ఉందని, దీనికి సంబంధించిన అసెస్‌మెంట్లలలో తప్పుడు కొలతలు ఉండగా, మరో వైపు 43 పురపాలికలలో ఒక పైస కూడా చెల్లించని వారు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుత విధానంలో ఉన్న లోపాలను గుర్తించి వాటిని సవరిస్తే మరింత పన్నులు వసూలయ్యే అవకాశం ఉంటుందని అధికారులు నిర్ణయించారు. తప్పుడు కొలతలు, ఇప్పటి వరకు పైసా చెల్లించని ఆస్తులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన అధికారులు ఈ పక్రియను మూడు విభాగాలుగా విభజించి, ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఆదాయాన్ని పెంచుకునేందుకు పురపాలక శాఖ ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే జిఐఎస్ విధానం ద్వారా ఇప్పటి వరకు పన్నులను చెల్లించని సుమారు 16వేల కొత్త ఆస్తులను గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా ఆస్తులకు తగినట్టుగా పన్నులు వసూలు అవుతున్నాయా ..? లేదా అని ఆరా తీయగా ఇందులో 63 పురపాలికల పరిధిలో సుమారు 13.113 అసెస్‌మెంట్లలో ఉన్న తప్పుడు కొలతలు ఉన్నాయి. ఇందులో మొదటి స్థానంలో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 1484 అసెస్‌మెంట్లు ఉండగా, మరో 43 పురపాలికల పరిధిలో సుమారు 1394 అసెస్‌మెంట్ల నుంచి ఇప్పటి వరకు ఒక పైసా కూడా వసూలు కాలేదు. ఇందులో వనపర్తి పురపాలికలో 324 అసెస్‌మెంట్లు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు ఒక పైసా చెల్లించాని అసెస్‌మెంట్ల ద్వారా ఆస్తి పన్ను ఎంత వరకు వసూలు అవుతుందో కూడా ఒక అంచనాతో కూడిన నివేదికను తమకు అందించాలని పురపాలక శాఖకు ఆదేశించింది.

ప్రభుత్వ కార్యాలయాలపై కూడా నజర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు నెలకొన్న భవనాలకు సంబంధించి ఆస్తిపన్నులపై పురపాలక శాఖ సమీక్షించనుంది. కొన్ని కార్యాలయాలకు సంబంధించి యజమాని పేర్లు అసెస్‌మెంట్లలో తప్పుగా ఉన్నాయని, వాటిని కూడా సవరించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పురపాలిక పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన ఆస్తిపన్నుల వివరాలను, వాటికి సంబంధించిన యాజమాని పేర్లపై ఆరా తీస్తోంది. దీనికి సంబంధించిన అసెస్‌మెంట్లలో తప్పుగా ఉన్న పేర్లను సవరించాలని అధికారులను ఆదేశించింది. అసెస్‌మెంట్ల సవరణ పక్రియను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయడంతో పాటు తీసుకున్న చర్యలపై పూర్తి స్థాయి నివేదికను తమకు అందించాలని స్థానిక సంస్థలను పురపాలక శాఖ ఆదేశించింది.

నెలాఖరులో ఇంటింటికీ భగీరథ తాగు నీరు

ఎల్‌ఎండిలో మిషన్ భగీరథ పనుల పరిశీలన - మంత్రులు ఈటల, తుమ్మల తదితరులు



మన తెలంగాణ / తిమ్మాపూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి గ్రామానికి ఈ నెల చివరి వరకు తాగు నీరు అందిస్తామని మంత్రులు ఈటెల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండి లోని మానేరు జలాశయం వద్ద గల ఇంటెక్ వెల్, నీటి శుద్ధీ ట్యాంకు లను మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి , మంత్రు లు ఈటెల రాజేందర్ ,తుమ్మల నాగేశ్వర్ రావు, ,సిఎం పర్సనల్ సెక్రెటరీ స్మిత సబర్వాల్ లు శనివారం పరిశీలించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పనుల ప్రగతి పై చైర్మన్ ఆయా అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల్లో పంపుసెట్ల పనులు పూర్తి చేసి ఈ నెల 15 న ట్రయల్ రన్ నిర్వహించాలని ఆదేశించారు. పనుల్లో ఆలస్యం అయితే ఉపేక్షించేది లేదని, ఆయా పనుల వివరాలను రోజు వారిగా ముఖ్యమంత్రి కార్యదర్శి , స్థానిక ఎమ్మెల్యేలకు,తనకు అందించాలని అన్నారు. ముఖ్యమంత్రి కి సిద్దిపేట పై ప్రత్యేక దృష్టి ఉన్నందున పనులు త్వరగా పూర్తి చేసి నివేదిక అందించడంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇప్పటికి వరకు తెలంగాణలో 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని,త్వరలోనే 20 వేల ఆవాసాలకు నది జలాలను శుద్ధీ చేసి శుద్ధమైన నీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఎన్‌బి రోడ్ల వల్ల కొంత మేర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్‌ఈ తెలుపగా అధికారులు సంయుక్తంగా పని చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. ఇంటింటికి తాగు నీరు అందించే వరకు ఓట్లు అడగమని ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు కట్టుబడి ఉన్నామని జనవరి నెల చివరి వరకు ఇంటింటికి తాగు నీరు అందిస్తామని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.మిషన్ భగీరథ పనులు ఛాలెంజ్ గా చేస్తున్నామని గ్రామాలలో సమస్యలను ఎప్పటికప్పుడు స్థానిక ఎమ్మెల్యేలు ప్రతి నెల సమీక్షా సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. మొదటి విడత కింద పూర్తి స్థాయిలో నీరందించగా రెండో విడత వర్షాకాలంలోనే పూర్తి చేస్తామన్నారు. రెండవ ఫేస్ కింద పాత పైపు లైన్‌లు స్థానంలో కొత్త వాటిని అమర్చి మిగిలి పోయిన పనులు పూర్తి చేసి అందరికి నీరందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్,గంగుల కమాలకర్, సోమారపు సత్యనారాయణ,పుట్ట మధు, ఎంఎల్‌సి నారదాస్ లక్ష్మ ణ్ రావులు ఉన్నారు .

ఎఐటియుసి నూతన డైరీ ఆవిష్కరణ



మన తెలంగాణ/హైదరాబాద్ : అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శనివారం వారు ఎఐటియుసి రూపొందించిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రూపొందించిన 2018 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎఐటియుసి 98 సంవత్సరాలుగా దేశంలోని శ్రమ జీవులను సంఘటితపరుస్తూ వారి న్యాయమైన హక్కుల కొరకు ఉద్యమిస్తుందన్నారు. 2018 సంవత్సరంలో ఉద్యోగ, కార్మికుల సమస్యలపై అన్ని కార్మిక సంఘాలతో ఐక్య ఉద్యమాలను చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, కనీస వేతనం, సమాన పనికి సమాన వేతన విధానం అమలుకు ఇపిఎఫ్, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఎఫ్‌ఆర్‌డిఐ చట్టంలో పెన్షన్ డిపాజిటర్లకు గ్యారంటీ, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డైరీలో కార్మిక చట్టాలు, అణలు తీరు తెన్నులతో పాటు కార్మికులకు ఉన్న ఉద్యోగ భద్రత సంక్షేమ చట్టాలు తదితర అంశాలు పొందుపర్చబడినవి. ఈ డైరీ కార్మికులకు, సంఘాల నాయకులకు ఉపయోగపడే విధంగా ఉన్నదని తెలిపారు.

పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు అత్యుత్తమ గుర్తింపు

- దేశంలోనే రెండవ స్థానం
- బహుమతిని అందుకున్న ఇన్‌స్పెక్టర్ రవీందర్



మన తెలంగాణ/సిటీబ్యూరో : నాణ్యమైన సేవలు అందిస్తున్న నగరంలోని పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు దేశంలోనే అత్యుత్తమ గుర్తింపు లభించింది. నాణ్యమైన సేవలందించడంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వేలో పంజాగుట్ట పోలీసు స్టేషన్ రెండవ స్థానంలో నిలిచింది. దీంతో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా ఆ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవీందర్ రెండవ బహుమతిని రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి సమక్షంలో అందుకున్నారు. శనివారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని టీకాన్‌పూర్‌లో జరిగిన రాష్ట్రాల డిజిపి, ఐజిపిల వార్షిక సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఈ బహుమతిని రవీందర్ స్వీకరించారు. దేశంలోని పోలీసు స్టేషన్‌లలో అందుతున్న సేవలను ఒక క్రమపద్ధతిలో తీసుకురావడానికి ఈ బహుమతులను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశంలో అత్యుత్తమమైన సేవలందిస్తున్న 10 పోలీసు స్టేషన్‌లను గుర్తించడం జరుగుతుంది. ముఖ్యంగా సర్వేలో నాణ్యమైన పోలీసింగ్, పౌరులతో స్నేహభావం అనే అంశంపైనా సర్వే చేపడుతున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆశించిన నాణ్యమైన సేవలు ప్రజలకు అందించడం, సంస్థాపరమైన, వ్యవస్థాపరమైన, సాంకేతికపరమైన బాధ్యతలను ఉత్తమంగా నిర్వర్తించడం జరుగుతుండటంతోనే పంజాగుట్ట పోలీసు స్టేషన్ దేశంలోనే రెండవస్థానను సంపాదించుకున్నట్టు డిజిపి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

విశ్వసనీయ మీడియాకే అండదండలు

ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్

మనతెలంగాణ/హైదరాబాద్ : సమాచార చట్టాన్ని ఆస్ట్రేలియా, కెనడా దేశాలలో జర్నలిస్టులు ఎక్కువగా వినియోగించుకుంటారని, కానీ మనదేశంలో అది తక్కువగా ఉందని కేంద్ర సమాచార కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. విశ్వసనీయత ఉన్న మీడియాకే ప్రజల అండదండలు లభిస్తాయని, దానిని ఎవరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు. ఉస్మానియా యూనవర్సిటీ జర్నలిజం విభాగం, తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 'ఎలక్ట్రానిక్ మీడియా విలువలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాడభూషి శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జర్నలిస్టులు వ్యక్తిగతంగా నైతిక విలువలు కాపాడుకోగలిగితే, తను పనిచేస్తున్న మీడియాకు కూడా విశ్వసనీయత వస్తుందని తెలిపారు. పౌర స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వాతంత్ర్యాన్ని నైతిక విలువలు, విశ్వసనీయత నిలబెడుతాయని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రాధాన్యత కలిగిన సమయంలో సోషల్ మీడియాలో హైలెట్ అయిన అంశాలపైనే చర్చలు నిర్వహిస్తున్నారన్నారు. గత 25 ఏళ్లుగా ఈ దేశంలో ప్రతి 35 నిమిషాలకు ఒక రైతు చనిపోతున్నారని, ఇలాంటి విషయాలు మాత్రం హైలెట్ కావడం లేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ సంపాదకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ, మీడియా అనేది సమాజానికి ప్రతిబింబమని అన్నారు. ప్రైవేట్ మీడియాలో ప్రజల సమస్యలకు కొంత స్థానం ఉందని, యువ జర్నలిస్టులు దానిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. సమస్యలపై మాజీ జర్నలిస్టులే మాట్లాడగలుగుతున్నారని, వర్కింగ్ జర్నలిస్టులు మాట్లాడలేని పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో జర్నలిస్టులు తమ ఆలోచనలు స్వేచ్ఛగా వ్యక్తం చేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వచ్చే మూడేళ్లలో సాటిలైట్ ఛానల్‌కు, యూట్యూబ్ ఛానల్‌కు తేడా ఉండదని తెలిపారు. ఒయు జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ కె.స్టీవెన్‌సన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పిసిఐ మాజీ సభ్యులు లక్షణ్, ప్రముఖ జర్నలిస్టులు సిలువేరు శ్రీశైలం, మోహన్ యాదవ్, వి.రాజేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



చట్టాలు కెసిఆర్‌కు చుట్టాలుగా మారాయి




మన తెలంగాణ/హైదరాబాద్: చట్టాలను సిఎం కెసిఆర్ తన చుట్టాలుగా మార్చుకుంటున్నారని బిజెఎల్‌పి నేత జి.కిషన్ రెడ్డి విమర్శించారు. ఉద్యమాల త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం లీగల్ సెల్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిషన్‌రెడ్డితో పాటు ఎంపి బండారు దత్తాత్రేయ,ఎంఎల్‌సి ఎన్.రాంచందర్‌రావు, మాజీ ఎంఎల్‌ఎ ఎన్.ఇంద్రేనారెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ నర్సింహరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మల్లన్నసాగర్‌లో ఖమ్మంలో రైతులపై కెసిఆర్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమన్నారు. పత్రికా స్వేచ్ఛ హరించే హక్కు ప్రభు త్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. హైకోర్టును సాధించుకోవడంలో బిజెపి లీగల్ సెల్ కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రజా సమస్యలపై కూడా లీగల్ సెల్ పోరాడాలన్నారు. ఎంపి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై లీగల్ సెల్ కీలక పాత్ర పోషించాలన్నారు. భూ సేకరణలో నష్టపోయిన రైతులకు బిజెపి లీగల్ సెల్ న్యాయవాదులు అండగాఉండాలని సూచించారు. ఎంఎల్‌సిరాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాలో జిల్లా కోర్టులను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. బిజెపి కృషి వల్లనే హైకోర్టు సాకారం కాబోతుందన్నారు. న్యాయవాదులకు రూ. 100 కోట్ల నిధి ఏమైందన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

మన తెలంగాణ/ హైదరాబాద్/ పంజాగుట్ట: ప్రజా స్వామ్యబద్ధంగా ఏర్పడ్డ తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత నిరసనలకు సైతం అవకాశం ఇవ్వకుండా అణిచివేతలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. 23 ఏళ్లుగా శాంతియుతంగా సాగుతున్న వర్గీకరణ ఉద్యమాన్ని కించపరుస్తూ మంద కృష్ణపై అక్రమ కేసులు బనాయించిందని తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరకు సుధాకర్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, విరసం నేత ఖాసిం తదితరులు మాట్లాడారు.

“అధికారం ఉన్నంత మాత్రాన ఎవరూ గొప్ప వారు కాలేరు. దాన్ని వినియోగించే పద్ధతిని బట్టి గొప్పవారవుతారు.
– విలియం జోన్స్”



ఉన్నత విద్యలో తెలంగాణ భేష్

సంపాదకీయం

ఉన్నత విద్యలో విద్యార్థుల స్థూల నమోదు దామాషా(జిఇఆర్)లో తెలంగాణ రాష్ట్రం సాపేక్షికంగా ఉచ్ఛస్థితిలో ఉంది. 2016–17లో అఖిల భారత సగటు జిఇఆర్ 25.2శాతం కాగా తెలంగాణ 35.8శాతం జిఇఆర్ సాధించింది. ఏడేళ్ల క్రితం (2012–13) తెలంగాణ జిఇఆర్ 33.1. అయితే 2016–17లో క్రితం సంవత్సరంతో పోల్చినపుడు స్వల్పంగా – 0.5శాతం తగ్గింది. ఉన్నత విద్య పొందుతున్న మహిళల జిఇఆర్‌లో కూడా తెలంగాణ మంచి వృద్ధిలో ఉంది. జాతీయ సగటు 24.5 శాతం కాగా తెలంగాణ 2012–13లోని 29.3 శాతం నుంచి 2016–17లో 33.6 శాతానికి చేరుకుంది. ఇదేకాలంలో ఎస్‌సిల జిఇఆర్ 1.9శాతం, ఎస్‌టిల జిఇఆర్ 5.7 శాతం పెరిగింది. ఈ తరగతుల జాతీయ సగటు (వరుసగా21.1శాతం, 15.4శాతం) కన్నా ఇది చాలా మెరుగు. ముస్లింల నమోదు 2012–13లో 89,524కాగా అది 2016–17లో 1,16,803కు పెరిగింది. వారిలో మహిళలు 48,670. జిఇఆర్ అనగా సంబంధిత సంవత్సరంలో 18–23 వయో గ్రూపు జనాభాలో ఉన్నత విద్యాసంస్థల్లో చేరినవారి దామాషా. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టరేట్ కోర్సులు సహా ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు దామాషాను లెక్కగట్టే సర్వే 2011లో ప్రారంభమైంది. ఉన్నతవిద్య అఖిల భారత సర్వే(2016–17)నివేదికను కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి ప్రకాశ్ జవదేకర్ శుక్రవారం విడుదల చేశారు.

మరో ఆసక్తికర విషయమేమంటే, అర్హులైన ప్రతి లక్షమంది విద్యార్థులకు కాలేజీల సగటు జాతీయంగా 28కాగా తెలంగాణలో 59. బీహార్ (7), జార్ఖండ్ (8), పశ్చిమ బెంగాల్ (11)అట్టడుగున ఉన్నాయి. ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, ప్రైవేటు కాలేజీల విషయంలో అగ్రస్థానం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లదే కావటం గమనార్హం. ఈ విషయంలో జాతీయ సగటు 77.8శాతం కాగా రెండు తెలుగు రాష్ట్రాల సగటు 81. నగరాల్లో కాలేజీల కేంద్రీకరణను చూస్తే బెంగళూరు(1025కాలేజీలు), జైపూర్ (635) మొదటి రెండు స్థానాల్లో ఉండగా, 487 కాలేజీలతో హైదరాబాద్ మూడవ స్థానంలో, 395 కాలేజీలతో రంగారెడ్డి ఐదవ స్థానంలో ఉన్నాయి. తెలంగాణ 3,461మంది విదేశీ విద్యార్థులతో ఆ కేటగిరిలో ఐదవస్థానంలో ఉంది.


ఈ సంఖ్యలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా చూచినపుడు 2016–17లో వృద్ధిరేటు 1శాతం లోపే ఉండటం నిరాశాజనకం. జాతీయ సగటు జిఇఆర్ 25.2 అంటే అర్హులైన వయోగ్రూపులో 74.8శాతం డిగ్రీవిద్యకు దూరంగా ఉన్నారని గుర్తించాలి. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి నమోదు సంఖ్యలు పెరిగినట్లు జవదేకర్ గొప్పలకు పోవటం హాస్యాస్పదంగా ఉంది. ఆనాడు జిఇఆర్ 23 శాతం. తదుపరి మూడేళ్లలో పెరిగిన జిఇఆర్ 2.2శాతం. అంటే సంవత్సర సగటు 0.73. అంతకు ముందు వృద్ధి 1శాతం పైగా ఉంది.

2022నాటికి 30శాతం జిఇఆర్‌ను ప్రభుత్వం తలపెట్టింది. అది సుదూర స్వప్నంగా కనిపిస్తున్నది. తక్కువ వృద్ధిరేటుకు ప్రధాన కారణం ప్రభుత్వం ఉన్నత విద్యపై మొత్తం జిడిపిలో 1శాతం లోపు మాత్రమే ఖర్చుచేయటమే. అమెరికా జిఇఆర్ 85.8శాతం కాగా, చైనా జిఇఆర్ 43.59, థాయిలాండ్ జిఇఆర్ 48.86 శాతమని గణాంకాలు తెలుపుతున్నాయి. కనీసం థాయిలాండ్ స్థాయిని చేరుకోవాలన్నా మరెన్ని దశాబ్దాలు పడుతుందో!

తెలంగాణ రాష్ట్రం కాలేజీల సగటు సంఖ్యలో, విద్యార్థుల నమోదులో ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ అది ఆత్మసంతృప్తికి తావివ్వకూడదు. ఉన్నత విద్యకు అర్హులైన వయోగ్రూపులో 64 శాతం పైగా కళాశాల విద్యకు వెలుపల ఉన్నారని గణాంకాలు తెలుపుతున్నందున ప్రాథమిక, హైస్కూలు విద్యస్థాయినుంచి డ్రాప్ ఔట్స్‌ను గణనీయంగా తగ్గించటంపై దృష్టిపెట్టాలి. ‘బంగారు తెలంగాణ’ స్వప్న సాకారానికి ‘జ్ఞాన సమాజ నిర్మాణం’ కీలకం. అందువల్ల నూరు శాతం అక్షరాస్యత, మెరుగైన నియత విద్య, వృత్తి నిపుణుల తయారీపై, ఉపాధి కల్పనపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

మాఫియా కేపిటలిజం వ్యాప్తి

చూపు



ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్తరూపు సంతరించుకుంటోంది. దాన్ని ‘మాఫియా పెట్టుబడిదారీ వ్యవస్థ’ అనవచ్చు. అది ఏ రెండు, మూడు కుటుంబాల అదుపులో ఉండే అజ్ఞాత ప్రపంచపు వ్యవస్థ కాదు. మాఫియా కాపిటలిజంలో వ్యవస్థీకృత నేరాల కూటాలు ప్రభుత్వాలతో బంధం పెట్టుకుని పనిచేస్తాయి. తమ కార్యకలాపాలకు ప్రభుత్వ భద్రతా సర్వీసులను వాడుకుని పెట్టుబడిదారీ వ్యవస్థలోని కీలక శక్తులను లోబరుచుకుంటాయి. వికీలీక్స్, పనామా పేపర్స్, పారడైజ్ పేపర్స్ తేల్చినదేమిటి? పెద్దపెద్ద గ్లోబల్ కంపెనీలు భారీ ఎత్తున పన్నుల ఎగవేతకు పాల్పడ్డాయనే కదా. ఆ భారీ నేరాన్ని చాలా సునాయాసంగా కంపెనీలు చేశాయంటే ప్రభుత్వాల కుమ్మక్కుతోనే కదా. అలా అక్రమంగా సంపాదించిన డబ్బును వేరే దేశాలలో పన్నుల సొమ్మును బాదరబందీ లేకుండా దాచేయడం మరిగాయి కంపెనీలు.

తప్పుడు పనులు, నేరాలు సత్ఫలితాలు ఇస్తాయని ఆ అక్రమార్జనపరులు పదేపదే మనకు నిరూపిస్తున్నారు. వ్యక్తులైనా, కంపెనీలైనా అతి సులభంగా పన్నులు ఎగవేయడం ద్వారా అపార ధనాన్ని సంపాదించి, విదేశాల్లో దాచివేయడం సునాయాసంగా చేస్తున్నారంటే అది వ్యవస్థ లోపం. ఇటువంటి నేరాలలో ‘సైబర్ క్రైం’ పద్ధతులను వినియోగించుకోవడం తాజా పోకడ. ఈ అక్రమార్జనతో ‘బూతు పరిశ్రమ’ పరిఢవిల్లడంతో సహా అనేక వక్ర మార్గాలు పెచ్చుపెరగడం జరుగుతోంది. అక్రమ ధనాన్ని దాచేయడమే కాకుండా భద్రమైన పద్ధతులలో మదుపు పెట్టడం కూడా జరుగుతోంది. ఈ సరికొత్త మాఫియా సర్వీసు కార్యకలాపాలు ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ సౌకర్యాలవల్ల మరింత సులభంగా సాగుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఆ నల్లడబ్బును తిప్పుతూ గోప్యంగా వ్యాపార కార్యకలాపాలు సాగించడం నేటి పెద్ద అపసవ్యం. అల్బేనియన్ ముఠాలు మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో ముందున్నాయి. అంతేకాకుండా ఆ ముఠాలు యువతులను ఎత్తుకుపోయి దొంగచాటుగా రవాణా చేస్తున్నాయి. వారందరినీ సెక్స్ బానిసలుగా మార్చేస్తున్నారు. సైబర్ నేరాల సిండికేట్‌లు ప్రస్తుతం తూర్పు యూరప్‌లో అధిక సంఖ్యలో ఉన్నాయి. అల్బేనియన్ ముఠాలు వ్యవస్థీకృత నేరాల్లో ఎంతో చురుకుగా పాల్గొంటున్నాయి. కేవలం యూరప్‌లోనే కాక ఉత్తర, దక్షిణ అమెరికాలలో కూడా అవి విరివిగా ఉన్నాయి. అంతేకాకుండా ఇప్పుడిప్పుడే ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా మధ్యప్రాచ్యం, ఆసియాలకు అల్బేనియన్ ముఠాలు విస్తరిస్తున్నాయి.

అమెరికా విదేశాంగశాఖ చెప్పిన దాని ప్రకారం వ్యవస్థీకృత నేరాలకు అల్బేనియా ప్రథమ స్థానంలో పేరుమోసింది. దీనిది ప్రపంచ స్థాయి. దీని ముఖ్య కార్యకలాపాలు మాదక ద్రవ్యాల, ఆయుధాల, వలస దారుల, నకిలీ వస్తువుల అక్రమ రవాణా. బ్రిటన్ వ్యవస్థీకృత నేరాలపై అల్బేనియా ముఠాల ప్రభావం హెచ్చుగా ఉన్నట్లు ఆ దేశపు జాతీయ క్రైమ్ ఏజన్సీ(ఎన్‌సిఎ) ఒక నివేదికలో ఇటీవల వెల్లడించింది. ఆ పరిస్థితి పట్ల తీవ్ర ఆందోళన ప్రకటించింది. మునుపటి ‘ఈస్టర్న్ బ్లాక్’ దేశాల నుంచి సైబర్ నేరాల ప్రభావం అధికంగా ఉండబోతున్నట్లు కూడా ఆ నివేదిక హెచ్చరించింది. రష్యాలో పెద్దసంఖ్యలో జర్నలిస్టులు, పర్యావరణ కార్యకర్తలు అవినీతిని బయటపెట్టటానికి ఎంతగానో ప్రయత్నించారు. పర్యావరణ నియమాలను భారీ ఎత్తున ఉల్లంఘిస్తున్న కంపెనీల బండారం బయటపెట్టటానికి కూడా వారు ప్రయత్నించారు. వారిపై భౌతిక దాడులు , కొన్ని సందర్భాలలో హత్యలు కూడా జరిగాయి.

దీనినిబట్టి అవినీతి అక్కడ ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. 2006లో మాస్కోలో ప్రముఖ పర్యావరణ జర్నలిస్టు పోలిట్ కోవస్‌కాయాను హత్యచేశారు. రష్యాలో అవినీతి ఎంతగా తీవ్రమైందో బయటపెట్టిన లిట్వేనింకో అనే జర్నలిస్టును కూడా 2006లో మట్టుపెట్టారు. రష్యన్ సీక్రెట్ సర్వీసు సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యాపించాయి. సీ ఆఫ్ జపాన్‌లో అణు వ్యర్థాలను రహస్యంగా మేటలు వేస్తున్న కంపెనీల బండారం బయటపెట్టిన జర్నలిస్టుపై 2016లో తీవ్ర దాడి జరిగింది. 2012లో ముగ్గురు రష్యన్ పర్యావరణ జర్నలిస్టులు అదృశ్యమైపోయారు.

ఇలా అనేక దేశాలలో అనేక హత్యలు,దాడులు అవినీతిని బయటపెడుతున్న వారిపై సాగాయి. 2017లో కూడా ఇలాంటి ఉదంతాలను మీడియా ప్రచారం చేసింది. లాటిన్ అమెరికాలో పరిస్థితి మరింత ఘోరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మెక్సికోలో అంతర్యుద్ధం పరిస్థితులు ఉన్నాయి. దశాబ్దాలుగా అక్కడ నియమపాలన లేనేలేదు. లాటిన్ అమెరికాలో 2012లో 25,000మంది అదృశ్యమయ్యారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆ సంఖ్య 33,000లకు పెరిగింది.

మెక్సికోలో మాత్రం ఎంతమంది మాయమవుతున్నారో లెక్కలేకుండా పోయింది. కొలంబో, బ్రెజిల్, హోండూరస్, గ్వాటిమలాలో అవినీతిని బయటపెట్టేవారు, పర్యావరణ నిపుణులు పాశవిక దాడులకు గురయ్యారు. అన్ని కేసులలో దాడులు జరిపిన వారిపై చట్టబద్ధంగా చర్యలు లేవు.లాటిన్ అమెరికాలో ప్రతి ఏటా పదివేల మందిని మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవహారాలలో చంపుతున్నారు. ఆఫ్రికాలో అవినీతి అన్ని స్థాయిలలో పాతుకుపోయి ఉంది. పాశ్చాత్య పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ అవినీతిని కావాలని పోషిస్తోంది. అవినీతికి ఆస్కారం కూడా అది కల్పిస్తోంది. ఇందుకు ఇజ్రాయెలీ కోటీశ్వరుడు డాన్ గెట్లర్ ఉదంతం ఒక ఉదాహరణ. ఇటీవలే ఇతని చీకటి వ్యవహారాలు బయటపడ్డాయి.

అతడు తన పేరిట గల అంతర్జాతీయ కంపెనీల గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షుడు. వజ్రాలు, రాగి గనులను దోపిడీ చేస్తూ కాంగో డెమొక్రటిక్ రిపబ్లిక్‌ను దగా చేస్తున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక కంట్రోళ్లను సడలించడంతో కొత్త మాఫియా కేపటలిస్టుల పని సులభం అయింది.అక్రమార్కులకు అడ్డూఆపూ లేకుండా పోయింది. అవినీతిలో భారీ ఎత్తు న శిక్షణ కార్యక్రమాలు కూడా పలు దేశాలలో మొదలయ్యాయి. లోపాయికారీ వ్యవహారాలు ఎలా నడపాలి అన్నది అక్కడ నేర్పుతారు. ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులు మాఫియా కేపిటలిస్టులకు అమితానందాన్ని కల్గిస్తున్నాయి.

కఠినమైన ఆర్థిక కంట్రోళ్లు, నియమాలు లేకపోవడంతో మాఫియా ముఠాలు రెచ్చిపోతున్నాయి. అసలు ఆర్థిక వ్యవస్థలపై సార్వభౌమత్వాన్ని ఆపాదించుకునే జాతీయ వాదులు కూడా లేకపోవడం ఈ దుస్థితిని మరింత దిగజార్చుతోంది. చాలా దేశాలలో ఆర్థిక వ్యవస్థలను ప్రభుత్వాల కనుసన్నలలో కాకుండా మాఫియా ముఠాల అదుపాజ్ఞలలో ఉంచే ధోరణి పెరుగుతోంది.

ప్రైవేటీకరణ, మాఫియా కేపటలిజం, ఇష్టానుసారం ప్రభుత్వాలు తమ ఆర్థిక వ్యవస్థలతో వ్యవహరించడం వంటి అపసవ్యాలవల్ల మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ స్వరూపం గుర్తుపట్టలేనట్టు మారిపోతోంది. పెట్టుబడిదారీ విధానాలే ప్రమాదం అనుకుంటే మాఫియా కేపటలిజం ఇంకెంత ప్రమాదమో ఊహించుకోవచ్చు.

✽ జాన్ గ్రీన్

‘మణి’ మరో ‘సత్యంబాబు’!



అహ్మద్ మొహియుద్దీన్ ఖాన్ యజ్దానీ(డానీ)
(ముస్లిం ఆలోచనాపరుల వేదిక జాతీయ అధ్యక్షుడు)
9010757776

ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి నగరం లాలాచెరువులోని నూరాని మసీదు మౌజన్ (పూజారికి సహాయకులు) షేక్ ఫారూఖ్ డిసెంబరు 29 తెల్లవారుజామున హత్యకు గురయ్యారు. మసీదులో నిద్రపోతున్న మౌజన్‌ని గుర్తు తెలియని దుండగులు కొందరు మేకులు గుచ్చిన లావుపాటి కర్రతో తలమీద కొట్టి అతి క్రూరం గా చంపేశారు. వాళ్ళు అంతటితో ఆగలేదు; మసీదులో వున్న పవిత్ర ఖురాన్ ప్రతుల్ని తగలబెట్టారు; నమాజ్ చేసే కార్పెట్ల మీద విసర్జన చేసి వెళ్ళిపోయారు. ఇది నలుగురైదుగురు సభ్యులుగల ఒక ముఠా చేసిన పని అని పరిశోధన మొదటి దశలోనే పోలీసులు ప్రకటించారు.

ఆ మరునాడు డిసెంబరు 30 తెల్లవారు జామున తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా మల్లాపూర్ పట్టణ జామియా మసీదులో గుర్తు తెలియని దుండగులు పవిత్ర ఖురాన్ ప్రతుల్ని తగలబెట్టి పారిపోయారు.

ఒక్క రోజు వ్యవధిలో రెండు రాష్ట్రాల్లో ఒకే విధంగా జరిగిన ఈ రెండు సంఘటనల మధ్య సంబంధం లేదనుకోవడం అమాయకత్వం అవుతుంది. ఈ రెండు సంఘటనల్లో మరో పోలిక కూడా వుంది. ‘‘ఉద్రేక స్వభావులు’’ మత విషయాల్లో రెచ్చిపోతారు అనే నిందలున్న ముస్లిం సమాజం అటు రాజమండ్రిలోనూ, ఇటు మల్లాపూర్ లోనూ గొప్ప సంయమనాన్ని పాటించింది. రాజమండ్రి లోనేగాక, కాకినాడ, భీమవరం, గుంటూరు తదితర పట్టణాల్లో ముస్లింలు శాంతియాత్రలు జరిపారు. ఇది ఆ సమాజంలో పెరుగుతున్న కొత్త చైతన్యానికి ప్రతీక కావచ్చు.

సంఘటన వార్త బయటికి తెలిసిన కొన్ని నిముషాల్లోనే అన్ని పట్టణాల్లోని ముస్లిం ప్రముఖులకు సందేశాలు వచ్చాయి. ఎట్టి పరిస్థితిలోనూ ఆవేశానికి లోనుకారాదనేది వాటి ఉపదేశం. ఆవేశానికి గురయితే మతకల్లోలాలు చెలరేగి నష్టపోయేది ముస్లిం సమాజమేననేది వాటి సారాంశం. శత్రువు కోరుకుంటున్నదాన్ని మనమే చేసిపెట్టడం అవివేకం అనేది వాటి పాఠం. వీలయితే పరిసరాల్లోని హిందువుల ఇళ్ళకు వెళ్ళి పండ్లు, పూలు పంచి శాంతి సందేశాన్ని ప్రచారం చేయాలనేది వాటి మార్గ నిర్దేశనం.

ఖురాన్ ప్రతుల దహనానికి సూత్రధారులు గోగ్రవాదులని ఊహించడం కష్టం ఏమీకాదు. పాత్రధారుల్ని వెతికి పట్టుకోవడం ఒక్కటే పోలీసులు చెయ్యాల్సిన పని. ‘రాజమండ్రి ఒక్కటేకాదు కోస్తాంధ్రా ప్రాంతంలోనే మత సామరస్యం ఎక్కువ. ఈ ప్రాంతంలో దర్గాల దగ్గర ముస్లింలు హిందువులు సమానంగా కనపడతారు. ఇక్కడ మతకల్లోలాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందాలని ‘వాళ్ళు’ ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. అదృష్టావశాత్తు గొడవలు జరగలేదు’ అని నిట్టూర్చారు ఈ కేసును పరిశోధిస్తున్న ఉన్నతాధికారి ఒకరు. అయితే తన పేరు, పదవి వివరాలను బయట పెట్టొద్దని వారు ఒక షరతు పెట్టారు. సంఘటన జరిగిన తరువాత కూడా ఆ వీధి గుండా వెళ్ళే హిందువుల్లో కొందరు మసీదుకు దండం పెట్టుకుని వెళుతున్నారని ఆ అధికారి గుర్తు చేశారు. వారు చెప్పింది నిజమే. హిందూ పండుగల్లో ముస్లింలు, ముస్లింల పండుగల్లో హిందువులు భాగం పంచుకునే సాంప్రదాయం గోదావరి మండలంలో వుంది. వినాయక చవితి, దసరా, శ్రీరామనవమి సందర్భంగా తొమ్మిది రోజులు జరిపే ఉత్సవాల్లో ఒకరోజు కార్యక్రమాలకు ముస్లిం వ్యాపారులు దాతలుగా వుండేవారు. రామాలయంలో నిర్వహించే మేళాన్ని ముస్లిం మహిళలు చూడ్డానికి వీలుగా ఓ రెండు మూడు గంట లు పర్దాలు కట్టి ప్రదర్శించే సాంప్రదాయం కూడా అర్ధ శతాబ్దం క్రితం కొన్ని పట్టణాల్లో వుండేది. ఈప్రాంతపు అనేక దర్గాలకు హిందువులు ధర్మకర్తలుగా వున్నారు.

ఖురాన్ ప్రతుల్ని తగలబెట్టడం అనేది తీరాంధ్రలోనే కాదు ఒక విధంగా ఆంధ్రప్రదేశ్ లోనే మొదటి సంఘటన. దీని పరిణామాలు మతకల్లోలానికి దారితీస్తాయని ప్రభుత్వ పెద్దలకు తెలుసు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా రంగంలోనికి దిగారు. మత ఉద్రిక్తల్ని నివారించడానికి రెండు కథనాలను ప్రచారంలో పెట్టారు. మసీదు స్థలం వివాదాల్లో వుందనీ, ఆ తగవుల్లో భాగంగా మౌజన్ ను హత్య చేసివుంటారనేది మొదటి కథనం. మౌజన్ స్వరాష్ట్రం బీహార్ గనుక అక్కడి ముఠా తగవుల్లో భాగంగా అతని హత్య జరిగి వుంటుందనేది రెండో కథనం.

ప్రభుత్వం కష్టపడి ప్రచారంలో పెట్టిన ఈ రెండు కథనాలు తప్పు అని తేల్చడానికి పెద్ద నేరపరిశోధన అవసరంలేదు. మసీదు స్థలం వివాదంలో వుంటే దుండగులు ముతవల్లి(ధర్మకర్త) మీద దాడి చేస్తారుగానీ మసీదులోని ఓ చిన్న జీతగాన్ని ఎందుకు హత్య చేస్తారూ? ఒక వేళ అదే నిజమని భావిస్తే పోలీసులు ఆ కక్షిదారుల్ని వెంటనే ఎందుకు అరెస్టు చేయలేదు? అనే ప్రశ్న ఎదురవుతుంది. ఒకవేళ బీహార్ ముఠా తగవులే కారణం అనుకుంటే వెంటనే ఆ దిశగా పరిశోధన ఎందుకు ఆరంభించలేదనే ప్రశ్న ఎదురవుతుంది.

ఇప్పుడు పోలీసులు మూడో కథనాన్ని ముందుకు తీసుకు వచ్చారు. రాజమండ్రి మౌజన్ ను హత్యచేసింది అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన కరడుగట్టిన నేరస్థుడు మణి అనేది దీని సారాంశం. రాజమండ్రి వచ్చిన మణి దొంగతనం కోసం దుడ్డుకర్రతో మసీదులోనికి ప్రవేశించాడనేది పోలీసుల కథనం. సామాన్యులు నమ్మేయవచ్చుగానీ మసీదులతో పరిచయం వున్నవాళ్ళెవరూ ఇలాంటి కథల్ని నమ్మరు. ఒంటి మీద వీసమెత్తు బంగారంవున్నా మసీదుల్లోనికి ప్రవేశం నిషేధం అని అందరికీ తెలుసు.

అలాంటిది మసీదులో బంగారం, నగదు వుంటాయని ఒక కరడుగట్టిన సీనియర్ నేరస్థుడు ఎలా అనుకుంటాడూ? ఏ మసీదులో అయినా విలువైన సామానులు ఏముంటాయీ? వంటి ప్రశ్నలకు సమంజసమైన సమాధానం లేదు. ఈ సంఘటనలో హంతకుడి లక్ష్యం ధనం కాదని హత్యా స్థలాన్ని చూసిన వారెవరికయినా సులువుగానే తెలుస్తోంది. ఖురాన్‌ను తగలబెట్టి మసీదును అపవిత్రం చేయడానికే హంతకులు అక్కడికి వచ్చారు. అలాంటి పనుల్ని సాధారణ దొంగలు చేయరు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మతకల్లోలాలను సృష్టించడమే దుండగుల లక్ష్యం.

పోలీసులకు క్షుణ్ణంగా తెలిసినా బయటికి చెప్పలేని నాలుగో కథనం మరొకటుంది. ఈ కథనానికి పునాది 2011లో వుంది. యన్‌టి రామారావు పుట్టిన రోజు సందర్భంగా ఆ ఏడాది మే 28న తెలుగుదేశం మహానాడులో చంద్రబాబు ప్రసంగిస్తూ తనంతట తానుగా ఆత్మప్రక్షాళన చేసుకున్నారు. గతంలో, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎలో తమ పార్టీ చేరడం చారిత్రక తప్పిదమనీ, దాని వల్ల ముస్లిం సమాజం టిడిపికి దూరం అయిపోయిందని ఆవేదన చెందారు. ముస్లిం సమాజానికి స్వచ్ఛందంగా క్షమాపణలు చెప్పారు. మతతత్వ శక్తులతో ఇంకెన్నడూ చేతులు కలపనని ఒట్టు వేశారు.

2014 ఎన్నికలకు ముందు నరేంద్ర మోది గెలుపు గుర్రంగా కనిపించడంతో ముస్లిం సమాజానికి ఇచ్చిన ఒట్టును తీసి గట్టు మీద పెట్టి బిజెపికి మిత్రపక్షంగా మారిపోయారు చంద్రబాబు. నరేంద్ర మోడీతో హనీమూన్ గడిపితే రాష్ట్రానికి నిధులు ప్రాజెక్టులు భారీగా వస్తాయని ఆశించారు. మూడున్నరేళ్ళ లొంగుబాటు పర్వంలో నిధులూ రాలేదు, ప్రాజెక్టులూ రాలేదని అర్ధం అయింది. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం ఇచ్చిన షాక్ కు టిడిపి నెత్తికి బొప్పికట్టింది. ఈలోగా గుజరాత్ ఎన్నికల్లో బిజెపి ఓడిపోబోతున్నదని చంద్రబాబుకు సంకేతాలందాయి. దానితో తెగతెంపులు చేసుకోవడానికి ఇదే అదను అనుకున్నారు. బిజెపి మీద యుద్ధానికి పచ్చజెండా కూడా ఊపేశారు. ఈ నేపథ్యంలోనే ఎలమంచిలి బాబూ రాజేంద్ర ప్రసాద్ టిడిపి ఐస్ అయితే బిజెపి పుల్ల‘ అంటూ చెలరేగిపోయారు. ‘పుల్ల లేకపోతే ఐస్ లేదంటూ’ బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా యుద్ధానికి సై అన్నారు.

అయితే, గుజరాత్‌లో బిజెపి గట్టెక్కడంతో టిడిపి రెండడుగులు వెనక్కి తగ్గింది. టిడిపి ఇక ఎంతమాత్రం నమ్మదగ్గ మిత్రపక్షం కాదని బిజెపికి కూడా తెలిసిపోయింది. 2019 ఎన్నికల బరిలో ఒంటరిగానే దిగక తప్పదని దానికి అర్థం అయింది.

తీవ్ర సవాలును ఎదుర్కోవాల్సి వస్తే బిజెపి మతతత్వాన్నీ, ఉన్మాదభరితమైన జాతీయవాదాన్నీ ఆశ్రయిస్తుందని గుజరాత్ ఎన్నికలు తాజాగా స్పష్టం చేశాయి. కమలనాథులకు తెలిసిన పోల్ మేనేజ్ మెంట్ ఒకటే– అది మతచిచ్చు పెట్టి హిందుత్వ భావాలని రెచ్చగొట్టి ఓటు బ్యాంకును పది లం చేసుకోవడం. ఆ నేపథ్యంలోనే రాజమండ్రిలో ఖురాన్ దహనం, మసీదును అపవిత్రం చేయడం జరిగిపోయాయి.

ప్రజలు 2007 నాటి ఆయేషా మీరా కేసును ఇంకా మరచిపోలేదు. ఆ కేసులో ప్రభుత్వ పెద్దల పరువును కాపాడడానికి పోలీసులు ఎన్ని కుట్రలు చేశారో ప్రజలకు తెలుసు. వాళ్ళు కుట్రపూరిత పద్ధతుల్లో నిందితునిగా చిత్రించిన సత్యంబాబుని గత ఏడాది హైకోర్టు నిర్దోషిగా పేర్కొని విడుదల చేయడమూ అందరికి తెలిసిందే. ఇప్పుడు ఆ పోలీసులే గుంతకల్లుకు చెందిన మణి ని మరో ‘సత్యంబాబు’ని చేసే పనిలో పడ్డారు. అబద్ధం ఎక్కువకాలం చెలామణి కాదు; సత్యం దాగదు.

భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిని ఖండిస్తున్నాం

ఎడిటర్‌కు లేఖలు

విజయవాడలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో కొంతమంది దుండగులు ప్రముఖ కథా రచయిత, కవి స్కైబాబపై దాడికి దిగడాన్ని ఖండిస్తున్నాము. జల్‌జలా, ముఖామి పుస్తకాలను ‘హర్యాలి ముస్లిం రచయితల వేదిక’ తరపున ఆవిష్కరించాల్సి ఉన్నది. ఈ సభకు అధ్యక్షుడిగా విజయవాడ వెళ్ళిన స్కైబాబను పుస్తక ప్రదర్శన జరుగుతున్న ప్రదేశం నుంచి బయటికి తరిమేయడం గర్హించాల్సిన విషయం. ఒక ముస్లింగా, తెలంగాణవాదిగా ఆంధ్రా పాలకుల దురంతాలను నిలదీసినందుకు ప్రతిగా ఈ దాడి జరిగింది. ‘తెలంగాణ ఉద్యమ సమయంలో నువ్వు ఆంధ్రా పై విషగక్కినవ్. ఈ గడ్డమీద నువ్వెట్లా అడుగుపెడతవ్, ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపో’ అంటూ దుర్భాషలాడడం అవాంఛనీయం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి ఆంధ్రాప్రాంతం వారికి కూడా సగౌరవమైన ఆహ్వానం పలికింది. దీనికి ప్రతిగా ఆంధ్రప్రదేశ్‌లో ఆఖరు నిమిషంలో ముఖ్యమంత్రి పేషీ నుంచి వత్తిడి వస్తోంది అంటూ సభ నిర్వహణకు ఇచ్చిన అనుమతిని రద్దు చేసుకున్నారు. పోలీసు వాళ్ళు జోక్యం చేసుకుంటూ ‘లోపటేస్తే ఆర్నెళ్ల వరకు బైటికి రావు’ అని బెదిరించడాన్ని కూడా ఖండిస్తున్నాము. ఎప్పుడో ఉద్యమ సమయంలో రాసిన కవితను ఉదాహరిస్తూ ఇప్పుడు దాడికి దిగడం వారి దివాళ కోరుతనానికి నిదర్శనం. రాతలను రాతలతోనే ఎదుర్కోవాలనే ఇంగితం లేకుండా భౌతికంగా దాడికి దిగడం, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం వారి గుండాగిరికి నిదర్శనం.

వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఇవ్వాళ ముస్లిం రచయిత, తెలంగాణవాది స్కైబాబపై దాడికి దిగడాన్ని ప్రజాస్వామిక, లౌకిక వాదులందరూ ఖండించాలి.

ఈ సంఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయడ మే గాకుండా ఇలాంటి సంఘటనలు పునరావృతం గాకుండా చర్యలు తీసుకోవాలని కవులు, రచయితలుగా డిమాండ్ చేస్తున్నాము.

నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీశంకర్, దేశపతి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, పసునూరి రవీందర్, కాసుల ప్రతాపరెడ్డి, అంబటి సురేంద్రరాజు, ఖాజా, సూర్యపల్లి సుజాత, సంగిశెట్టి శ్రీనివాస్, షాజహాన, మోహన్ రుషి, నలిమెల భాస్కర్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, జూపాక సుభద్ర, గుడిపల్లి నిరంజన్, అన్వర్, సయ్యద్ ఖుర్షీద్, వహీద్ మహమ్మద్, అక్బర్ ఖాన్, అజీద్, సయ్యద్ గఫార్, పెన్నా శివరామకృష్ణ, పర్స్‌పెక్టివ్ ఆర్కె, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, ఎకె ప్రభాకర్, జుగాష్ విలీ, తుమ్మల దేవరావు, ఎం.నారాయణశర్మ ఆశారాజు, గాజుల శ్రీధర్, అన్వర్, పగడాల నాగేందర్, దాసరాజు రామారావు, కార్టూనిస్టు శంకర్, ఆర్టిస్టు అక్బర్.

దళితుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఆధునిక భారతదేశ చరిత్రలో దేశానికి స్వతంత్రం రావటం అతిగొప్ప విజయమైతే అంతటి మరో విజయం స్వతంత్ర తెలంగాణ రాష్ట్రాన్ని సాధించటం. రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌లో పొందుపరచిన ముఖ్యమైన అంశాల్లో అంబేద్కర్ రెండింటికి ప్రాధాన్యం ఇచ్చారు. ఒకటి పరిపాలనా సౌలభ్యం కాగా, రెండవది సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన జాతుల అభ్యున్నతికి అవకాశం కల్పించడం. చిన్న రాష్ట్రాల సిద్ధాంతకర్త, కులనిర్మూలన, దళితుల హక్కులకోసం పోరాడి భారతదేశపు మార్టిన్ లూథర్ కింగ్‌గా పేరుగాంచిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు రాష్ట్రప్రభుత్వం కార్యరూపం ఇస్తున్నది.

అన్ని కులవృత్తులను కాపాడుతూ పల్లె కన్నీరును తుడుస్తున్నది తెలంగాణ ప్రభుత్వం. కులవృత్తులను ప్రోత్సహించి గ్రామీణ నిరుద్యోగాన్ని పారదోలి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది.

దళితులను రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నది. దళిత పారిశ్రామిక వేత్తలను తయారు చేయడం మునుపటికంటె సులభతరమయింది. వేలకోట్ల రూపాయలతో గిరిజన, వెనుకబడిన తరగతులకు, మైనార్టీలకు సంక్షేమ పాఠశాలలు ఏర్పాటు చేయటం దేశ చరిత్రలో ఓ మైలు రాయి. వాటి దినదిన అభివృద్ధి రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసింది. విద్యకోసం ప్రభుత్వం చేసే కృషి ఎవరెస్ట్ శిఖరం అయితే జీవచ్ఛవాలుగా ఉన్న వెనుకబడిన కులాల వారి జీవన వృత్తుల ప్రోత్సాహం అంతకంటే ఎక్కువ. ఇవన్నీ ‘‘రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్’’ కోరుకున్న సామాజిక ఆర్థికాభివృద్ధి ఆశయాలు, రాజకీయ పదవుల్లో ముఖ్యంగా మార్కెట్ కమిటీ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌గారు. అదే కాకుండా తెరాసలో కూడా రిజర్వేషన్లు అమలు చేసి చరిత్రలో నిలిచినారు కెసిఆర్ గారు.

దళితులకు మూడెకరాల భూమి, పేద అమ్మాయిల పెండ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి, ఉద్యమ కళాకారులకు ఇచ్చిన ఉద్యోగాల్లో ఎక్కువ శాతం దళితులకు ఇచ్చి పాటకు పట్టాభిషేకం చేశారు. విదేశాలల్లో విద్యను అభ్యసించే దళిత బిడ్డలకు అంబేద్కర్ ఓవర్‌సీస్ స్కాలర్ షిప్ పథకం ద్వారా ప్రతి విద్యార్థికీ 20 లక్షలు ఇచ్చి విదేశీ విద్యకు ప్రోత్సాహం కల్పిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ పదవి దళితునికి ఇవ్వడం, ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున డా॥బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహ ఏర్పాటుకు సంకల్పించటం హర్షణీయం.

సమాజంలో దళితుల ఆత్మ గౌరవాన్ని, సామాజిక స్థాయిని పెంచి జీవితం దళితుల హక్కుల కోసం పోరాడిన అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పాలన సాగుతున్నది. తెలంగాణ ప్రాంత దళితులకి మరో అంబేద్కర్ సిఎం కెసిఆర్, దళితులు అభివృద్ధి చెందితే సంతోషించే వ్యక్తుల్లో కెసిఆర్ గారు మొదటి వ్యక్తి.

– గుండమల్ల సతీష్‌కుమార్



బంతిని ఎంత బలంగా గోడకేసి కొడితే అంతే వేగంగా వెనక్కు వస్తుంది. ఒక చర్యకు ప్రతి చర్య సమానంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేస్తుందన్న న్యూటన్ చలన సూత్రం సామాజిక- రాజకీయ రంగాలకు కూడా వర్తిస్తుంది. గత మూడు సంవత్సరాల్లో దళితుల మీద అనేక అఘాయిత్యాలు జరిగాయి. ఇంకా జరుగుతూనే ఉన్నాయి. దళిత చైతన్యం ఇప్పుడు మరింత రాటుదేలి కొత్త పుంతలు తొక్కుతున్నది. అది కేవలం దళిత పురుషులకే పరిమితం కాకుండా మదమ తిప్పని మహిళా యోధులను కూడా తయారుచేసుకుంటున్నది. ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్‌లో ప్రతిఘటన, ఊనా చలో దళిత్ పాదయాత్ర, మహారాష్ట్రలో భీమా కోరెగావ్ సంఘటన మొదలైనవన్నీ క్రమక్రమంగా దళిత పోరాట మహా సైన్యాలు రూపుదిద్దుకుంటున్న వాస్తవాన్ని రుజువు చేశాయి. ఇదంతా ఒక ఎత్తు కాగా అణచివేతను ఎదురొడ్డి ప్రతిఘటించడంలో దళిత మహిళలు సృష్టిస్తున్న కొత్త చరిత్ర అరుణారుణ ఉదయభానోదయం కంటే గాఢంగా కళ్లకు కడుతున్నది.

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
www.manatelangana.news
మనపేజీ మనందరిపేజీ
హైదరాబాద్ | ఆదివారం | 7 జనవరి | 2018

రగిలి రగిలిస్తోన్న రాధికలు

కుల వివక్ష లేకపోవడం నిస్సందేహంగా ఉత్తమ ఆదర్శమే. కాని మన దేశంలో కులం వాస్తవం. కులం ఆధారంగా ఏ ప్రయత్నమూ లేకుండా ఎదిగే అవకాశాలు ఉన్నట్టే కులం రీత్యా అబ్బిన వెనుకబాటు తనం అన్న సంకెళ్లను తెంచుకుని పురోగమించిన వారూ ఉన్నారు. ఇలాంటి వారే కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఇప్పటి మహిళలు ఇంతకు ముందు మహిళలు చేయని పనులు చేసి చూపిస్తున్నారు. పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని నిరూపిస్తున్నారు.

నాయకురాలైన రాధిక : పూల రేకులు తాకిన పూవుబోడి అంగుళులు కందిపోవుట అబ్బురంబె? అని మహిళలను కోమలాంగులని వారిని అణచి వేయడం పురుషాధిక్య సమాజ వాస్తవం. స్త్రీల విషయంలో అతి కర్కశంగా వ్యవహరించడం నిత్యానుభవం. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ విద్యార్థి రోహిత్ వేముల అక్కడి దారుణ పరిస్థితిని, బాహాటంగా కొనసాగిన వివక్షకు తాళ లేక 2016 జనవరి 17న ఆత్మ హత్య చేసుకున్నారు. నిజానికి ఆ విశ్వవిద్యాలయం ఆయనకు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి కల్పించింది. అంటే రోహిత్ ది నిస్సందేహంగా హత్యే. దళితులకు కులం తెచ్చిపెట్టే మచ్చ ఉంటుంది. మహిళల పరిస్థితికి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. రోహిత్ తల్లి రాధిక వేముల ఈ ఇబ్బందులన్నింటినీ ఎదుర్కొని తన కొడుక్కు జరిగిన అన్యాయం ఇతరులకు జరగకూడదన్న బలమైన పట్టుదల కారణంగా ఇప్పుడు దళితుల పక్షాన నిలబడుతున్నారు. ఈ క్రమంలో నడివయసులో ఉన్న రాధిక అనేక అవాంతరాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోహిత్ వేముల మరణించి ఏడాది అయిన సందర్భంగా ఆమె హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలోని రోహిత్ విగ్రహం దగ్గరకు వెళ్లాలని ప్రయత్నించినప్పుడు ఆమెను, ఆమె మరో కుమారుడు రాజాను అరెస్టు చేశారు. అక్కడితో ఆమె కష్టాలు పూర్తి కాలేదు. అసలు వారి కుటుంబం దళిత కుటుంబమే కాదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది వేధింపులకు పరాకాష్ఠ. రాధిక కుమారుడి ప్రాణం కన్నా ఆమె వ్యక్తిగత సంబంధాలు అధికార వర్గాలకు ముఖ్యమైపోయాయి. అయితే ఆమె పోరాట పటిమ ఆమె వాదనను విస్మరించలేని స్థాయికి తీసుకెళ్లింది. దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ఆమె పాల్గొన్నారు. అనేక ఉద్యమాలకు అగ్రభాగాన నిలిచారు. రోహిత్ చట్టం తీసుకు రావాలని నినదించారు. రాధిక భర్త భార్యా పిల్లల గురించి ఎన్నడూ పట్టించుకోకపోయినా ఆమె కులం గురించి వివాదం వచ్చినప్పుడు హఠాత్తుగా ప్రత్యక్షమై తాను వడ్డెర కులానికి చెందిన వాడినని చెప్పారు. రాధిక కేవలం తన కొడుక్కు జరిగిన అన్యాయం గురించే పోరాడడం లేదు. ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలం నుంచి 2016 అక్టోబర్ 15న అదృశ్యమైన నజీబ్ అహమ్మద్ కోసం పోరాడుతున్న అతని తల్లి ఫాతీమా నఫీస్‌కు అండగా నిలబడ్డారు. రాధిక అణగారినవర్గాల తరపున పోరాడుతున్నారు.

ఫాతీమా నఫీస్ : జె.ఎన్.యు. నుంచి అదృశ్యమై పోయిన తన కొడుకు నజీబ్ అహమద్ కోసం అతని తల్లి ఫాతీమా నఫీస్ ఇంకా ఎదురు చూస్తూనే ఉంది. నజీబ్ జాడ కనిపెట్టడం కోసం ఢిల్లీ పోలీసులు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో ఢిల్లీ హైకోర్టు ఈ బాధ్యతను సి.బి.ఐ.కి అప్పగించి ఏడు నెలలు దాటింది. అయినా నజీబ్ కనిపించనే లేదు. నజీబ్ జె.ఎన్.యు.లో ఎం.ఎస్సీ. బయోటెక్నాలజీ విద్యార్థిగా ఉండేవాడు. సంఘ పరివార్ కు అనుబంధ విద్యార్థి సంస్థ ఎ.బి.వి.పి. కి చెందిన వారితో గొడవ జరిగిన తర్వాత నజీబ్ కనిపించకుండా పోయాడు. ఎ.బి.వి.పి. విద్యార్థులు నజీబ్ మీద దాడి కూడా చేశారు. నజీబ్ జాడ తెలుసుకోవాలని అభ్యర్థిస్తూ ఫాతీమా నఫీస్ సి.బి.ఐ. డైరెక్టర్ కు విజ్ఞప్తి చేసినా ఫలితం దక్క లేదు. నజీబ్ జాడ కనిపెట్టడంలో ఢిల్లీ పోలీసులు ఎంత అస్తవ్యస్తంగా వ్యవహరించాలో అంత అస్తవ్యస్తంగా వ్యవహరించారు. సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేయడంలో క్షమించరాని తాత్సారం చేశారు. అంటే నజీబ్ మీద దాడి చేసిన ఎ.బి.వి.పి. కార్యకర్తలతో ఢిల్లీ పోలీసులు కుమ్మక్కయ్యారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. నజీబ్ మీద దాడి చేసిన వారిని ఢిల్లీ పోలీసులు కనీసం ప్రశ్నించలేదు. పైగా నజీబ్ ముస్లిం అయినందువల్ల చాలా సునాయాసంగా అతను ఇస్లామిక్ స్టేట్ (ఐ.ఎస్.)కు చెందిన వాడని ఏ ఆధారం లేకుండానే నింద మోపారు. తమ బాధ్యత నుంచి తప్పించుకోవడానికే ఢిల్లీ పోలీసులు ఈ పన్నాగం పన్నారని జె.ఎన్.యు. విద్యార్థి సంఘం ఆరోపించింది. ఇంతవరకు నజీబ్ కు ఐ.ఎస్. తో సంబంధం ఉన్నట్టు నిరూపించలేకపోయారు. ఈ వ్యవహారంలో సి.బి.ఐ. స్వతంత్రంగా దర్యాప్తు చేసే అవకాశం కల్పించాలని జె.ఎన్.యు. విద్యార్థి సంఘం అధ్యక్షుడు మొహిత్ పాండే అన్నారు. సి.బి.ఐ. కేంద్ర ప్రభుత్వ అధీనంలో పని చేస్తుంది. కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వం అయినందువల్ల ఈ అనుమానం నిరాధారమైంది కాదు. ఢిల్లీ పోలీసుల వ్యవహార సరళి ప్రశ్నార్థకంగా ఉన్నందువల్లే ఢిల్లీ హైకోర్టు నజీబ్ ను వెతికే బాధ్యతను సీబీఐ కి అప్పగించిందని జె.ఎన్.యు. విద్యార్థి సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు షెహ్లా రషీద్ అన్నారు. నజీబ్ కేసును సీబీఐకి అప్పగించి ఏడు నెలలైనా ఇంతవరకు ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో అతని తల్లి నఫీస్ ఫాతీమా కూడా పోరుబాట పట్టక తప్పలేదు. నజీబ్ జె.ఎన్.యు. నుంచి కనిపించకుండా పోయినప్పుడు ఓ ఆటోలో వెళ్లాడంటున్నారు. సీబీఐ ఈ విషయాన్ని ధ్రువీకరించింది కూడా. నజీబ్‌ను జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలం దగ్గర వదిలేశానని చెప్పమని ఆ ఆటో డ్రైవరును ఢిల్లీ పోలీసులు బలవంత పెట్టారని ఫాతీమా న్యాయవాది పల్లవి శర్మ చెప్పారు. ఎలాగైనా నజీబ్ కు తీవ్రవాద సంస్థ అయిన ఐ.ఎస్.ఐ.ఎస్. తో సంబంధం ఉందని నమ్మించడమే ఢిల్లీ పోలీసుల పన్నాగంలా కనిపిస్తోంది. ఈ కుట్రలకు వ్యతిరేకంగానే ఫాతీమా పోరాడుతున్నారు. ఆమె ఇప్పటికీ "నా కొడుకు ఎక్కడ? నా కొడుకు నాకు కావాలి" అని నినదిస్తూనే ఉన్నారు. పోలీసుల జులుం చూసి ఆమె జంకడం లేదు. ప్రతిఘటనకు మారు పేరుగా మారి పోయారు.



రోహిత్ తల్లి రాధిక



సుధా వర్గీస్ రాయ సర్కార్ సుజాత గిడ్ల సవిత దేవి

పురుషుల ఆవరణలోకి : మహిళలను ఆకాశంలో సగం అని గొప్పగా చెప్తుంటాం. కాని కొన్ని పనులు పురుషులు మాత్రమే చేయాలనుకుంటాం. పురుషులు చేయవలసిన పనులను మహిళలు చేస్తే మగరాయుళ్లు అని అవహేళన కూడా చేస్తాం. కాని పట్నాకు దగ్గరలోని ఢిబ్రా గ్రామానికి చెందిన మహిళలు ఇంతవరకు పురుషులకు మాత్రమే ప్రత్యేకం అనుకునే డోలు వాయించే పని చేసి కొత్త ఒరవడి సృష్టించారు. సవితా దేవి అనే మహిళ చొరవ తీసుకుని బాండు వాయించే పని పురుషులకే ప్రత్యేకం కాదు అని నిరూపించారు. నిరసన గళాలను లెక్క చేయకుండా సవితా దేవి కొంత మంది మహిళలను సమకూర్చి బ్యాండు మేళం వాయించే పని ప్రారంభించారు. పది మంది మహిళలతో కూడిన ఈ వాద్య బృందం ఇప్పుడు పెళ్లిళ్లలోనూ, ఇతర సంబరాలలోనూ బ్యాండు వాయిస్తోంది. దేవాలయాల దగ్గర కూడా వారు తమ వాద్య ప్రతిభ కనబరుస్తున్నారు. అక్కడితో ఆగకుండా భార్యలను కొట్టి, తిట్టి, వేధించే వారి ఇళ్ల ముందు కూడా ఈ వాద్య నైపుణ్యాన్ని ప్రదర్శించి మహిళల అణచివేతను సహించేది లేదని తెగేసి చెప్తున్నారు. అందరి దృష్టినీ ఆకర్షించడమే కాకుండా తమ నిరసనకు తాము సంపాదించిన నైపుణ్యాన్ని ఆయుధంగా చేసుకున్నారు. ఏ ఇంట్లో అయినా మహిళల మీద దాడి జరుగుతున్నట్టు తెలిస్తే అక్కడ ప్రత్యక్షమై పోయి బ్యాండు వాయిస్తారు. రెండేళ్ల కిందటి వరకు ఈ మహిళా వాద్య బృంద సభ్యులకు పిలల పెంపకం కాకుండా వ్యవసాయ పనులు మినహా మరేమీ తెలియదు. కాని ఇప్పుడు వారు నూతన మార్గం అనుసరించి, సంకెళ్లు తెంచుకుని సమాజానికి ఆశా కిరణాలుగా మారారు. ఈ వాద్య బృందానికి ఇప్పుడు మంచి గిరాకీ ఉంది. ఈ బృందాన్ని పెళ్లిళ్లకు, పేరంటాలకు పిలుస్తుంటారు. ఒక్కో మహిళ నెలకు రూ. 30,000 నుంచి రూ. 50,000 దాకా సంపాదిస్తున్నారు. వారు వాద్య బృందం ప్రారంభించడం సాంప్రదాయ సంకెళ్లను అధిగమించడానికి మాత్రమే ప్రతీక కాదు. ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించగలిగారు. ఆత్మ విశ్వాసంతో బతక గలుగుతున్నారు. వీరి బృందానికి ఇప్పుడు రోజూ పని దొరుకుతోంది. వారు బిహార్ కే పరిమితం కావడం లేదు. అవసరమైనప్పుడు భువనేశ్వర్, ఢిల్లీ లాంటి చోట్లకు కూడా వెళ్తున్నారు.అయితే వారు ఈ స్థితికి చేరుకోవడం సునాయాసంగా జరగలేదు. వారి భర్తలు అభ్యంతరపెట్టారు. గ్రామస్థులూ ఈసడించారు. స్థానిక వాద్యకారుడి దగ్గర ఈ విద్య నేర్చుకున్నారు. సమాజం ఈసడింపులను ఖాతరు చేయనందువల్లే వారు కొత్త బాట పట్టగలిగారు. మొదట్లో రోజుకు ఒక్కొక్కరికీ రూ. 500 రావడమే గగనమయ్యేది. ఇప్పుడు కనీసం తలా వెయ్యి నుంచి 1500 దాకా సంపాదిస్తున్నారు. గిరాకీ లేనప్పుడు తమ నైపుణ్యానికి పదును పెట్టడంలో నిమగ్నమవుతారు.

సుధా వర్గీస్ : వీరికి స్ఫూర్తినిచ్చింది మరో మహిళే. ఆమె 68 ఏళ్ల సుధా వర్గీస్. ఆమె కేరళలోని కొట్టాయంకు చెందిన కాథలిక్ సన్యాసిని. ఆమె నారీ గుంజన్ (నారీ గళం) అనే సంస్థను నెలకొల్పి బిహార్ లో దళిత మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఆమె దళిత కుటుంబంలో పుట్టకపోయినా అత్యంత వెనుకబడిన బిహార్ లోని దళిత మహిళల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నారు. ఆమె కలిగిన కుటుంబంలోంచి వచ్చినా అంబేద్కర్ వల్ల స్ఫూర్తి పొందారు. 1965 నుంచి ఆమె బిహార్ లోనే ఉంటూ దళిత మహిళల్లో చైతన్యం పెంపొందింప చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నారీ గుంజన్ సంస్థ ద్వారా దళిత మహిళలకు చదువు, వృత్తి విద్యలు నేర్పుతారు. ఆరోగ్య పరిరక్షణలో శిక్షణ ఇస్తారు. మహిళల తరపున న్యాయస్థానాలలో పోరాడడానికి ఆమె 1989లో న్యాయ శాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు. సుధా వర్గీస్‌కు 2006 లో పద్మశ్రీ అవార్డు దక్కింది. దక్షిణ భారత దేశంలో మహిళలు సంగీత వాద్యాలు వాయించడం చూసి బిహార్ లో పూర్తిగా మహిళలతో కూడిన వాద్య బృందాన్ని తయారు చేయాలని సంకల్పించానని సుధా వర్గీస్ అంటారు.

అందాల భరిణ ఆ దళిత యువతి : ప్రతిభ, అందం తమ పంచల్లోనే ఉంటుందని అగ్రవర్ణాల వారు భ్రమ పడ్తుంటారు. కాని ఈ రెండూ ఏ వర్గం సొత్తూ కావు. దళిత యువతులు అందాల పోటీలో కూడా తమ సత్తా చాటుకుంటున్నారు. దళితులు కొన్నింటికి అర్హులు కారు అనే అంధవిశ్వాసాన్ని బెంగుళూరుకు చెందిన రోష్మిత హరిమూర్తి పటాపంచలు చేశారు. ఆమె తండ్రి దళితుడు. ఆమెకు అంబేద్కర్ ఆదర్శప్రాయుడు. తన కులం గురించి ఆమె దాచుకోవడం లేదు. అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకున్న రోష్మిత హరిమూర్తి భార త్ తరపున ఈ నెల 31న జరిగే మిస్ యూనివర్స్ పోటీలో ఉన్నారు. ఆమె సోదరి అందాల పోటీల్లో పాల్గొనే వారే.

సృజనాత్మకతలోనూ... : స్వదేశంలో దళితులు ఉద్యమించడం విదేశాల్లో ఉంటున్న వారికి సైతం ప్రేరణ కలిగిస్తోంది. సుజాత గిడ్ల ఆంట్స్ అమాంగ్ ఎలిఫెంట్స్ గ్రంథం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. తన తల్లి మంజుల జీవితానుభవాలనే ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని సుజాత ఈ పుస్తకం రాశారు. ప్రముఖ కవి, పీపుల్స్ వార్ వ్యవస్థాపకుల్లో ఒకర్ అయిన కె.జి. సత్య మూర్తి (శివసాగర్) ఆమెకు దగ్గరి బంధువు. కింది కులాల వారి పేదరికం, లింగ వివక్షను ఆమె ఈ పుస్తకంలో చిత్రీకరించారు. సుజాత కళాశాల విద్య అభ్యసిస్తున్నప్పుడు క్రైస్తవులుగా మారిన బ్రాహ్మణులతో పరిచయం కలిగింది. వారూ తనను అగ్రవర్ణాల వారు చూసినట్టుగానే ఏహ్యాభావంతో చూశారని సుజాత అంటారు. సహజంగానే అమెరికాలో ఆమెను ఈ అంటరానితనం వెంటాడలేదు. దళితుల అణచివేత గురించి దశాబ్దాలుగా లోకానికి తెలియని అంశాలను బయట పెట్టారు. సుజాత దారిలోనే మరో ప్రవాస భారతీయ రయా సర్కార్ అనే 24 ఏళ్ల వనిత దక్షిణాసియాలోని విద్యాధికులు మహిళలను ఎలా వేధిస్తారో మొత్తం 61 మంది పేర్లు ఫేస్ బుక్ లో ప్రకటించారు. ఈ జాబితాలో ప్రసిద్ధ భారతీయ, పాశ్చాత్య విశ్వ విద్యాలయాల్లో పని చేసే ప్రొఫెసర్లు ఉన్నారు. ఈ జాబితా పెద్ద సంచలనం రేపింది. స్త్రీవాదులు బిత్తర పోయేట్టు చేసిం ది. మహిళలు బాధితులుగా మిగిలిపోకుండా తమకు న్యాయంగా దక్కాల్సిన అధికారం సంపాదాలించాలన్న అభిప్రాయంతోనే రయా సర్కార్ ఈ పని చేశారు. ఇలా ంటి వారు దేశవ్యాప్తం గా వివిధ చోట్ల అనేక మంది ఉండవచ్చు. వారి గురించి లోకానికి తెలియకనూ పో వ చ్చు. కాని అన్యాయం జరిగినపుడు నిర సన తెలియజేయడం, అప్పుడూకుదరక పోతే తిరుగు బాటు చేయడం, అదీ కుదరనపుడు సంకెళ్లు తెం చుకోవడానికి విప్లవమార్గం పట్టడం అసంభవం ఏమీ కాదు.



ఆర్వీ రామారావ్
సీనియర్ పాత్రికేయులు
9676999856

అగ్రవర్ణ పరువు హత్యలే

ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న వ్యక్తిగత హత్యలకు గురవుతున్న వారిలో సగానికంటే ఎక్కువ శాతం స్త్రీలే. ఐక్యరాజ్య సమితికి చెందిన పాపులేషన్ ఫండ్ సేకరించిన సమాచారం ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి 50 వేల మంది స్త్రీలు హత్యకు గురవుతున్నారు. అందులో సగం కంటే ఎక్కువ మంది భర్తలు, బంధువులు వీరంతా తల్లిదండ్రుల చేతుల్లో హత్య చేయబడ్డవారే. ఇట్లా హత్య చేయబడ్డ స్త్రీలందరూ దాదాపుగా 'కుటుంబ గౌరవం' 'కుటుంబ పరువు' కు బలైన వారే. అనాదిగా పితృస్వామ్య సమాజాల్లో స్త్రీ నడవడికను, ఆమె సంతానోత్పత్తి ప్రక్రియను బేరీజు వేసి చూడటం ఒక భయంకరమైన సంప్రదాయంగా మారింది. కుటుంబం పరువు, మర్యాదలు ఆ కుటుంబంలోని స్త్రీల నడవడిక పైనే ఆధారపడి ఉంటాయన్న భావన అన్ని మతాల్లోనూ, సమాజాల్లోనూ స్థిరపడింది. నాగరికత అభివృద్ధి చెందిందని చెబుతున్న కాలం నుండి స్త్రీలపై నియంత్రణ కొనసాగడం మొదలైంది. నియంత్రణ అనేది ఒక సంప్రదాయ చట్రంలో ఆమెను బంధించి ఉంచడమే కాకుండా, ఒక నాగరిక లక్షణంగా కూడా రూపు దిద్దుకొంది. ఈ చట్రంలోంచి ఆమె ఏ మాత్రం బయటకు వచ్చే ప్రయత్నం చేసినా ఆ చర్య కుటుంబ గౌరవానికి పరువుకు భంగకరంగా చూడబడుతుంది. ఈ పరిస్థితి దేశంలోని నగరాల్లో, గ్రామాల్లో, అన్ని కులాలలో, వర్గాలలో నెలకొని ఉంది. రోమన్ సామ్రాజ్యం కాలం నుండే పరువు హత్యలు కనిపిస్తాయి. వివాహితగాని, పెళ్లికాని స్త్రీగాని సమాజ పద్ధతులకు భిన్నంగా లైంగిక సంబంధాలు పెట్టుకుంటే ఆ స్త్రీని చంపే అధికారం రోమన్ సామ్రాజ్య కాలంలో ఉండేది. అలాగే యూరప్ దేశాలలో, మధ్య యుగాలలో ఇటువంటి స్త్రీలను రాళ్లతో కొట్టి చంపే చట్టం యూదుల్లో ఉండేది. కొన్ని దక్షిణ ఆఫ్రికా, మధ్య తూర్పు దేశాల్లో ఇప్పటికీ ఈ పద్ధతి అమలులో ఉన్నట్లు వార్తల ద్వారా అర్థం అవుతుంది. పరువు హత్యల భావన అరబ్ సంస్కృతిలో, ఆలోచనల్లో దృఢంగా నాటుకొని ఉందని బీరూట్ యూనివర్శిటీ మానవ శాస్త్రం ప్రొఫెసర్ షరీఫ్ ఖన్నా తన పరిశోధన ఆధారంగా చెప్పారు. పరువుకు భంగం వాటిల్లడానికి కారకురాలైన స్త్రీని హత్య చేసిన పురుషుడు శరీరం నిండా ఆమె రక్తాన్ని పులుముకొని, హత్యకు ఉపయోగించిన ఆయుధం ప్రదర్శిస్తూ వీధుల్లో తిరిగే ఆచారం అట్టోమన్ పాలన కాలంలో కొన్ని దేశాలలో ఉండేదట. పురుషుడు గీసిన రేఖను దాటే స్త్రీని చంపడం తప్ప వేరే శిక్షలేవీ ఉండేవికావు.

పాశ్చాత్య దేశాల్లో కూడా కుటుంబ గౌరవాన్ని, ప్రతిభను పరిరక్షించే పద్ధతులు ఎన్నో అమలులో ఉండేవి. పురుషత్వాన్ని ప్రదర్శించేందుకు ముష్టి యుద్ధాలు అమలులో ఉండేవి. కెనడా దేశంలో కూడా 1800 సంవత్సరం వరకు ఇటువంటి ఆచారం అమలులో ఉండేది. బ్రిటిష్ రాజు హెన్రీ తన భార్య శీలం కోల్పోయిందనే అనుమానంతో ఆమె తల నరికేయిస్తాడు. ప్రసిద్ధి గాంచిన షేక్స్‌పియర్ ఒథెల్లో నాటకంలో ముఖ్య మహిళా పాత్ర డెస్డిమోనా కూడా పరువు హత్య గావించబడుతుంది. చాలా అరబ్ దేశాల్లో ఇస్లాం మతం ఆవిర్భావానికి ముందు నుండే పరువు హత్యలు ఉండేవని, అందుకు చారిత్రక ఆధారాలున్నట్లు పరిశోధకులు తెలుపుతున్నారు. అరబ్ దేశస్థులు, అప్పటి సింధు, ఇప్పుడు పాకిస్థాన్‌లోని బెలూచిస్థాన్‌పై యుద్ధానికి వచ్చినప్పుడు, స్థానికులు పెళ్లికాని ఆడపిల్లల గౌరవం కాపాడటానికి సజీవంగా ఖననం చేసేవారట. షియా, సున్నీ ముస్లిం మత తెగలకు మధ్య వివాహ, ఇచ్చిపుచ్చుకునే సంబంధాలు ఉండవు. అలా తమ తెగ అవతలి వారిని ప్రేమించిన సందర్భాలలో అమ్మాయిని, అబ్బాయిని చంపే ఉదంతాలు ఇప్పటికీ ఉన్నాయి. పరువు హత్యల గురించి ముస్లిం మత గ్రంథాలలోకాని ఆమాట కొస్తే ప్రపంచంలోని ఏ మత గ్రంథాలలో కాని ప్రస్తావన లేదు. ఏ మత సిద్ధాంత కర్తలు మతం చట్రంలో ఇటువంటి హత్యలను సమర్థించలేదు. సామాజిక స్థాయి, హోదా భిన్నంగా ఉన్నప్పుడు, ధనికులైన



అమ్మాయి, అబ్బాయిలు బీద వారిని ప్రేమించిన సందర్భాల్లో ఇటువంటి హత్యలు జరుగుతూనే ఉన్నాయి. సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మత విశ్వాసాల విషయంలో ఎటువంటి తార్కికత, హేతుబద్ధతకు తావుండదు. సౌదీ అరేబియా రాజవంశంలోని రాకుమారి మిషా అల్ 1977లో చదువు నిమిత్తం లెబనాన్ వెళ్లినప్పుడు ఖాలిద్ అనే అతి మామూలు యువకుడ్ని ప్రేమించి, ఆయనతో సహజీవనం సాగిస్తుంది. ఆమె తిరిగి స్వదేశానికి వచ్చిన తర్వాత ఆమె తాత మరణ శిక్ష విధించి, కాల్చి చంపేస్తాడు. ఆ తర్వాత ఆమె ప్రియుడు ఖలీద్‌ను కూడా ఆధీనంలోకి తీసుకొని అయిదు కత్తి వేట్లతో తల, మొండెం వేరు చేసి శిక్షిస్తారు. ఈ సంఘటనపై "డెత్ ఆఫ్ ఎ ప్రిన్సెస్" అనే ఆంగ్ల సినిమా కూడా వచ్చింది. అన్ని మతాల లాగానే ఇస్లాం కూడా చట్ట వ్యతిరేకంగా మనిషి ప్రాణాన్ని తీయడాన్ని ఒప్పుకోదు. అయినా పరువు పేరుతో ఇస్లాం దేశాల్లో ఈ హత్యలు జరుగుతూనే ఉన్నాయి. జోర్డాన్, సిరియా దేశాలలో పరువు పేరుతో భర్తకు బంధువులు హత్యకు పాల్పడి నట్టయితే వారిపట్ల ఉదారంగా వ్యవహరించమని చట్టాలు చెబుతున్నాయని, 2002లో ఐక్యరాజ్య సమితి సంస్థకు సంబంధించిన మానవ హక్కుల శాఖ నివేదిక తెలిపింది. ఆఫ్రికా ఖండంలోని తెగల్లో, తెగ కట్టుబాట్లు, కుటుంబ ఆచార వ్యవహారాలు చాలా బలంగా ఉంటాయి. ఒక స్త్రీ తమ తెగ ఆవల వ్యక్తిని ప్రేమించినా, వివాహం చేసుకున్నా రకరకాల శిక్షలు అనుభవించడమే కాకుండా హత్యకు గురవుతారు. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల శాఖ ప్రకటించిన గణాంకాల ప్రకారం 1977 వ సంవత్సరంలో పాకిస్థాన్‌లో దాదాపు 1000మంది, యెమెన్‌లో 400 మంది, ఈజిప్టులో 32 మంది, జొర్డాన్‌లో 32 మంది స్త్రీలు పరువు హత్యకు గురయినారు. మన దేశంలో 2014లో 28 మంది పరువు హత్యల పేరుతో ప్రాణాలు కోల్పోగా 2015లో అనూహ్యంగా ఆ సంఖ్య 251 వరకు పెరిగిందని పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకిచ్చిన సమాధానంలో హోం మంత్రి చెప్పారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లో 131 మంది ఇట్లా హత్య గావింపబడ్డారు. దేశంలో అనాదిగా అమలులో ఉన్న కుల వ్యవస్థ, వర్ణ ధర్మం, బ్రాహ్మణ సంస్కృతి, ఫ్యూడల్ భావ జాలం ఈనాటికీ బలంగానే కొనసాగుతున్నాయి. ప్రపంచీకరణతో, ఆధునికత ఏర్పడిందని మార్కెట్, సంస్కృతి పరంగా ప్రపంచం అంతా ఒక కుటుంబంగా మారుతుందని ఎన్ని ఉపన్యాసాలిచ్చినా మనిషి ఆలోచనల్లో పెద్ద మార్పు రాలేదు. సామాజిక జీవితంలో అలవర్చుకున్న కుహనా విలువలు, దానికి సంబంధించిన భావ జాలం, ఆలోచనలు తాత్విక ఆలోచనల్లోనూ, సంస్కృతిలోనూ చాలా ప్రబలంగా ఉంది. కుల వ్యవస్థలో భౌతిక హింసే కాకుండా తాత్విక హింస కూడా నెలకొని ఉంది. హర్యానా, గుజరాత్ రాష్ట్రాల్లో 'కాప్' పంచాయితీలు, తమిళనాడులో కట్ట తతంగం, రాజస్థాన్‌లో గద్దె దగ్గర న్యాయం చెప్పే పద్ధతులన్నీ ప్రధానంగా ప్రేమ సంబంధాల నిరాకరణే. గత మూడేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో 19 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 11 మంది పరువు హత్యలకు గురైనట్టు నివేదికలు తెలుపుతున్నాయి. ఈ హత్యలన్నీ కుల దురహంకార హత్యలుగానే పరిగణించాలి. 2014లో నల్లగొండ, తుంగతుర్తికి చెందిన ప్రవీణ్ కుమార్ (యాదవ), స్వప్న (మున్నూరు కాపు) ను ప్రేమించాడు. స్వప్న కుటుంబం వారి వివాహానికి అంగీకరించలేదు. ప్రవీణ్‌ను హత్య చేశారు. ఆదిలాబాద్ జిల్లా నారగొండ గ్రామంలో గత సంవత్సరం బి.సి. కులస్తుడిని ప్రేమించిందని ఒక లంబాడా యువతిని ఆమె కుటుంబస్థులంతా కలిసి హత్య చేశారు. వేములవాడలో మౌనిక (యాదవ) అనే యువతిని ప్రేమిస్తున్నాడని అనిల్ (దళిత) అనే యువకుడిని ఆ అమ్మాయి బంధువులు పెట్రోల్ పోసి తగులపెట్టారు. గత సంవత్సరం బిసి కులస్థుడితో కలిసి తిరుగుతున్నదని ఒక రెడ్డి అమ్మాయిని ఆమె అన్న హత్య చేశాడు. కరీంనగర్‌లో జీవన్ అనే దళిత ఇంజినీర్ మున్నూరు కాపు కులానికి చెందిన తన సహ విద్యార్థిని ప్రేమించడంతో ఆమె బంధువులు అతనిని విపరీతంగా చిత్ర హింసలు పెట్టారు. సమయానికి వైద్య సహాయం అందడంతో బతికాడు. ఈ సంవత్సరం జమ్మికుంటలో ఇనుగాల రమేష్ అనే యువకుడు గ్రామం నుంచి మాయమై, బావిలో శవమై తేలాడు. బంధువులు ఆందోళన చేయగా పోలీసులు మృతుడి కాల్ డేటా ఆధారంగా, అదే గ్రామానికి చెందిన బుక్క కులానికి చెందిన యువతి బంధువులు హత్య చేసినట్లు నిర్ధారించారు. పెద్దపల్లి దగ్గరి కతలాపూర్‌లో మాదిగ కులానికి చెందిన యువకుడు కూడా ప్రేమ వ్యవహారంలోనే హత్య చేయబడ్డాడు. ఆయన ప్రేమించిన మున్నూరు కాపు యువతి బంధువులే హత్య చేశారని తేలింది. ఈ సంఘటన కొద్ది రోజుల్లోనే భోనగిరి దగ్గర రజక కులానికి చెందిన నరేశ్, రెడ్డి కులానికి చెందిన స్వాతిల ప్రేమ గాథ పెద్ద వివాదంగా మిగిలింది. పోలీస్ స్టేషన్ నుంచి స్వాతి తండ్రి ఆ దంపతులను ఇంటికి తీసుకెళ్లుతున్న క్రమంలో నరేశ్‌ను మార్గ మధ్యంలోవేరు చేసి, ఊరికి దూరంగా తీసుకెళ్లి పెట్రోల్ పోసి దహనం చేసి హత్య చేశాడని తేలింది. దానితో కూతురు స్వాతి ఇంట్లో ఉరి వేసుకుంటుంది. పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన శ్రీనివాస్ రెడ్డి తన కూతుర్ని తానే హత్య చేశానని, కులాంతర వివాహాలు చేసుకున్న వారిని ఇలా అంతమొందించడమే న్యాయమని ప్రకటించాడు కూడా. భారత దేశంలో జరిగిన, జరుగుతున్న పరువు హత్యలన్నీ అగ్రకుల అహంకారానికి సంబంధించినవే. అంబేద్కర్ చెప్పినట్లు కులాంతర వివాహాలు, కుల నిర్మూలనకు దోహదపడుతాయా? ఈ కేసుల్ని సుమోటోగా స్వీకరించాలని లా కమిషన్ 2012లో సూచించింది. రిజిస్ట్రార్ ఆఫీసులో వివాహాన్ని రిజిస్టర్ చేసుకున్న సందర్భంలో సమర్పించే ఫారమ్‌లో, తమ రక్షణ గురించి వివరాలు రాయడానికి ఒక కాలమ్ ఉండాలని సూచించింది. ఈ సూచనలు ఏ రాష్ట్ర ప్రభుత్వంగాని, కేంద్ర ప్రభుత్వంగాని పట్టించుకోలేదు. సమగ్ర చట్టం కోసం రాజకీయ పార్టీలు, పౌర, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. సంస్కృతిపరంగా చేయవలసిన కృషి చాలా ఉంది.



ఎస్. జీవన్ కుమార్
మానవ హక్కుల వేదిక
9848986286

అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌పై వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్ ఆవిష్కరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌కు సంబంధించిన వెబ్ సైట్, మొబైల్ అప్లికేషన్‌ను సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.వి రమణ చారి , టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రతిష్టాత్మకంగా జనవరి 13 నుండి 15 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న 3వ అంతర్జాతీయ కైట్ పెస్టివల్ తో పాటు అనుబందంగా మొదటి అంతర్జాతీయ స్థాయి స్వీట్ పెస్టివల్‌ను నిర్వహించనుంది. స్వీట్ ఫెస్టివల్ లో 15 దేశాల పాటు 25 రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రం తో పాటు హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వివిధ సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన ప్రజలు తయారు చేసిన స్వీట్లు 1000 పైగా ఈ ప్రధర్శనలో ప్రదర్శించబోతున్నారు. ఈ ప్రధర్శనను తిలకించేందుకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదన్నారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమములో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆ మంత్రుల కుటుంబాలను వదలం

మన తెలంగాణ/ హైదరాబాద్ : తనను, తన కుటుంబాన్ని ఉద్దేశించి మిడ్జిల్‌లో జరిగిన సభలో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టిఆర్‌ఎస్ కార్యకర్తలు అసభ్య పదజాలంతో పాటలు పడడం పట్ల కాంగ్రెస్ నేత ఎ.రేవంత్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మంత్రులు కెటిఆర్, లక్ష్మారెడ్డి తనను ఎదుర్కోలేక మానసిక ఒత్తిడి తీసుకువచ్చేందుకు తన కుటుంబసభ్యులను అసహ్యంగా, అసభ్యంగా ఏదో చేస్తామంటూ వారి అభిమానులతో పాటలు పాడిస్తున్నారని గద్గద స్వరంతో చెప్పారు. ఇలాగే కొనసాగితే వారు పాడిన పాటల్లో చెప్పిన మాటలను తన అభిమానులు ఆ మంత్రుల ఇళ్ళల్లోకి జొరబడి చేసి చూపిస్తారని హెచ్చరించారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మల్లు రవి, రవీంద్రనాయక్‌లతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

కెటిఆర్ భాషను మార్చుకోవాలి

మన తెలంగాణ/ హైదరాబాద్:పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గడ్డం పెంచుకుంటే సన్నాసులవుతారే తప్ప గబ్బర్ సింగ్ కాదని మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి మాటలు మాట్లాడితే తాము కూడా అదే స్థాయిలో మాట్లాడాల్సి వస్తుందని మాజీ ఎంపి వి.హనుమంతరావు, టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి హెచ్చరించారు. గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో వి.హనుమంతరావు మాట్లాడుతూ సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీ కుటుంబం నాంపల్లి దర్గా దగ్గర అడుక్కునేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

25న ప్యాడ్‌మ్యాన్ విడుదల: నిర్మాతలు

ముంబాయి: అక్షయ్‌కుమార్ హీరోగా నటించిన 'ప్యాడ్‌మ్యాన్' చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేస్తామని శనివారం ఆ చిత్ర నిర్మాతలు తెలిపారు. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన 'పద్మావత్' కూడా అదే రోజు విడుదలవుతుందనే ఊహాగానాల నేపథ్యంలో తమ చిత్రాన్ని వాయి దా వేయబోమని స్పష్టత ఇచ్చారు. పద్మావత్ విడుదల తేదీకి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని, ఒక వేళ అదే రోజు విడుదలయితే బాక్సఆఫీస్ వద్ద ఈ రెండు చిత్రాలు క్లాష్ అవుతాయని పద్మాన్‌లో హీరోగా నటించిన అక్షయ్ కుమార్ పేర్కొన్నారు.

ఇంటింటికీ తాగునీరు



మనతెలంగాణ/హైదరాబాద్/ శేరిలింగంపల్లి : మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం శేరిలింగంపల్లి ఎంఐజీలో పలు అభివృద్ధి పనులకు హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథతో నగరంలోనే కాకుండా మారుమూల గ్రామాలలో కూడా ఇంటింటికి త్రాగునీరు అందించనున్నామన్నారు. అన్ని రకాల వినియోగదారులకు 24 గంటల నిరంతర విద్యు త్, రైతులు, పరిశ్రమలు, ఇంటికి ఇస్తున్న తొలి రాష్ట్రమన్నారు. కోటి రూపాయలతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ మంజూరు చేశామన్నారు. షీ టీమ్స్ దేశానికి ఆదర్శమన్నారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఐజీ ఒక ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల కోసమన్నారు. బంగారు తెలంగాణ ప్రజలతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరువులో జనరేటర్ కంపెనీలు మూత పడుతున్నాయన్నారు. 24 గంటల విద్యుత్‌ను వివిధ రాష్ట్రాలు అభినందిస్తున్నాయన్నారు. సీఎం కెసిఆర్ అందరి కోసం ఆలోచిస్తున్నారని, ఒంటరి మహిలలకు పింఛన్లు ఇస్తున్న సీఎం కెసిఆర్ కిట్‌తో గర్భిణీలకు అండగా ఉంటున్నారన్నారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ఎంఐజీకి శాశ్వత నీటి పరిష్కారం, రైల్వే లైన్‌లో దేవాలయాలు పోకుండా కాపాడుదామన్నారు. ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిలు, కార్పొరేటర్లు కలిసి ఢిల్లీ వెళ్ళి రైల్వే మంత్రిని కలుస్తామని, ఫిబ్రవరిలో మన నగరంలో ఈ డివిజన్‌లో నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హరిచందన మాట్లాడుతూ నివసించే పట్టణంలో హైదరాబాద్ ఫస్ట్, అందరి సహకారంతో 2400 సంవత్సరాల ప్లాస్టిక్ కరగటానికి సమయం పడుతుందన్నారు. రిసైకిల్ అయ్యే ప్లాస్టిక్ వాడొచ్చు, మనం మారుదాంమన నగరాన్ని మారుద్దామన్నారు. చేవెళ్ళ ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శరెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, అంజయ్య యాదవ్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హరిచందన, పటాన్ చెరువు మార్కెట చైర్మన్ పుష్ప నగేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సపాన్ దేవ్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, ఎంఐజీ కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, గండిచర్ల జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.11,370 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ యోగ్యమైన భూమి ఉందని తేల్చారు. ఇదే విషయాన్ని సిఎం కె. చంద్రశేఖర్‌రావు శుక్రవారం ప్రకటించారు. ఈ వివరాల ప్రకారం వ్యవసాయ శాఖ పెట్టుబడి పథకానికి సంబంధించి ప్రాథమిక అంచనాల మేరకు రూ. 11,370.26 కోట్లు అవుతాయని, ఒకవేళ మొత్తం 1.55 కోట్ల ఎకరాల సాగు భూమిని పరిగణనలోకి తీసుకుంటే రూ. 12,400 కోట్లు అవసరమౌతాయని అధికారులు చెబుతున్నారు. వివాదాలు లేని భూముల లెక్కలు కూడా తేలితే కొంత మొత్తం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈసారి బడ్జెట్ ప్రతిపాదనల్లో మిగతా పథకాలకు తక్కువ మొత్తంలోనే కేటాయించనున్నట్లు తెలిసింది. ఇందులో వ్యవసాయ యాంత్రీకరణ వంటి ముఖ్యమైనవి ఉన్నాయి.

పథకం అమలుకు పరిమితులు తప్పవా : పెట్టుబడి సొమ్మును ఏ విధానంలో పంపిణీ చేయాలి? సాగు భూమిని తేల్చడం వంటివి నిర్ధారించడానికి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సిఎం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఈ ఉప సంఘం చేసిన సిఫార్సులకు అనుగుణంగా పథకం అమలు కానున్నట్లు తెలిసింది. పెట్టుబడి పథకానికి భారీ మొత్తంలో నిధులు అవసరమౌతాయని, కొన్ని పరిమితులు విధిస్తే మేలని ప్రభుత్వం భావిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అందులో భాగంగానే మంత్రివర్గ ఉపసంఘం వేసినట్లు సమాచారం. ఏకంగా రూ. 11,370 కోట్లు పంపిణీ చేయడం అంత సులువు కాదని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

గోడు వినండి

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరాలను తెలుసుకోవడం లేదంటూ ఎల్లవ్వ మరో పాతిక మంది హైకోర్టులో రిట్ వేశారు. రైతులు/ప్రభావితులైన వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే భూపరిహార చెల్లింపుపై విచారణ చేయాలని, ముందే భూపరిహార చెల్లింపుపై విచారణ చేయడానికి వీల్లేదని న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శిక్షణ సర్టిఫికెట్ తప్పనిసరి

- భారీ వాహనాల డ్రైవింగ్ లైసెన్సుకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ



మన తెలంగాణ / హైదరాబాద్ : లారీలు, ట్రక్కులు, పెద్ద సంఖ్యలో ప్రయాణికులను రవాణ చేసే భారీ వాహనాల డ్రైవర్లకు భారీ వాహనాలను నడిపే విధానం, ఇంధన పొదుపు పద్ధతులు, రహదారులపై అవగాహన, మెరుగైన డ్రైవింగ్ అలవాట్లు తదితర అంశాలపై శిక్షణను తప్పనిసరి చేశారు. ఈ విధానాలపై ఏదైనా డ్రైవింగ్ స్కూల్, లేదా శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకున్నట్లు సర్టిఫికేట్లు సమర్పిస్తేనే డ్రైవర్లకు భారీ వాహన డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేయాలని, లైసెన్సుల రెన్యూవల్‌కు వచ్చే వారు కూడా ఈ సర్టిఫికేట్ సమర్పించాల్సిందేనని కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వ స్పష్టం చేసింది. ఈ నిబంధనను ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల రవాణ శాఖలను ఆదేశించింది.ముఖ్యంగా జాతీయ రహదారులపై నడిచే భారీ వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించకపోవడం, అనుభవ రాహిత్యం, నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి ఇష్టానుసారంగా వాహనాలు నడపడం కారణంగా పెద్దఎత్తున విలువైన చమురు వనరులు వృధా కావడంతో పాటు పెద్ద సంఖ్యలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పెట్రోలియం పొదుపు పరిశోధన సంస్థ (పిసిఆర్‌ఎ) ఇటీవల సమర్పించింది. రోడ్డు ప్రమాదాలలో దేశవ్యాప్తంగా ఏటా సుమారు ఒక లక్షా యాభై వేల మంది ప్రాణాలు కోల్పోతుండగా, దాదాపు ఐదు లక్షల మంది విగత జీవులవుతున్నారు. ఈ నేపధ్యంలో సరైన డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపు చర్యల అమలులో శిక్షణను తప్పనిరి చేస్తూ రోడ్డు రవాణ మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా భారీ వాహన డ్రైవర్లకు శిక్షణ సర్టిఫికేట్ తప్పనిసరి చేయడం ద్వారా సరైన శిక్షణ పొందిన డ్రైవర్లే వాహనాలు నడుపుతారని, తద్వారా ఒక వైపు ప్రమాదాలను నివారించడమే కాకుండా మరోవైపు ఇంధన వనరులు కూడా పొదుపు అవుతాయని రవాణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి : అమూల్యమైన ఇంధన వనరుల వినియోగం రవాణ రంగంలో నిత్యం పెరుగుతుండడం కూడా ఆందోళనకు గురి చేస్తుంది. రవాణ రంగం లో 2014–15లో 69.4 మిలియన్ మెట్రిక్ టన్ను లు ఉన్నహైస్పీడ్ డీజిల్ వినియోగం 2017 – 18 నాటికి 86.76 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకుం టుందని పిసిఆర్‌ఎ కేంద్ర రోడ్డు రవాణ శాఖకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఇందులో ట్రక్కులు, బస్సులు లాంటి భారీ వాహనాలే సుమారు 43 శాతం డీజిల్‌ను వినియోగిస్తు న్నాయని, వాహనాలు వినియోగించే డీజిల్‌ను పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేసింది. ఇప్పటివరకు పిసిఆర్‌ఎ దాదాపు రెండున్న లక్షల మంది డ్రైవర్లకు ఇంధన వనరుల పొదుపు గురించి శిక్షణ ఇచ్చింది. ఈ నేపధ్యంలో రవాణ రంగంలో ఇంధన పొదుపు చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర రోడ్డు రవాణ శాఖ గెజిట్‌లో పేర్కొంది. ఇంధన వనరుల పొదుపు విధానాలలో డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడంలో పిసిఆర్‌ఎ సుమారు 15 ఏళ్ల అనుభవం ఉన్నందున పిసిఆర్‌ఎ లేదా ఇతర డ్రైవింగ్ శిక్షణ సంస్థల్లో పొందిన డ్రైవర్లకు మాత్రమే భారీ వాహనాల డ్రైవింగ్ సర్టిఫికేట్ మంజూరు చేయాలని గెజిట్‌లో స్పష్టం చేసింది.

జలమే జీవనాధారం

(మొదటిపేజీ తరువాయి)

కల్పించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. కోటి మంది నివాసముండే హైదరాబాద్‌లో అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. జల సంరక్షణ కోసం జలం జీవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. నగరంలో మంచినీటి కష్టాలున్నాయన్నారు. వాటి కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, జీహెచ్‌ఎంసీ చట్టం చేసిందన్నారు. దీనిపై నిబంధనలు కూడా వచ్చాయన్నారు. కానీ నిర్మాణాలు చేపట్టే వారు ఎవరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం లేదన్నారు. 300 గజాల స్థలంలో ఆపైన నిర్మాణాలు చేపడితే ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసే విధంగా ఆదేశాలిచ్చామన్నారు. కానీ ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మాణాలు వేల సంఖ్యలో ఉన్నాయన్నారు. ఇంకుడు గుంతలు వందల సంఖ్యలో కూడా లేవన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే 6 నెలల సమయంలో ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు. ఆరు నెలల్లోపు ఇంకుడు గుంతలు పూర్తి కాకపోతే ఇంటి యజమాని, సంబంధిత అధికారిపై జరిమానా విధిస్తూ వారిని బాధ్యులను చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ, ప్రజల సహకారంతో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇంకుడు గుంతల విషయంలో ప్రజలను చైతన్యపరచడానికి జోనల్ కమిషనర్లు, డిప్యూటి కమిషనర్లతో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలన్నారు. వీటి నిర్మాణానికి పటిష్ట కార్యచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. నీటి కొరత అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉందన్నారు. ఒక నగరానికే, దేశానికో పరిమితం కాలేదన్నారు. భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో నీటి కొరత ఉందన్నారు. హైదరాబాద్ నగరానికి కృష్ణా, గోదావరి బేసిన్‌తో పాటు మంజీరా, గండీపేట్ నుంచి త్రాగునీటిని తెచ్చుకుంటున్నామన్నారు. మహారాష్ట్రలో లాతూర్ అనే ఒక పట్టణం ఉందని, అక్కడ భూకంపం కూడా వచ్చిందన్నారు. అక్కడ గత కాలంలో మంచినీటి సమస్య తీవ్రంగా వచ్చిందన్నారు. నీటి లభ్యతలేని పరిస్థితి, కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వం కలిసి ప్రత్యేక రైళ్లలో నీళ్ళు తెప్పించిన పరిస్థితి ఉండేదన్నారు. మనకు అలాంటి పరిస్థితి లేదన్నారు. ఈ మన నగరం కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, విద్యుత్, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి, విద్యుత్, ఇరిగేషన్, రెవెన్యూ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సర్కిల్ 21 ఉపకమిషనర్ వెంకన్న, కార్పొరేటర్లు మేక రమేష్, బొంబ్బ నవతారెడ్డి, పూజిత గౌడ్, జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కృతజ్ఞతలు

(మొదటిపేజీ తరువాయి)

మాజీ రాజ్యసభ సభ్యులు ఎం.ఎస్.స్వామినాథన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు రాసిన లేఖలో మెట్ట సాగు ఎక్కువగా ఉన్న రాష్ట్రమైన తెలంగాణలో ప్రతి రోజు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడం రైతులకు గొప్ప వరమని ఆయన అన్నారు. పంటలను సంరక్షించే నీటిపారుదలనే వ్యవసాయం విజయవంతం కావడంలో కీలకమైనదని ఆయన అన్నారు. వ్యవసాయానికి నీటి పారుదల భద్రతను కల్పించినందుకు రైతుల పక్షానా ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రికి, ఆయన కుటుంబ సభ్యులకు నూతన సంవత్సరం సంతృప్తినిచ్చే సంవత్సరంగా, ఫలవంతమైన సంవత్సరంగా ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామినాథన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాజ్యసభకు సంతన్న?

(మొదటిపేజీ తరువాయి)

ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో వార్తలు జోరుగానే వినిపిస్తున్నాయి. పార్టీలో కింది స్థాయి కార్యకర్తలు మొదలు రాష్ట్ర నాయకుల వరకు అంతా ఆప్యాయంగా సంతన్నగా పిలుచుకునే సంతోష్ అందరికీ తలలో నాల్కలాంటి వ్యక్తి. క్లిష్టమైన సందర్భాల్లో సైతం ఆయనను కెసిఆర్ విశ్వాసంలోకి తీసుకునేవారు. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వద్ద కూడా సంతోష్ అదే స్థాయిలో ఆప్యాయత పొందారు. దాదాపుగా పార్టీ ఆవిర్భావం నుండి కెసిఆర్‌కు వెన్నంటే ఉన్న సంతోష్ గత కొంత కాలం వరకూ తెర వెనక వ్యక్తిగానే ఉన్నారు. ఇటీవలే ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.అందరికీ వారధిగా ఉంటూ అప్పగించిన పని ఎంత పెద్దదైనా బైట పడకుండా చకచకా చేసుకుపోవడం ఆయన నైజం. మొదటి నుండి చూస్తున్నవారంతా సంతోష్ పార్టీ కోసం బైటికి కనిపంచకుండా చేసిన సేవకు కచ్చితంగా ప్రాధాన్యత కలిగిన పదవి ఇవ్వాల్సిందేనని కోరుతున్నారు.

అందుకు రాజ్యసభ కూడా సరైన వేదికే అవుతుందని చెబుతున్నారు. బంధుత్వమో ఇంకో కారణం చెప్పి అధినేత ఏమైనా వెనకాముందుకైతే నేనే సంతోష్ పేరును రాజ్యసభకు కచ్చితంగా ప్రతిపాదిస్తానని టిఆర్‌ఎస్‌లో సీనియర్ ఎంపి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. రానున్న సాధారణ ఎన్నికల తర్వాత పార్లమెంటులో టిఆర్‌ఎస్ బలం మరింత పెరుగుతుందని కెసిఆర్ స్పష్టమైన ధీమాతో ఉన్నందువల్ల కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య సంతోష్ ఒక రాజ్యసభ సభ్యుడిగా క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. కేంద్ర స్థాయిలో సంతోష్ 'కెసిఆర్ గొంతుక'గా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కె.కేశవరావు, జితేందర్‌రెడ్డి, వినోద్ కుమార్ , కవిత లాంటివారంతా ఉన్నప్పటికీ సంతోష్ పోషించే పాత్ర భిన్నంగా ఉండబోతున్నదని పార్టీ వర్గాల అభిప్రాయం. కెసిఆర్ తీసుకునే నిర్ణయాలు, ఆయన ఆలోచన, రాజకీయ వ్యూహం తదితరాలపై సంతోష్‌కు స్పష్టమైన అవగాహన ఉంది. ఎప్పుడూ కెసిఆర్ నీడగా ఉండే సంతోష్ భవిష్యత్ రాజకీయ అవసరాలకు అనుగుణంగా జాతీయ స్థాయిలో భిన్నమైన పాత్రను పోషించనున్నారు.

రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయి రాజకీయాలపైన కూడా భవిష్యత్తులో టిఆర్‌ఎస్ ఎక్కువ దృష్టి సారించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతాయి కాబట్టి రాష్ట్ర రాజకీయాలతో సంబంధం లేకుండా సంతోష్ ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పనున్నారు. ఒక వ్యూహం ప్రకారమే కెసిఆర్ రాజకీయ దూరదృష్టితో సంతోష్‌ను రాజ్యసభ సభ్యుడ్ని చేసి ఢిల్లీకి పంపుతున్నట్లు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడం కూడా అందులో భాగమేనని పార్టీ వర్గాల అభిప్రాయం.

వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వం వివాదం కావడంతో అక్కడ జరిగే ఉప ఎన్నికలో సంతోష్ పోటీ చేయవచ్చని తొలుత ఊహాగానాలు చెలరేగాయి. ఉప ఎన్నిక జరిగే అవకాశం లేదని స్పష్టం కావడంతో రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తారని వార్తలు వినిపించాయి. కానీ వీటికి భిన్నంగా టిఆర్‌ఎస్‌కు ఢిల్లీలో 'కెసిఆర్ గొంతుక'గా ఉండేలా సంతోష్‌ను రాజ్యసభ సభ్యుడిగా పంపడం దాదాపుగా ఖరారైందని పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. పార్టీకి లోక్‌సభ, రాజ్యసభల్లో ఫ్లోర్ లీడర్ల బాధ్యతలు ఎవరికి ఉన్నా సంతోష్ పోషించే పాత్ర మాత్రం విభిన్నంగా ఉంటుందని సమాచారం.

మూడున్నరేళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

వాళ్లు ఇంతకుముందే.. ఆవుల పెంపకం చేసిన అనుభవం ఉంది' అని వ్యాఖ్యానించారు. గత మూడు రోజుల నుంచి శిక్షల ఖరారుకు సంబంధించిన తీర్పు వాయిదా పడుతూ వస్తున్నది. శనివారం రాంచీలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం పరిసరాల్లో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. బీహార్‌లో 21ఏళ్ల క్రితం పశు దాణా కుంభకోణం కేసులో లాలూప్రసాద్ యాదవ్‌తో పాటు మరో 15 మందిని దోషులుగా తేలుస్తూ గత నెల 23న సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి జనవరి 3న శిక్ష ఖరారు చేయాల్సి ఉంది. కానీ ఓ న్యాయవాది మృతితో తీర్పును వాయిదా వేశారు. అనంతరం మరి రెండు సార్లు తీర్పు వాయిదా పడింది. తన వయసు, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని శిక్ష ఖరారు చేయాల్సిందిగా లాలూప్రసాద్ యాదవ్ న్యాయస్థానం శుక్రవారం పిటిషన్‌ను దాఖలు చేశారు. 21ఏళ్ల క్రితం బీహార్‌లో పశు దాణా కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 1991–94 మధ్య దేవ్‌గఢ్ ఖజానా నుంచి రూ.89.27లక్షల మొత్తాన్ని తప్పుడు వివరాలతో కాజేయడానికి సంబంధించిన కేసులో సీబీఐ విచారణ జరిపి 38 మందిపై అభియోగపత్రాలు నమోదు చేసింది. వీరిలో 11 మంది ఇప్పటికే చనిపోయారు. ఇద్దరు తమ నేరాన్ని అంగీకరించడంతో శిక్షలు పడ్డాయి. ముగ్గురు నిందితులు సాక్షులుగా మారారు. మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాతో పాటు ఆరుగురిని న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. శిక్షపడిన వారిలో ఐఏఎస్ అధికారులు బెక్ జూలియస్, ఫూల్‌చంద్ సింగ్, మహేశ్ ప్రసాద్, ప్రభుత్వాధికారులు కృష్ణకుమార్, సుబీర్ భట్టాచార్య తదితరులు ఉన్నారు.

హైకోర్టుకు వెళ్తాం : లాలూ కుమారుడు తేజస్వి:కాగా, తన తండ్రికి సిబిఐ కోర్టు విధించిన జైలుశిక్షపై హైకోర్టుకు వెళ్లనున్నట్లు లాలూ కుమారుడు తేజస్వి యాదవ్ పాట్నాలో తెలిపారు. కోర్టు తీర్పు పత్రాన్ని చదివిన అనంతరం దీనిపై కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో అప్పీలుకు వెళ్తామని ఆయన విలేకరులకు తెలిపారు.

విష వాయువులు

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించారు. విషవాయువుల స్థాయి తీవ్రంగా ఉండడంతో రెస్క్యూ టీంను పిలిపించి అస్వస్థతకు గురైన కార్మికులను ఆసుపత్రికి తరలించారు. మిగతా వారిని సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్లారు. ఆర్జీ1 జీఎం వి. విజయ్‌పాల్ రెడ్డి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఈ ఘటనపై అత్యున్నత డీసీఎంఎస్ అధికారుల బృందం విచారణ చేపట్టనుంది. ఈ ఘటనపై కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం సంభవించిందని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.

మళ్లీ ఉత్తమ్

(మొదటిపేజీ తరువాయి)



శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నేతలు ఫోన్ ద్వారా కూడా ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఉత్తమ్, ఆయన సతీమణి ఎంఎల్‌ఏ పద్మావతిల స్వంత నియోజకవర్గాలు హుజూర్‌నగర్, కోదాడలో కూడా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి సంతోషాన్ని ప్రకటించారు.తొలిసారిగా 2015 మార్చి 2వ తేదీన ఉత్తమ్ పిసిసి అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఇటీవల పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై రాహుల్‌గాంధీ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. గతంలోనే అన్ని రాష్ట్రాల పిసిసి కార్యవర్గాలు సమావేశమై పిసిసి కమిటీల నియామక అధికారాన్ని ఎఐసిసి అధ్యక్షునికి కట్టబెడుతూ ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి. దీంతో పిసిసి అధ్యక్ష పదవికి మార్పు చేర్పులు ఉంటాయనే ప్రచారం జరిగింది. రాష్ట్రం నుండి కోమటిరెడ్డి బ్రదర్స్, డి.కె.అరుణ, ఇతర నాయకులు ఆ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఢిల్లీలో పరిచయాలు, అధిష్టానం వద్ద పలుకుబడి కారణంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డే మరోసారి పిసిసి అధ్యక్షులుగా నియమితులవుతారని ఆయన వర్గీయులు ధీమా వ్యక్తం చేశారు. దానికి అనుగుణంగా ఆయనను కొనసాగిస్తూ ఉత్తరువులు వెలువడ్డాయి. ఇక రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ గా కూడా డాక్టర్ కుంటియానే ఎన్నికల వరకు ఉంటారని, అవసరమైతే ఎన్నికల సమయంలో వ్యూహాలు, పొత్తుల విషయంలో ఎఐసిసి ప్రతినిధులను పం పే అవకాశం ఉంటుందే తప్ప ఎలాంటి మార్పు ఉండబోదని ఢిల్లీ వర్గాలు తెలిపాయి.

నాయకులను కలుపుకుపోయేనా? : పార్టీలో సీనియర్ నాయకులను ఏకతాటిపై తీసుకురావడమే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముందు ముఖ్యమైన సవాల్‌గా ఉండనుంది. పిసిసి మొదటి ఏడాదిలో పెద్దగా కార్యక్రమాలు చేయకపోయినప్పటికీ, రెండవ ఏడాదిలో మాత్రం ఉత్తమ్ తనదైన శైలిలో పార్టీపై ముద్ర వేశారు.అయితే సీనియర్ నాయకులను కలుపుకుపోరని వాదన పార్టీలో ఉంది. ముఖ్యంగా పిసిసి పదవి కోసం పోటీ పడిన నాయకులతో ఆయన అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తారని, పిసిసి అధ్యక్ష పదవిలో ఉండే వ్యక్తి అందరినీ కలుపుకోవాల్సిన బాధ్యత ఉంటుందని, కార్యక్రమాల విషయంలో అందరనీ విశ్వాసంలో తీసుకుంటే బాగుంటుందని వ్యాఖ్యలు నాయకుల మధ్య తరచూ వినపడుతుంటాయి. నాయకత్వం విషయంలో ఊహాగానాలు, అనిశ్చితిపై ఆయన ప్రత్యర్థులు ప్రచారం చేశారని, అవన్నీ పటాపంచలవడంతో కొత్త ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని చూస్తారని ఆయన అనుయాయులు చెబుతున్నారు. ఇకపై దూకుడును ప్రదర్శిస్తారని వారు పేర్కొంటున్నారు.

కొత్త కార్యవర్గంపైనే అందరి దృష్టి : ఇక పిసిసి కొత్త కార్యవర్గంపైనే అందరి దృష్టి నెలకొంది. ఇప్పటిలా కాకుండా కేవలం పని చేసేవారు, ఎక్కువ సంఖ్యలో యువతతో తక్కువ సంఖ్యలో కార్యవర్గం ఉండబోతుందని ఇప్పటికే పార్టీ నాయకత్వం సంకేతాలిచ్చింది. దీంతో పాటు ఈ సారి రెండు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు ఉంటాయని, ఒకటి ఎస్‌సి, ఒకటి బిసికి ఇస్తారని, ఎఐసిసిలో కూడా పలు పదవులు ఉండబోతున్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి. సంక్రాంతి పండుగా అయిపోగానే కొత్త కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

ఉత్తమ్ నేతృత్వంలో అధికారం: గూడూరు సమర్థుడు, క్రమశిక్షణకు మారుపేరైన ఉత్తమ్ ఆధ్వర్యంలో 2019లో అధికారంలోకి వస్తామని టిపిసిసి కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి ఒక ప్రకటనలో విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణతో పని చేసే నాయకులకే ప్రాధాన్యత ఉంటుందని స్పషటమైందని, ఉత్తమ్ కొనసాగించడంలో రాహుల్‌గాంధీ నిర్ణయం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

కారు లూటీ

(మొదటిపేజీ తరువాయి)

మరీ ఈ దొంగతనం చేశారు. శనివారం ఉదయం వరంగల్ బస్టాండ్ సమీపంలో గొర్రెకుంటకు చెందిన ముస్కె రవి, అతని భార్య రాధ కారులో వెళ్తున్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న దొంగలు వారి దృష్టి మళ్లించే విధంగా కారు ముందు డబ్బులు పడవేయడంతో రవి భార్య కిందకి దిగి డబ్బులు ఏరడం ప్రారంభించింది. ఇదే అదునుగా కారులో ఉన్న బ్యాగ్‌లోంచి లక్షల రూపాయల నగదుతోపాటు ఒక రింగ్, రాధ మెడలోంచి మూడు తులాల చైన్‌ను లాక్కొని పరారయ్యారు. బస్టాండ్ సమీపంలో బాగా రద్దీగా ఉండే ప్రదేశంలోనే ఈ దొంగతనం జరగడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది.

బాధితులు ఫిర్యాదు మేరకు వరంగల్ ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్‌గంజ్ సిఐ సుంకరి రవికుమార్ తెలిపారు. దొంగల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా దొంగలు పథకం ప్రకారం ఈ దొంగతనం చేశారంటే ఖచ్చితంగా వారు గొర్రెకుంట ప్రాంతానికి చెందిన వారై ఉండవచ్చని పలువురు వాపోతున్నారు.



హక్కుల సాధనకు విఠల్‌రెడ్డి రాజీలేని పోరాటాలు

మన తెలంగాణ/హైదరాబాద్: మున్సిపల్, వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించి హక్కులను సాధించిపెట్టిన ఘనత కొండా విఠల్ రెడ్డికే దక్కుతుందని పలువురు కార్మిక నేతలు అన్నారు. నేటి తరం కార్మికులు విఠల్ రెడ్డి చేసిన పోరాటాలను, ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తొలితరం కార్మిక నాయకుడు, సీనియర్ కమ్యూనిస్ట్ నేత కొండా విఠల్ రెడ్డి సంస్మరణ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషాతో పాటు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శంకర్, ప్రధాన కార్యదర్శి కె.రమేష్, కార్యదర్శి కె. ఆనంద్‌రెడ్డి, వివిధ కార్మిక సంఘాల నేతలు రాజ్ రెడ్డి, లక్ష్మణ్, నారాయణ, రామస్వామి ప్రసంగించారు. సభకు యూనియన్ అధ్యక్షులు కె.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మున్సిపల్, వాటర్ వర్క్స్ కార్మికులు అనుభవిస్తున్న సౌకర్యాలు నాడు విఠల్ రెడ్డి 56 రోజుల సమ్మె చేసి సాధించినవేనని అజీజ్‌పాషా గుర్తు చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను కార్మికులంతా సంఘటితంగా తిప్పికొట్టాలని రత్నాకర్ రావు అన్నారు.

మన తెలంగాణ
7
హైదరాబాద్
ఆదివారం
7, జనవరి 2018
www.manatelangana.news

పాజిటివ్ హోమియోపతితో సంపూర్ణ ఆరోగ్యం: శ్రీనివాస్‌గౌడ్



మన తెలంగాణ/మహబూబ్‌నగర్ అర్బన్: ఎన్నో మందులకు నయంకాని రోగాలను సైతం నయం చేసి దేశ వ్యాప్తంగా సంచనాలను సొంతం చేసుకున్న పాజిటివ్ హోమియోపతి కేంద్రం ప్రారంభం కావడం ఎంతో సంతోషదాయకమని మహబూబ్‌నగర్ ఎంఎల్‌ఎ శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో పాజిటివ్ హోమియోపతి కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాజిటివ్ హోమియోపతి వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించగలుగుతున్నారని అన్నారు. దీర్ఘకాలిక రోగాలను సహితం పాజిటివ్ హోమియోపతి ద్వారా మెరుగైన వైద్యం అందించి సత్ఫాలితాలు అందిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా అనారోగ్యం భారిన పడిన వారికి నయం చేసి ఉపశమనం కలిగించడం సంతోషదాయకమన్నారు. ఇలాంటి పురాతన వైద్యాన్ని ప్రోత్సహించడం మంచిదన్నారు. వ్యాదులు లేని పట్టణంగా రాష్ట్రంలోనే నెంబర్‌వన్ సిటీగా మార్చేందుకు ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ,గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పట్టణ కేంద్రంలో పాజిటివ్ హోమియోపతి కేంద్రాన్ని ప్రారంభించిన యాజమాన్యాన్ని ఎంఎల్‌ఎ అభినందించారు.

అత్యాధునిక వైద్యసదుపాయాలు: దేశ్యవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో 40 పాజిటివ్ హోమియోపతి కేంద్రాల ద్వారా వైద్యాన్ని అందించి సత్ఫాలితాలు సాధిస్తున్నాట్లు ఆ సంస్థ మేనిజింగ్ డైరెక్టర్ ఎఎం రెడ్డి తెలిపారు. ఈ కేంద్రాల్లో పూర్తిగా అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించి ఉండాలన్నాదే తమ ఆశయమని తెలిపారు. అతితక్కువ కాలంలోనే పాజిటివ్ హోమియోపతిపై ప్రజలు మొగ్గు చూపడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, కౌన్సిలర్ కృష్ణమోహన్, వెంకటయ్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సత్వరమే న్యాయం



మన తెలంగాణ/రంగారెడ్డి: అత్యాచార బాధితులకు సత్వరమే న్యాయం అందించాలని ఎస్‌టి కమిషన్ సభ్యురాలు మాయా చింతమన్ ఇవంతే సూచించారు. బాధితులకు నష్టపరిహారం తక్షణం అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. శనివారం రంగారెడ్డి కలెక్టరేట్‌లో మాయా చింతమన్ ఇవంతే జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌టి అత్యాచార కేసులతో పాటు భూ తగాద కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకొని, గిరిజన తండాల్లో తాగునీరు, రోడ్లు పారిశుద్ధ్యం తదితర మౌళిక వసతులను కల్పనలకు కృషి చేయాలన్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రఘునందన్‌రావు సైబరాబాద్ సిపి సందీప్ సాండిల్యా, డిఆర్‌ఓ భవాని శంకర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

మన తెలంగాణ/హన్వాడ: వివాహేతర సంబంధం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం షేక్‌పల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా రామయ్యపాలెంకు చెందిన సాదిక్ దంపతులకు షేక్‌పల్లిలో జరుగుతున్న మిషన్ భగీరథ పథకంలో పనులు చేస్తున్నారు. అయితే ప్రకాశం జిల్లా మరకాపురంకు చెందిన గంగిరెడ్డి (34) సాదిక్ భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. సాదిక్ దంపతులు పనిచేసే చోటును తెలుసుకొని శుక్రవారం రాత్రి షేక్‌పల్లి గ్రామానికి వచ్చాడు. గంగిరెడ్డిని చూసిన సాదిక్ గొడవ పడడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి గంగిరెడ్డి మళ్లీ రావడంతో ఆగ్రహించిన సాదిక్ కత్తితో దాడి చేసి గొంతు కోసి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ సంస్కరణలతోనే మిగులు విద్యుత్: లక్ష్మణ్



మన తెలంగాణ/గజ్వేల్: వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత టిఆర్‌ఎస్ ప్రభుత్వానిదని గొప్పలు చెప్పుకోవడం, మిగులు విద్యుత్ కాంగ్రెస్ పార్టీ ఘనతేనని కాంగ్రెస్ నాయకులు అనడం ఆశ్చర్యంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. గత యూపిఎ ప్రభుత్వ హ యాంలో పదేళ్ల కాలంలో 9.05 శాతం లోటు విద్యుత్ ఉండేదని, 2014 కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన మూడేళ్లలో ప్రధాని మోడీ చేపట్టిన సంస్కరణలతోనే నేడు దేశంలో తెలంగాణతో సహా 17 రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ సాధించిందని, ఇది బిజెపి ప్రభుత్వ ఘనతని చెప్పుకొచ్చారు. శనివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఎస్‌సి మోర్చా కార్యవర్గ సమావేశానికి వెళుతున్న క్రమంలో సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో మీడియాతో మాట్లాడారు. 9.05 విద్యుత్ లోటును అనతి కాలంలోనే 4 శాతం తగ్గించి 2016–17 సంవత్సరం నాటికి 1.01 విద్యుత్ మిగులు దేశంగా ప్రపంచంలో గుర్తింపు పొందే విధంగా కృషి చేశార న్నారు. అధికారంలోకి వచ్చే నాటికి 18వేలు విద్యుత్ లేని గ్రామాలు ఉండగా, మోడీ 1000 రోజుల ప్రణాళిక రూపొందించుకొని ఇప్పటివరకు 13 వందల గ్రామలకు విద్యుత్ సరఫరాను పూర్తిచేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి ఉదయ్ పథకంలో భాగస్వామ్యం కల్పించి ఆ పథకం ద్వారా 12 వేల కోట్ల ఆదాయాన్ని కేంద్రం సమకూర్చిందన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వార్ధా నుంచి డిచ్‌పల్లి మీదుగా మహేశ్వరం వరకు విద్యుత్ లైన్‌కు సహకరించి రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులున్నారు.

రైతు కష్టాలు తీర్చేందుకే..

- ఎలాంటి అవాంతరాలు లేకుండా 24 గంటల కరెంటు
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



మన తెలంగాణ/వరంగల్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని రైతులకు 24 గంటల కరెంటును అందిస్తోందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. రైతులు అర్ధరాత్రి వేళల్లో వెళ్లి కరెంటు కష్టాలు పడవద్దనే సిఎం కెసిఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ గద్దల పద్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కడియం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం విద్యుత్ నిరంతరాయ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు రాకుండా ఉండేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ. 104 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.

గొర్రెల రీసైక్లింగ్ చేస్తే చర్యలు..

గొర్రెల రీసైక్లింగ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులను హెచ్చరించారు. జిల్లాలో పంపిణీ చేస్తున్న గొర్రెల యూనిట్లను మార్చి 31లోపు పంపిణీ పూర్తి కావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాయితీ ట్రాక్టర్లను రైతులకు కాకుండా కాంట్రాక్టర్లకు, టిఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని జెడ్‌పిటిసి సభ్యులు సభ దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ రాయితీ ట్రాక్టర్లపై వస్తున్న అపోహలు తొలగిపోయే విధంగా వ్యవసాయశాఖ అధికారులు అర్హులైన రైతులకే అందించాలన్నారు. ట్రాక్టర్ల పంపిణీలో రైతులను ఎంపిక చేయడంతో పాటు రైతు సమితులను భాగస్వాములను చేయాలని కడియం సూచించారు. వ్యవసాయశాఖలో అమలు చేస్తున్న ఈపాస్ మిషన్‌ల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ప్రశ్నలను లేవనత్తగా వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ కాట అమ్రపాలి మాట్లాడుతూ ఈ పాస్ మిషన్‌ల వల్ల ప్రారంభంలో కొద్దిగా సమస్యలు తలెత్తిన ఒకటి, రెండు నెలల్లో అన్ని సమస్యలు తీరిపోతాయన్నారు. ఈపాస్ పద్ధతిలో రైతులకు ఎరువులు పంపణీ చేస్తేనే కంపెనీలు రాయితీ వెళ్తుందన్నారు. ఈ సమా వేశంలో శాసన మండలి విప్ వెంకటేశ్వర్లు, ఎంపిలు అజ్మీరా సీతారాంనాయక్, పసునూరి దయాక ర్, ఎంఎల్‌ఎలు ఎర్రబెల్లి, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, జనగామ జిల్లా జాయింట్ కలెక్టర్ వనజాదేవి, జడ్‌పి సిఇఒ విజయగోపాల్, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, అధికారులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌తో సంతోషంగా ఉన్నారా?



మన తెలంగాణ/చిట్యాల: '24 గంటల విద్యుత్ వల్ల ఎలా ఉన్నారు. రైతులంతా సంతోషంగా ఉన్నారా?' అని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డిలు రైతులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం వారు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్న సంక్షేమమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. రైతుకు ఎకరాకు రూ.4 వేలు అందించడమనేది దేశంలో ఏ రాష్ట్రంలో లేదని, ఇది చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. అంతకుముందు ఎకరాకు రూ.4వేల లబ్ధి ఎలా పొందాలో తెలుసుకునేందుకు రైతులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు వేముల వీరేశం, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, నల్లగొండ టిఆర్‌ఎస్ ఇన్‌చార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కోసం చంపుతారా?

- ప్రశ్నించిన పాపానికి ఎఫ్‌ఐఆర్‌లు, చిత్రహింసలా?
- నేరెళ్ల ఘటనపై ముఖ్యమంత్రి నోరు విప్పాల్సిందే
- బహిరంగ సభలో నాయకులు



మన తెలంగాణ/సిరిసిల్ల/సిద్దిపేట: 'ఇసుక కోసం సామాన్యులను చంపుతారా? గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇసుక మాఫియాను ప్రశ్నించిన పాపానికి 35 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు న మోదు చేసి, ఎనిమిది మందిని అరెస్ట్ చేసి చిత్ర హింసలకు గురిచేస్తారా?' అంటూ వామపక్షాలు, జెఎసి నేతలు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శని వారం రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నేరెళ్ల ఘటనపై సిఎం కెసిఆర్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి కెటిఆర్ సిరిసిల్ల ప్రాంతంలో అరాచకాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. బాధితులకు వామపక్షాలు, జెఎసి, ప్రజాస్వామిక వా దులు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కామారెడ్డిలో రెండు రోజుల క్రితం విఆర్‌ఎను ఇసుక మాఫియా హత్య చేసిన ఘటన ను గుర్తుచేశారు. పాదయాత్రకు అనుమతి కావాలని, వారం రోజుల ముందే దరఖాస్తు చేసుకున్నా పోలీసులు మాత్రం ఒకరోజు ముందు అది కూడా సాయంత్రం వేళ అనుమతించారన్నారు. జెఎసి చైర్మన్ కోదండరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దల పెత్తనంలోనే ఇసుక మాఫియా నడుస్తోందని, దీనికి అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నేరెళ్ల బాధితులపై చర్యలకు పాల్పడిన పోలీసులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం ఏమిట ని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మి నేని వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక మాఫియా ఇష్టారీతిగా దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాజన్న సిరిసిల్లా జిల్లాలో సిఎం బంధువర్గం ఇసుక దందాను నిర్వహి స్తోందని ఆరోపించారు. అంతకుముందు నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట అమరవీరుల స్తూపం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల వరకు దాదాపు 26 కిలోమీటర్ల పాదయాత్రను వామపక్షాలు, జెఎసి నేతలు నిర్వహించారు. తొలుత ఉదయం సికింద్రాబాద్‌లోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద వామపక్షాలు, టిజెఎసి, టిపిఎఫ్ నేతలు నివా ళులర్పించి నేరుగా సిద్ధిపేటకు చేరుకొని పాదయాత్ర నిర్వహించారు.


అయ్యప్పల బస్సులను అడ్డుకుంటున్న కేరళ ప్రభుత్వం

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి బస్సులలో శబరిమల వెళుతున్న అయ్యప్ప భక్తులను కేరళ రాష్ట్ర రవాణ శాఖ అధికారులు ముప్పు తిప్పలు పెడుతున్నారు. రవాణ శాఖ నుంచి అన్ని రకాల అనుమతులు పొంది ట్యాక్సులు చెల్లించిన టిఎస్ ఆర్‌టిసి బస్సులను కూడా కేరళ రాష్ట్రంలో రవాణా శాఖ అధికారులు నిలిపి వేస్తున్నారు. టిఎస్ ఆర్‌టిసి బస్సులకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, పన్నులు కూడా చెల్లించామని బస్సు డ్రైవర్, ఐయ్యప్ప భక్తులు పత్రాలు చూపినా కేరళ రవాణ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ట్యాక్స్ కడితే తప్ప బస్సులు ముందుకు పోనివ్వడం లేదని స్పష్టం చేస్తున్నారు. కేరళలోని కంబూమ్ మెట్టు వద్ద శనివారం టిఎస్‌ఆర్‌టిసి బస్సు (టిఎస్ 08 జెడ్ 196) ను అక్కడి రవాణ శాఖ అధికారులు ఆపి దానిలో ప్రయాణిస్తున్న 37 మంది ఐయ్యప్ప భక్తులకు ఒక్కో సీటుకు రూ.300ల చొప్పున మొత్తం రూ.11,300ల ట్యాక్స్‌ను వసూలు చేశారు. దైవ దర్శనానికి వెళుతున్న తమను కేరళ రవాణ శాఖ అధికారులు దారి దోపిడీ చేస్తున్నారని అయ్యప్ప భక్తులు లబోదిబోమంటున్నారు. ఈ విషయంపై టిఎస్ ఆర్‌టిసి అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి

- మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ

మన తెలంగాణ/హైదరాబాద్/ మాదన్నపేట్: గవర్నర్ నరసింహన్‌ను కేంద్రం వెంటనే బర్తరఫ్ చేయాలని, దేశంలో గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నేత సర్వే సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్, గవర్నర్ ఇద్దరూ నియంతల్లా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నది సామాజిక తెలంగాణ కోసమని తెలిపారు. త్వరలో ఎస్‌సి వర్గీకరణ కోసం కాంగ్రెస్ తరపున కార్యాచరణ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మంద కృష్ణ మాదిగను శనివారం సర్వే సత్యనారాయణ, మాజీ పార్లమెంట్ సభ్యుడు సిరిసిల్ల రాజయ్య పరామర్శించారు. అనంతరం సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ మందకృష్ణను జైలులో పెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్‌సి వర్గీకరణ కోసం 23 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్న వ్యక్తిపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందన్నారు. గాంధేయ మార్గంలో శాంతియుతంగా తన ఇంట్లో దీక్ష చేయడానికి పూనుకున్న మందకృష్ణను అప్రజాస్వామికంగా కేసు నమోదు చేసి జైలులో నిర్బంధించడం కెసిఆర్‌కే చెల్లిందని విమర్శించారు. ప్రస్తుతం ఉప రాష్ట్రపతిగా ఉన్న వెంకయ్యనాయుడు గతంలో ఎస్‌సి వర్గీకరణకు మద్దతు పలికారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో కెసిఆర్ పాలన హిట్లర్‌ని తలపిస్తుందని ఆరోపించారు. అతని ఆగడాలపై గవర్నర్ దృష్టికి తీసుకెళ్లితే అతనికే సహకరించాలని చెప్పడం గవర్నర్ వ్యవస్థకే చెడ్డ పేరు తెచ్చేలా ఉందన్నారు. రాజయ్య మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఒంటరి వాడు కాదు, అతడికి మాదిగ జాతి అండగా ఉందన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ మాదిగలను, మహిళలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఎస్‌సి వర్గీకరణ కోసం అందరం కలిసి పోరాడుతామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బేషరతుగా మంద కృష్ణను విడుదల చేసి, కేసులన్నీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఆది సినిమా



కోన వెంకట్ సమర్పణలో 'గీతాంజలి' చిత్రాన్ని నిర్మించిన ఎం.వి.వి. సినిమా, కోన ఫిలిమ్ కార్పొరేషన్ సంస్థలు సంయుక్తంగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఇందులో ఆది పినిశెట్టి, తాప్సీ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. హరినాథ్ దర్శకత్వం వహించబోతున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈనెల 10 నుండి ప్రారంభం కానుంది. 'గురు' సినిమా హీరోయిన్ రితికా సింగ్ ఈ సినిమాలో మరో ప్రధాన పాత్రలో కనిపించబోతోంది. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కబోతున్న ఈ సినిమాకు గోపి సుందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. కోన వెంకట్, భవాని ప్రసాద్ మాటలు రాస్తున్న ఈ మూవీకి రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తాడు. వెన్నెల కిషోర్, శివాజీ రాజా, తులసి, సాయిచంద్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని ఫిల్మ్‌మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రం ఆది పినిశెట్టి కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుందని వారు చెప్పారు.



'గ్యాంగ్' ఆడియో విడుదల కార్యక్రమంలో అల్లు అరవింద్, సూర్య, కీర్తిసురేష్, రమ్యకృష్ణ, విఘ్నేశ్ శివన్, ప్రమోద్, జ్ఞానవేల్ రాజా, మారుతి తదితరులు

త్వరలో సూర్యతో సినిమా చేస్తా: అల్లు అరవింద్

సూర్య, కీర్తి సురేష్ జంటగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గ్యాంగ్'. ఈ చిత్రాన్ని తెలుగులో యువి క్రియేషన్స్ నిర్మాతలు ప్రమోద్, వంశీ ఈనెల 12న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమంలో సినిమా ఆడియోను అల్లు అరవింద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ ''మన అందరికీ స్కూల్‌లో ఓ గ్యాంగ్, కాలేజీలో ఓ గ్యాంగ్, పనిచేసుకునే దగ్గర ఓ గ్యాంగ్ ఉంటుంది. అలాంటి గ్యాంగ్ మన జీవితంలో చాలా కీలకమైన పాత్రను పోషిస్తుంది. ఈ సినిమా విషయానికి వస్తే అల్లు అరవింద్ మా గ్యాంగ్‌లో చాలా కీలకమైన వ్యక్తి. ఆయన సినిమా విడుదలకు ఎంతగానో సహకరిస్తున్నారు. అలాగే జ్ఞానవేల్ రాజా కూడా ఇక్కడ నా సినిమాలను గ్రాండ్‌గా విడుదల చేసే మరో గ్యాంగ్ సభ్యుడు. మా గ్యాంగ్‌లో యువి క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లు కూడా చేరారు. దర్శకుడు విఘ్నేశ్ శివన్ సినిమాలో నన్ను చాలా కొత్తగా చూపించారు. కుటుంబమంతా కలిసి చూసేలా ఈ సినిమా ఉంటుంది''అని అన్నారు. దర్శకుడు విఘ్నేశ్ శివన్ మాట్లాడుతూ ''తెలుగు ప్రేక్షకులు సినిమాను ఎంతగానో ప్రేమిస్తారు. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిస్తుంది''అని చెప్పారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ ''గజిని సినిమా నుండి నాకు, సూర్యతో మంచి అనుబంధం కొనసాగుతోంది. నాతో ఆయన సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నారు కానీ కుదరడం లేదు. త్వరలోనే ఆ సినిమా చేస్తాం''అని చెప్పారు. కీర్తి సురేష్ మాట్లాడుతూ ''సూర్యతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. విఘ్నేశ్ శివన్ సినిమాను ఎంతో బాగా తెరకెక్కించారు. రమ్యకృష్ణతో కలిసి పనిచేయడం మరిచిపోలేని అనుభవాన్నిచ్చింది''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమ్యకృష్ణ, మారుతి, ప్రమోద్, వంశీ పాల్గొన్నారు.

బి.ఎ.రాజు నిర్మాతగా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



బి.ఎ.రాజు

జయ.బి దర్శకత్వంలో ప్రేమలో పావని కళ్యాణ్, చంటిగాడు, గుండమ్మగారి మనవడు, లవ్‌లీ, వైశాఖం వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు ప్రముఖ నిర్మాత బి.ఎ.రాజు. ఆదివారం బి.ఎ.రాజు పుట్టిన రోజు సందర్భంగా తమ ఆర్.జె. సినిమాస్ బ్యానర్‌పై మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా బి.ఎ.రాజు మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో నిర్మించిన మొదటి సినిమా 'ప్రేమలో పావని కళ్యాణ్'. నిర్మాతగా 15 సంవత్సరాలు పూర్తిచేసుకున్నాను. మా బ్యానర్‌లో వచ్చిన ప్రేమలో పావని కళ్యాణ్, చంటిగాడు, గుండమ్మగారి మనవడు, లవ్‌లీ, వైశాఖం చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇప్పుడు మా ఆర్.జె. సినిమాస్ బ్యానర్‌లో జయ దర్శకత్వంలో మరో చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని నిర్మించబోతున్నాం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. జూన్‌లో ఈ చిత్రాన్ని ప్రారంభిస్తాం''అని అన్నారు.

దొంగకి ఇంటి తాళాలు అక్కర్లేదు!



విశాల్

విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో విశాల్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'అభిమన్యుడు'. ఈ చిత్రంలో అర్జున్ ఓ డిఫరెంట్ క్యారెక్టర్‌తో అలరిస్తారు. సమంత హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. 'ఈ కాలపు దొంగకి నీ ఇంటి తాళాలు అక్కర్లేదు. నీ గురించిన ఓ చిన్న ఇన్‌ఫర్మేషన్ చాలు...' అంటూ ప్రారంభమయ్యే టీజర్‌తో సినిమా ఏ ఫార్మాట్‌లో ఉండబోతోంది, టెక్నికల్‌గా ఎలాంటి స్టాండర్డ్స్‌లో ఈ చిత్రాన్ని రూపొందించారు అనే విషయాలు స్పష్టంగా అర్థమవుతాయి. యువన్ శంకర్ రాజా అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వల్ల సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందనేది టీజర్‌లోనే అర్థమవుతుంది. విశాల్ న్యూ లుక్, యాక్షన్ సీక్వెన్స్‌లు, అర్జున్ డిఫరెంట్ లుక్, సమంత గ్లామర్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. విశాల్ కెరీర్‌లో మరో సూపర్‌హిట్ సినిమాగా ఈ చిత్రం నిలుస్తుందని ఫిల్మ్‌మేకర్స్ అన్నారు. ఈ చిత్రాన్ని జనవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః జార్జి సి.విలియమ్స్, ఎడిటింగ్ః రూబెన్, ఫైట్స్ః దిలీప్ సుబ్బరాయన్, ఆర్ట్ః ఉమేష్ జె.కుమార్, మాటలుః రాజేష్ ఎ.మూర్తి.

నేనేదనుకుంటే అది.. చెప్పడం నాకు అలవాటు



శ్రియ

డా.మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'గాయత్రి' చిత్రాన్ని ఫిబ్రవరి 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. క్రిస్మస్‌కు వచ్చిన ఈ విలక్షణ నటుడి పవర్ ఫుల్ లుక్‌కు విశేష స్పందన వచ్చింది. ఈ చిత్రంలో తొలి సారిగా విష్ణు మంచు, శ్రియాలు జంటగా నటిస్తున్నారు. వీరిరువురు ఆదర్శ దంపతులుగా కనిపిస్తూ కొత్త సంవత్సరం రోజున విడుదలైన పోస్టర్ సందడి చేసింది. తాజాగా చిత్ర బృందం శ్రియా పోస్టర్‌ను విడుదల చేసింది. మధ్య తరగతి గృహిణిగా చక్కటి చీరకట్టుతో ఆకర్షణీయంగా ఉన్న శ్రియా లుక్‌కు కూడా మంచి స్పందనే వస్తుంది. 'నేనేదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు. తర్వాత సంగతి తర్వాత' అని పోస్టర్‌పై ఉన్న క్యాప్షన్ శ్రియా పాత్రకు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తుంది. మదన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ఎస్.ఎస్.తమన్ సంగీతాన్ని సమకూర్చారు. నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డా.మోహన్‌బాబు తన ప్రతిష్టాత్మక బ్యానర్ అయిన శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్‌పై నిర్మించగా అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరాః సర్వేశ్ మురారి, కథ, మాటలుః డైమండ్ రత్నబాబు, ఎడిటర్ః ఎం.ఆర్.వర్మ, ఆర్ట్ః చిన్న, ఫైట్స్ః కనల్ కణ్ణన్, కొరియోగ్రఫీః ప్రేమ్ రక్షిత్, గణేష్ ఆచార్య.

యుద్ధనారిగా సంజన

టాలీవుడ్‌కే కాదు ఇండియన్ సినిమాకే గర్వకారణంగా నిలిచిన 'బాహుబలి' స్ఫూర్తి ఎన్నాళ్లయినా కొనసాగేలా ఉంది. అలనాడు వచ్చిన 'మాయాబజార్' గురించి ఇప్పటికీ ఎలా చెప్పుకుంటున్నామో భవిష్యత్తులో బాహుబలి గురించి అలాగే చెప్పుకునేలా ఉన్నారు. బాహుబలి ప్రేరణగా తమిళ్, కన్నడలో కొన్ని సినిమాలు వచ్చాయి కానీ అవి ఏవీ కూడా దాని దరిదాపుల్లోకి కూడా వెళ్లలేకపోయాయి. అయితే ప్రభాస్ 'బుజ్జిగాడు'లో సెకండ్ హీరోయిన్‌గా నటించిన సంజన ప్రధాన పాత్రలో బాహుబలిని తలపించే రీతిలో ఓ మెగా టివి సీరియల్ రూపొందనుంది. బాహుబలి నిర్మాతల్లో ఒకరైన దేవినేని ప్రసాద్ నిర్మాణంలో యాట దర్శకత్వంలో రూపొందే ఈ విజువల్ ట్రీట్‌లో సంజన యుద్ధనారిగా కనిపిస్తుందట. గత నెల రోజులుగా దీని కోసం కఠిన శిక్షణ తీసుకుంటున్నానని ఆమె చెప్పింది. యుద్ధం, గుర్రపుస్వారీలో సంజన ఆరితేరిందట. 'అరుంధతి' సినిమాలో అనుష్క తరహా పాత్ర చేయాలన్న నా కల దీని ద్వారా నెరవేరబోతోంది అని చెప్పింది ఈ బ్యూటీ. ఆమధ్య వచ్చిన 'దండుపాళ్యం 2'లో చాలా బోల్డ్‌గా, హిందీ 'మర్డర్' రీమేక్‌లో హాట్ హాట్‌గా నటించి సంచలనం సృష్టించిన సంజన ఈ టివి సీరియల్‌తో పెద్ద బ్రేక్‌ను ఆశిస్తోంది.

క్లైమాక్స్‌లో 'ఇంటెలిజెంట్'



సాయిధరమ్ తేజ్

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రానికి 'ఇంటెలిజెంట్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''ఈ చిత్రానికి సంబంధించిన మస్కట్ షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. ఇంకా రెండు పాటలు బ్యాలెన్స్ ఉన్నాయి. ఈనెల 17 వరకు మొత్తం షూటింగ్ పూర్తవుతుంది. ఫిబ్రవరి 9న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం. 'ఖైదీ' చిత్రం చిరంజీవికి ఎలా మైలురాయిగా నిలిచిందో అలాగే 'ఇంటెలిజెంట్' చిత్రం సాయిధరమ్‌కి ఓ ల్యాండ్ మార్క్ మూవీ అవుతుంది''అని అన్నారు. సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే, రాహుల్ దేవ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ఎస్.వి.విశ్వేశ్వర్, సంగీతంః తమన్, ఎడిటింగ్ః గౌతంరాజు, కథ, మాటలుః శివ ఆకుల, ఎడిటింగ్ః గౌతంరాజు, ఆర్ట్ః బ్రహ్మ కడలి, ఫైట్స్ః వెంకట్, డ్యాన్స్ః శేఖర్, జాని.

ఆ సినిమాలు చేయడం లేదు



వరుణ్‌తేజ్

గత ఏడాది 'ఫిదా' సినిమాతో మంచి హిట్‌ను అందుకున్నాడు యంగ్ హీరో వరుణ్‌తేజ్. అయితే నెక్స్ట్ కూడా అదే తరహాలో బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకోవాలని అతను చాలా కష్టపడుతున్నాడు. 'తొలి ప్రేమ' చిత్రంతో మరికొన్ని రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు వరుణ్‌తేజ్. అయితే ఇటీవల వరుణ్‌తేజ్ మల్టీస్టారర్ మూవీలు చేయబోతున్నాడనే టాక్ వినిపించింది. కానీ అందులో ఏమాత్రం నిజం లేదని వరుణ్ ఒక్క ట్వీట్‌తో క్లారిటీ ఇచ్చాడు. గత కొంత కాలంగా వెంకటేష్‌తో అలాగే రానాతో మల్టీస్టారర్ సినిమాలు చేసేందుకు అతను సిద్ధంగా ఉన్నాడని వార్తలు వచ్చాయి. వెంకటేష్‌తో దర్శకుడు అనిల్ రావిపూడి 'ఎఫ్2' అనే సినిమాను చేయడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఆ సినిమాలో మరో హీరోగా వరుణ్ ఎంపికయ్యాడని టాక్ వచ్చింది. అంతేకాకుండా రానా చేయబోయే ఒక హిందీ మూవీ రీమేక్‌లో స్పెషల్ క్యారెక్టర్ కోసం ఈ చిత్ర దర్శకుడు వరుణ్‌ను కలిసినట్లు వార్తలు వచ్చాయి. అయితే చివరికి వరుణ్ క్లారిటీ ఇవ్వడంతో అవన్నీ రూమర్లు అని తేలిపోయింది. ''ప్రస్తుతం తొలి ప్రేమ చిత్రాన్ని మాత్రమే చేస్తున్నా. ఇంకెలాంటి కథలను ఓకే చేయలేదు. ఒకవేళ ఏదైనా సినిమాను ఒప్పుకుంటే ముందు నేనే చెబుతాను''అంటూ వరుణ్‌తేజ్ పేర్కొన్నాడు.

పెళ్లి పీటలెక్కనున్న మరో బాలీవుడ్ బ్యూటీ



సోనమ్ కపూర్

గత కొంత కాలంగా సినీ సెలబ్రిటీల పెళ్లిళ్లు ఊహించని విధంగా జరిగిపోతున్నాయి. మొన్నటి వరకు డేటింగ్ చేసి విడిపోయారు అనే వార్తలే కానీ పెళ్లి చేసుకున్నారని వార్తలు వచ్చేవి కావు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. ఒక్కసారి ప్రేమ పుడితే వ్యవహారం పెళ్లి వరకు వెళ్తోంది. ఆతర్వాత ఎన్నాళ్లు కలిసి ఉంటారు అన్నది వేరే విషయం. ఇటీవల బాలీవుడ్ బ్యూటీ అనుష్క, టీమిండియా క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లీని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో బాలీవుడ్ భామ ఇల్లాలు కాబోతోంది. అనిల్ కపూర్ కూతురు సోనమ్ కపూర్ త్వరలో పెళ్లి పీటలెక్కనుందని ప్రస్తుతం బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. గత కొంతకాలంగా సోనమ్‌కపూర్... ఆనంద్ అహూజా అనే యువకుడితో ప్రేమాయణాన్ని సాగిస్తోంది. ఏమాత్రం గ్యాప్ దొరికినా సోనమ్ తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి ఎంజాయ్ చేసేది. అయితే ఈ ఏడాది పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుందట ఈ జంట. ఏప్రిల్‌లో జోధ్‌పూర్ వేదికగా వీరి వివాహం జరుగనుందట. దాదాపు 300 మంది వీరి పెళ్లికి హాజరుకానున్నారని సమాచారం. ఈ 32 ఏళ్ల బ్యూటీ ప్రస్తుతం నాలుగు సినిమాలతో బిజీగా ఉంది. అవి పూర్తయిన తర్వాత వేసవిలో పెళ్లి చేసుకోవాలని సోనమ్ నిర్ణయించుకుందట. మరి వీరి వివాహం ఏ స్థాయిలో జరుగుతుందో చూడాలి.



సంజన

మన తెలంగాణ
9
హైదరాబాద్
ఆదివారం
7, జనవరి 2018
www.manatelangana.news



నిజమవుతున్న మందగమనం భయాలు

న్యూఢిల్లీ : దేశీయ ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలు నిజమవుతున్నాయని కాంగ్రెస్ సీయనిర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రకటించిన వృద్ధి రేటు అంచనాలు క్షీణతను చూపిస్తున్నాయని, ఆర్థిక వ్యవస్థ మందగమనం నిజమవుతోందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017–18) గాను జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు అంచనాలను ప్రభుత్వం వెల్లడించింది. 2017–18 జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 6.5 శాతమే నమోదనుందని పేర్కొంది. ముందస్తు జిడిపి వృద్ధి అంచనాలను శుక్రవారం సిఎస్ఒ(కేంద్ర గణాంకాల శాఖ) విడుదల చేసింది. జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు, వ్యవసాయ ఉత్పత్తు తగ్గుముఖం పట్టడమే జిడిపి మందగించడానికి కారణమని అన్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో జిడిపి 7.1 శాతంగా ఉండగా, అంతకుముందు 2014–15 సంవత్సరంలో ఇది 7.5 శాతంగా ఉండడం గమనార్హం. తయారీ రంగంలో జివిఎ(గ్రాస్ వాల్యూ యాడెడ్) కూడా 7.9 శాతం నుంచి 6.1 శాతానికి క్షీణించింది. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి కూడా తగ్గింది. వ్యవసాయ, అటవీ, మత్స్య రంగాల్లో వృద్ధి 4.9 శాతం నుంచి 2.1 శాతానికి పడిపోయింది. జిఎస్‌టి అమలు ప్రభావం పలు రంగాలపై చూపిందని, ఇది జిడిపి తగ్గడానికి కారణమవుతోందని ఆయన వివరించారు.

క్యూ3 ఫలితాలే కీలకం

స్థూల గణాంకాలు, బడ్జెట్ ప్రతిపాదనలు ప్రభావం చూపుతాయి: నిపుణులు

ముంబయి : వచ్చే వారం స్టాక్‌మార్కెట్లను ప్రధానంగా మూడో త్రైమాసిక ఫలితాలు ప్రభావం చూపనున్నాయి. 2017–18 ఆర్థిక సంవత్సరంలో క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలను దేశీ కార్పొరేట్ సంస్థలు ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. ఈ ఫలితాలతోపాటు ఆర్థిక గణాంకాలు, బడ్జెట్ ప్రతిపాదనలు వంటి అంశాలు కూడా సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఈసారి సార్వత్రిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

మూడో త్రైమాసిక ఫలితాల విషయానికొస్తే ఇప్పటికే లిక్కర్ కంపెనీ జిఎం బ్రూవరీస్ ఫలితాలను వెల్లడించింది. దీంతో శుక్రవారం లిక్కర్ షేర్లకు లాభాల కిక్‌నిచ్చిన సంగతి తెలిసిందే. వచ్చే వారం ప్రధానంగా సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజాలు టిసిఎస్, ఇన్ఫోసిస్‌లతోపాటు ప్రైవేట్‌రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండస్‌ఇండ్ మూడో త్రైమాసిక ఫలితాలను వెల్లడించనున్నాయి. గురువారం టిసిఎస్, ఇండస్‌ఇండ్, శుక్రవారం ఇన్ఫోసిస్ ఫలితాలు వెల్లడించనున్నాయి. అపోలో మైక్రో సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూ ఈనెల 10న మొదలుకానుంది. శుక్రవారం మార్కెట్లు ముగిసిన తర్వాత ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వివరాలు ప్రకటించింది. 2017–18లో జిడిపి 6.5 శాతం వృద్ధి సాధించవచ్చంటూ ముందస్తు అంచనాలు విడుదల చేసింది. దీంతో జిడిపి నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. 2016–17లో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.1 శాతంతో పోలిస్తే ఈసారి క్షీణించింది. దీనికి ప్రధాన కారణం పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి) అమలు వంటి అంశాలు జిడిపిపై ప్రతికూల ప్రభావం చూపాయని నిపుణులు పేర్కొంటున్నారు. దీని వల్ల సోమవారం మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తవచ్చని, వారాంతాన మార్కెట్లు సరికొత్త గరిష్ఠాలను తాకిన నేపథ్యంలో ట్రేడర్లు లాభాల స్వీకరణకు ప్రాధాన్యమిచ్చే వీలున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. నవంబర్ నెలకు గాను ఐఐపి(పారిశ్రామికోత్పత్తి సూచీ) వివరాలను ప్రభుత్వం ఈనెల 12న విడుదల చేయనుంది. అక్టోబర్‌లో ఐఐపి 2.2 శాతం వృద్ధి చూపింది. అదే సమయంలో డిసెంబర్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వెల్లడికానున్నాయి. ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల) పెట్టుబడుల తీరు, ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, విదేశీ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులు వంటి అంశాలు దేశీయంగా ట్రెండ్‌ను ప్రభావితం చేయగలవని నిపుణులు పేర్కొంటున్నారు. ఏమైనా ప్రస్తుతం క్యూ3 ఫలితాలపై ఇన్వెస్టర్లు దృష్టిపెడతారని, ఇవి సానుకూలంగా ఉంటే మార్కెట్లు లాభాలతో ముందుకెళతాయని నిపుణులు పేర్కొంటున్నారు.



10,550 పాయింట్లు నిరోధ స్థాయి

నిఫ్టీ సూచీ 10,550 పాయింట్ల నిరోధ శ్రేణిని దాటలేదని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొత్త ఏడాది తొలి వారం దేశీయ సూచీలు పాజిటివ్‌గా ముగించాయి. నిఫ్టీ కీలక 10,490 పాయింట్లకు పైన ముగిసింది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిఫ్టీ 10490 నుంచి 10,500 పాయింట్ల మధ్యే కదలాడనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే పాజిటివ్ పరిణామాల కారణంగా వచ్చే వారం ఆరంభంలో సూచీలు లాభాల్లో కొనసాగించవచ్చని, భారీ ర్యాలీ మాత్రం ఉండదని అంటున్నారు. 10,650 పాయింట్ల స్థాయిలో నిఫ్టీకి గట్టి నిరోధం ఎదురవుతుంది. ప్రస్తుతం నిఫ్టీ ఆర్ఎస్ఐ 66.23 గా ఉంది. సూచీ గరిష్ఠాన్ని తాకినా, ఆర్ఎస్ఐ మాత్రం పెరగలేదు. ఎక్కువ శాతం కన్సాలిడేషన్‌కు అవకాశాలున్నాయని, ఎక్కువగా స్టాక్ ఆధారిత కొనుగోళ్లు కనిపిస్తాయని నిపుణులు అంటున్నారు. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్ సూచీలు మంచి ప్రదర్శన చూపుతాయి.



నకిలీ ఎస్ఎంఎస్‌లను నమ్మొద్దు

స్పష్టం చేసిన టెలికామ్ ఆపరేటర్లు

న్యూఢిల్లీ: ఇటీవల వదంతులు ఎక్కువ అవుతున్నాయి. ప్రజలను ఆందోళనకు గురిచేసే సందేశాలు వెలువడుతున్నాయి. టెలికాం వినియోగదారులను లక్ష్యంగా చేస్తూ ఎస్ఎంఎస్‌ల వెల్లువ కొనసాగుతోంది. జనవరి 7 నుంచి మీ నెంబర్‌పై వాయిస్ సర్వీసులు ఆగిపోనున్నాయని ఈ మెసేజ్‌సలలో సందేశం ఉంటుంది. ఇతర నెట్‌వర్క్‌లోకి నెంబర్‌ను మార్చుకుంటేనే పనిచేస్తాయంటూ ఆందోళనకర మెసేజ్‌లు వస్తున్నాయి. అన్ని టెలికాం ఆపరేటర్లకు ఈ మెసేజ్‌లు వెళ్తున్నాయి. దీంతో వెంటనే కస్టమర్లు ట్విట్టర్ వేదికగా టెలికాం కంపెనీలకు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. ఈ మెసేజ్‌లపై టెలికామ్ సంస్థలు స్పష్టతనిచ్చాయి. ఈ సందేశాలను టెలికాం కంపెనీలు పంపడం లేదని ఫిర్యాదులపై స్పందించాయి. జియో, వొడాఫోన్, ఐడియా కంపెనీలు ఇవి తప్పుడు మెసేజ్‌లను అని తేల్చిపడేశాయి. యూజర్లు ఆ మెసేజ్‌ను పట్టించుకోవద్దని, వాటిని తాము పంపడం లేదని సంస్థలు పేర్కొన్నాయి. ఎయిర్‌టెల్ ప్రతినిధి ఆ మెసేజ్‌ను ఓ స్పామ్‌గా ధృవీకరించారు. టాటా డొకోమో, బిఎస్ఎన్ఎల్ కస్టమర్లకు కూడా ఈ సందేశాలు వస్తున్నట్టు తెలిసింది. అందరికీ వస్తున్న ఈ సందేశాల్లో ఆశ్చర్యకరంగా యుపిసిను జనరేట్ చేసి నెంబర్‌ను వేరే నెట్‌వర్క్‌కు పోర్టు పెట్టుకోవాలంటూ వినియోగదారులను ఆదేశిస్తున్నాయి. అయితే ఏ ఆపరేటర్‌కు పోర్టు పెట్టుకోవాలో చెప్పడం లేదు. జనవరి 7 ఫేక్ డెడ్‌లైన్ అని, ఆధార్‌తో మొబైల్ నెంబర్‌ను వెరిఫికేషన్ చేసుకునే ప్రక్రియకు డెడ్‌లైన్ 2018 మార్చి 31 వరకు ఉందని కంపెనీలు పేర్కొంటున్నాయి. వదంతులు నమ్మొద్దని టెలికామ్ ఆపరేటర్లు స్పష్టం చేస్తున్నారు.

జెట్ ఎయిర్‌వేస్ ఆఫర్

న్యూఢిల్లీ: దేశీయంగా విమాన సంస్థల మధ్య పోటీ తీవ్రమవడంతో జెట్ ఎయిర్‌వేస్ రూ.2,320 ప్రారంభ ధర నుంచి ఆఫర్లను ప్రకటించింది. ప్రీమియర్ వన్ వే టికెట్లపై డిస్కౌంట్ ప్రకటించింది. ఎంపిక చేసిన విమానాల్లో ప్రీమియం టికెట్లను రూ.2320(అన్నీ కలుపుకొని)లకే అందిస్తోంది. ఈ ఆఫర్ కింద బుక్ చేసుకున్న అనంతరం 12 నెలల పాటు చెల్లుబాటు కానుంది. దీంతోపాటు 44 ఇంచ్ పిచ్ పెద్ద సిక్స్ వే హెడ్‌సెట్ ఉచితంగా అందివ్వనుంది. ప్రయానికి కనీసం 30 రోజులు ముందు టికెట్లు బుక్ చేసుకోవాలి. ఇండియాలో జెట్ ఎయిర్వేస్ నిర్వహిస్తున్న విమానాల్లో ఎంపిక చేసిన ప్రీమియర్లో వన్‌వే ప్రయాణాలకు ఈ రేట్లు వర్తిస్తాయి. ఎంపిక చేసుకున్న బుకింగ్ తరగతులకు, ఎలాంటి ప్రయాణ ఆంక్షలు లేకుండా డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నట్టు తెలిపింది. చార్జీల నిబంధనలు వర్తిస్తాయని వాటిని వివరించింది. ఈ మేరకు తగ్గింపు చార్జీల జాబితాను వెబ్‌సైట్లో ఉంచింది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28250	30213.90	0%
ముంబై	28970	30983.96	0.14%
ఢిల్లీ	28350	30320.86	0%
కోల్‌కతా	29120	31144.39	0.66%
కేరళ	27350	29251.34	0%
బెంగళూరు	27600	29518.72	0%
హైదరాబాద్	28180	30139.04	– 0.07%
గల్ఫ్	0	0	0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	41700.00	42000.00	–0.71
ముంబై	41700.00	42000.00	–0.71
ఢిల్లీ	41700.00	42000.00	–0.71
కోల్‌కతా	41700.00	42000.00	–0.71
హైదరాబాద్	41700.00	42000.00	–0.71



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	390	విశాఖపట్నం	395
వరంగల్	392	చిత్తూరు	398
విజయవాడ	388	చెన్నై	405
గోదావరి	388	బెంగళూరు	395

గత తప్పిదాలను సరిదిద్దుతున్నారు

- **సిఇఒ వేతనంపై నిర్ణయం సరైందే**
- **నిలేకనీకి ఇన్ఫీ మాజీ సిఎఫ్ఒ బాలకృష్ణన్ ప్రశంసలు**

బెంగళూరు: గత బోర్డు చేసిన తప్పిదాలను సరిదిద్దుతున్నారంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకనీని కంపెనీ మాజీ సిఎఫ్ఒ(చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్) వి బాలకృష్ణన్ ప్రశంసించారు. గత సిఇఒ కంటే తక్కువ వేతనాన్ని ప్రస్తుత సిఇఒ సలీల్ పరేఖ్‌కు ఖరారు చేయడాన్ని ఆయన అభినందించారు. 'గతంలో చేసిన తప్పుడు విధానాలను సరిదిద్దడంలో నందన్ నిలేకనీ ఆధ్వర్యంలోని బోర్డు సరైన నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రస్తుత సిఇఒ పరేఖ్‌కు వార్షిక వేతనం నిర్ణయం సరైందని, కొత్త సిఇఒ నేతృత్వంలో దీర్ఘకాలంలో కంపెనీ మెరుగ్గా రాణించనుంది' అని బాల్కృష్ణన్ అన్నారు. సీనియర్ మేనేజ్‌మెంట్‌కు వేతనాల కొలమానాల్లో స్పష్టత ఇచ్చేందుకు బోర్డు ప్రాధాన్యతనివ్వాలని బాలకృష్ణన్ తెలిపారు. కాగా ఇన్ఫోసిస్ కొత్త సిఇఒకు ఏడాదికి రూ.16.25 కోట్లు, అయితే ఈ వేతనం ఇంతకు ముందు సిఇఒగా పనిచేసిన విశాల్ సిక్కా కంటే తక్కువే. సలీల్ స్థిర వేతనం కింద రూ.6.5 కోట్లు, వేరియబుల్ పే కింద రూ.9.75 కోట్లతో పాటు



రూ.3.25కోట్ల విలువ గల స్టాక్ యూనిట్లను అందిస్తున్నట్లు ఇటీవల కంపెనీ స్వతంత్ర బోర్డు సభ్యురాలు కిరణ్ మజుందార్ షా తెలిపారు. వీటితో పాటు వార్షిక ఈక్విటీ గ్రాంట్ల కింద రూ.13 కోట్లు కూడా సలీల్ తీసుకోనున్నట్లు తెలిపారు. ఇక వన్ టైమ్ ఈక్విటీ గ్రాంట్ కింద మరో రూ.9.75 కోట్లు తీసుకుంటారు. ఇక స్టాక్ యూనిట్ల విలువ ప్రతి ఆర్థిక సంవత్సరానికోసారి మారుతుందని తెలిపారు. గతేడాది ఇన్ఫోసిస్ సిఇఒ విశాల్ సిక్కా అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నియామకాలు చేపట్టిన సంస్థ సలీల్ పరేఖ్‌ను సిఇఒగా నియమించగా, కొద్ది రోజుల క్రితం ఆయన బాధ్యతలు చేపట్టారు. సిక్కా తర్వాత ఇన్ఫీ సిఇఒ పదవిని చేపట్టిన రెండో ప్రమోటేతర వ్యక్తి సలీల్, కంపెనీ ఏర్పాటు చేసిన కమిటీ ఆయన్ని ఎంపిక చేసింది. అంతేగాక సంస్థ ఆరో సిఇఒ కూడా సలీలే.. ఐదేళ్ల పాటు సిఇఒ పదవిలో కొనసాగుతారు. మాజీ సిఇఒ సిక్కా 2016–17 ఆర్థిక సంవత్సరానికి గానూ 6.75మిలియన్ డాలర్లు(దాదాపు రూ.42 కోట్లు) వేతనం అందుకున్నారు. దీనిపై సంస్థ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



ఆదివారం న్యూఢిల్లీలో యుకో బ్యాంక్ 75వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

తగ్గుముఖం పట్టిన చమురు ధరలు



సింగపూర్/ లండన్ : ఈ ఏడాది ప్రారంభంలో క్రూడ్ ఆయిల్ ధలు రెండేళ్ల గరిష్ఠ స్థాయికి చేరగా, మళ్లీ దిగివస్తున్నాయి. అమెరికా ఉత్పత్తిని పెంచడంతో సరఫరా పెరిగి ధరలు తగ్గుతున్నాయి. ఒపెక్(పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ) సభ్య దేశం ఇరాన్‌లో రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరాపై పరిమితుల కారమంగా డిసెంబర్‌లో చమురు ధరలుపెరుగుతూ వచ్చాయి. 2018 కొత్త సంవత్సరంలో ధరలు 2015నాటి గరిష్ఠానికి చేరుకున్నాయి. అయితే అమెరికా క్రూడ్ ఉత్పత్తి పెంచడం వల్ల ధరలు తగ్గుముఖం పట్టాయి. యుఎస్ డబ్ల్యుటిఐ(వెస్ట్ టెక్సాస్ ఇంటర్‌మీడియెట్) క్రూడ్ ఫ్యూచర్ బ్యారెల్ 61.40 డాలర్లకు చేరింది. గత ముగింపు కంటే 1 శాతం దిగువన ట్రేడ్ అయింది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్ 50 సెంట్స్ కోల్పోయి 67.57 డాలర్ల వద్ద ఉంది. అంతకుముందు రోజు ఇది 68. 27 డాలర్లను క్రాస్ చేసింది. కాగా 2015 ద్వితీయార్థంలో చమురు ధరలు బాగా పెరిగాయి. డబ్ల్యుటిఐ క్రూడ్ ఫ్యూచర్ మంగళవారం ఒక బ్యారెల్ ఒక్కింటికి 19 శాతం పెరిగి 60.61 డాలర్ల వద్ద కదలాడింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర పీపా ఒక్కింటికి 67.20 డాలర్లకు చేరగా, ఈ స్థాయికి చేరడం 2015 తర్వాత ఇదే తొలిసారి. అంతర్జాతీయంగా చమురు నిల్వలు తగ్గిపోతున్నాయి. అదే సమయంలో ప్రపంచ దేశాల్లో ఎక్కువ శాతం వృద్ధి బాట పట్టడంతో క్రూడాయిల్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో లిబియా పైప్‌లైన్ పునఃప్రారంభం కావడం, ఫోర్టిస్ పైప్‌లైన్ సరఫరా పనరుద్ధరించడం జరిగినా డిమాండ్ పెరుగుతూనే ఉంది. అందువల్ల ధరలకు రెక్కలొచ్చాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనా నుంచి పెరుగుతున్న డిమాండ్ ధరలను తగ్గకుండా చేస్తోంది. ప్రస్తుతానికి చమురు ధరల భవిష్యత్ ఆశావహంగానే ఉందని మరో విశ్లేషకుడు విలియం ఓలాంగిలిన్ చెప్పారు. 2016 నుంచి అమెరికా చమురు ఉత్పత్తి పెరుగుతూ వస్తోంది. ఇదే ధోరణి కొనసాగితే అప్పుడు ఒపెక్, రష్యా ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయన్న దానిపై చమురు ధరలు ఆధారపడి ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత కొన్నేళ్లుగా పతనబాటలో సాగుతున్న ధరలకు నిలకడ తీసుకు వచ్చేందుకు గాను ఒపెక్ దేశాలు 2017 జనవరి నుంచీ చమురు ఉత్పత్తిలో కోతలను అమలు చేస్తున్నాయి. రష్యా వంటి నాన్‌ఒపెక్ దేశాలు కూడా మద్దతు పలకడంతో ఇటీవల కొంతకాలంగా చమురు ధరలు బలపడుతూ వస్తున్నాయి.



పేటీఎం పేమెంట్ బ్యాంక్, ఇండస్‌ఇండ్‌తో ఒప్పందం

ముంబై: ఫిక్స్‌డ్ డిపాజిట్ సౌకర్యం కల్పించేందుకు గాను ఇండస్ ఇండ్ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు పేటీఎం పేమెంట్ బ్యాంక్ ప్రకటించింది. కస్టమర్ బ్యాలెన్స్ రూ.1 లక్ష దాటినప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్ సౌకర్యం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంస్థ వెల్లడించింది. ఎలాంటి చార్జీలను చెల్లించకుండా కస్టమర్లు వారి డిపాజిట్లను ఎప్పుడైనా రిడీమ్ చేసుకోవచ్చని పేటీఎం పేమెంట్ బ్యాంక్ చెబుతోంది. వార్షిక వడ్డీ రేటు 6.85 శాతం ఆర్జించవచ్చని కంపెనీ పేర్కొంది. అధనంగా ఒకవేళ కస్టమర్లు మెచ్యూరిటీ వ్యవధికి ముందు సీనియర్ సిటిజన్ అయినట్లయితే ఖాతా ఆటో రెన్యూడ్ అవుతుంది. సీనియర్ సిటిజన్ స్కీమ్ కింద ఈ సౌకర్యం లభిస్తుంది. అందువల్ల ఈ విధంగా కూడా అత్యధిక వడ్డీ రేటును పొందవచ్చని కంపెనీ వివరించింది. చాలా వరకు ప్రజలు సురక్షితమైన ఆప్షన్లకు ప్రాధాన్యతనిస్తారని, దానికి అనుగుణంగా అధిక ఆర్జన సామర్థ్యం అందిస్తున్నామని పేటీఎం పేమెంట్ బ్యాంక్ ఎండి, సిఇఒ రేణు సత్తి తెలిపారు. జీరో పేపర్ పేపర్‌వర్క్‌తో తక్షణమే డిపాజిట్ నగదును తీసుకునే సౌకర్యం కల్పిస్తున్నామని ఆయన అన్నారు.

రూ. 3 వేల కోట్ల సేకరణకు ఎన్ఎసిఎల్‌కు అనుమతి



న్యూఢిల్లీ: నిధుల సమీకరణకు గాను పంట రక్షణ వ్యాపార సంస్థ ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్‌కు బోర్డు నుంచి అనుమతి లభించింది. అభివృద్ధి ప్రణాళికలకు రూ.3 వేల కోట్లు నిధులను సమీకరించేందు గాను బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని కంపెనీ వెల్లడించింది. ఈమేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఎన్ఎసిఎల్ పేర్కొంది. ఈ సంస్థగా ఇంతకుముందు నాగార్జున ఆగ్రోకెమ్ లిమిటెడ్‌గా అందరికీ సుపరిచితమే.. కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయడం ద్వారా దేశీయంగా అలాగే విదేశాలకు ఎగుమతులు చేపట్టాలనే ప్రణాళికతో సంస్థ నిధులను సమీకరిస్తోంది. బయో ప్రోడక్ట్‌ల ఉత్పత్తిని విస్తరించాలని కంపెనీ భావిస్తోంది. ఈమేరకు ఫిబ్రవరి 3న ఇజిఎం(ఎక్స్‌ట్రా జనరల్ మీటింగ్)లో ప్రతిపాదనపై వాటాదారుల ఆమోదం కోరనున్నారు.

టారిఫ్‌లను తగ్గించిన జియో

న్యూఢిల్లీ: జియో తన ప్రీపెయిడ్ టారిఫ్‌లను మరింత తగ్గించింది. తాజా తగ్గింపు ప్రకారం రోజుకు 1జిబి చొప్పున నెలమొత్తానికి సరిపడే నెలవారీ ప్యాక్ రూ. 149కే లభిస్తుంది. ప్రస్తుతం టెలికం పరిశ్రమలో ఇదే అత్యంత కనిష్ఠ టారిఫ్‌గా చెప్పవచ్చు. రూ. 399 ప్లాన్‌పై 20 శాతం అధికంగా డేటా ఇస్తామని జియో తెలిపింది. ఇటీవలే ఎయిర్‌టెల్, ఐడియా కంపెనీలు టారిఫ్‌లను సవరించిన సంగతి తెలిసిందే. వీటిని ఎదుర్కొనేందుకు జియో తన తాజా తగ్గింపు ప్రకటన చేసింది. జియో రాకతో దేశీయ టెలికామ్ మార్కెట్లో గట్టి పోటీ నెలకొంది. తొలుత జియో ప్రభావం తట్టుకునేందుకు పలు టెలికం కంపెనీలు టారిఫ్‌లను తగ్గించాయి. ఇప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు తాజాగా జియో కూడా టారిఫ్‌లను తగిస్తోంది.

మన తెలంగాణ
10
హైదరాబాద్
ఆదివారం
7, జనవరి 2018
www.manatelangana.news

బొగ్గు కుంభకోణం కేసులో 348 ఎకరాల భూమి జప్తు


న్యూఢిల్లీ: బొగ్గు నిల్వల కేటాయింపు కుంభకోణం కేసుకు సంబంధించి మధ్యప్రదేశ్‌లో దాదాపు రూ.4.53 కోట్ల విలువైన 348 ఎకరాల భూమిని జప్తు చేశామని శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) తెలిపింది. మనీలాండరింగ్ చట్టం కింద నర్సింగ్‌పూర్ జిల్లాలో భూమిని జప్తు చేయాలని తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. కొన్నేళ్ల క్రితం సిబిఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను ఆధారంగా చేసుకొని, ఎంఎస్ బిఎల్‌ఎ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, దాని మేనేజింగ్ డైరెక్టర్ అనూప్ అగర్వాల్, మరో అజ్ఞాత ప్రభుత్వ ఉద్యోగిపై ఇడి క్రిమినల్ కేసు నమోదు చేసింది. అక్రమ గనుల తవ్వకాలు, వివిధ బ్యాంక్ అకౌంట్ల ద్వారా మూలధన వాటా సృష్టించి స్థిరాస్తిని కొనుగోలు చేశారని పేర్కొంది. మోహపాని బొగ్గు గనుల్లో ఉన్న గొటిటోరా తూర్పు, గొటిటోర పశ్చిమ బొగ్గు నిల్వలను విద్యుత్ ప్లాంట్‌కు వినియోగించకుండా నిబంధనలకు విరుద్ధంగా వియోగించారని తన ఎఫ్ఐఆర్‌లో సిబిఐ ఆరోపించింది. అయితే విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకపోగా, ఎంఎస్ బిఎల్ఎ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ బొగ్గును విక్రయించేందుకు అనుకూలంగా ప్రభుత్వ ఉద్యోగి నిబంధనలు మార్చి వేశారు. ఈ విధంగా కంపెనీకి లబ్ధి చేకూర్చారని ఇడి ఆరోపించింది. అక్రమ సంపాదనను స్వాధీనం చేసుకోవడమే తమ ఉద్దేశ్యమని స్పష్టం చేసింది.

కశ్మీర్ యువతకు పాక్ గాలం

- పోలీసు ఉన్నతాధికారుల వార్షిక సదస్సులో రాజ్‌నాథ్ ఘాటు వ్యాఖ్యలు
- సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని ఉన్నతాధికారులకు ఆదేశం

టెకాన్‌పూర్: కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్ తీరును ఎండగట్టారు. జమ్ము కశ్మీర్‌లో యువతను భారత్‌కు వ్యతిరేకంగా ఉసిగొల్పడానికి పాకిస్తాన్ అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని ఆయన మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని టెకాన్‌పూర్‌లో జరిగిన డిజిపిలు, ఐజిపిల వార్షిక సమావేశంలో ఆయన శనివారం ప్రసంగించారు. పాకిస్తాన్‌లోను, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోను ఉగ్రవాదాన్ని ఉసిగొలిపే మౌళిక సదుపాయాలు అలాగే ఉన్నాయని ఆయన అన్నారు. ఉగ్రవాదుల శిక్షణా తరగతులు, సమాచార వ్యవస్థలు, లాంచ్ ప్యాడ్‌లు పక్కాగా పనిచేస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ సదస్సులో తెలిపారు. భారత్‌కు వ్యతిరేకంగా జమ్ము కశ్మీర్‌లోని యువతను తయారు చేసేందుకు ఆర్థిక వనరులు అందిస్తోందని రాజ్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. వేర్పాటు వాదులకు పాకిస్తాన్ ఊతం ఇవ్వడంతో జమ్ము కశ్మీర్‌లో శాంతి భద్రతల సమస్య తరచూ తలెత్తుతుందని హోంమంత్రి గుర్తుచేశారు. ఎటువంటి సమస్యలు ఎదురవుతున్నా భద్రతా బలగాలు దీటుగా స్పందించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. జమ్ము కశ్మీర్ రాష్ట్రంలో హింస చాలా వరకు తగ్గుముఖం పట్టిందని, రానున్న రోజుల్లో నక్సలైట్లు లొంగుబాటు పథకాన్ని మరింతగా సమర్థవంతంగా అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లోను తిరుగుబాటు చాలావరకు తగ్గుముఖం పట్టిందని హోంమంత్రి వివరించారు.

కఠినంగా వ్యవహరించండి: దేశంలో చాలా ప్రాంతాల్లో మత పరమైన హింస పెరుగుతోందని, ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు అత్యంత కఠినంగా వ్యవహరించాలని ఆయన పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రార్థనా స్థలాలను అపవిత్రం చేసే వారిపైనా కఠినంగా వ్యవహరించాలని హోంమంత్రి ఆదేశించారు. అదే విధంగా దేశంలో విపరీతంగా పెరుగుతున్న సైబర్ నేరాల గురించి కూడా రాజ్‌నాథ్ ప్రస్తావించారు. ఇంటర్‌నెట్‌ను, సోషల్ మీడియాను దుర్వినియోగ పరుస్తూ అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్న విషయాన్ని రాజ్‌నాథ్ ప్రధానంగా లేవనెత్తారు. సమాజంలో ఉద్రికత్తతలకు కారణమౌతున్న అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు



ఉన్నతాధికారులకు రాజ్‌నాథ్ సూచించారు. మధ్య ప్రదేశ్‌లోని టెకాన్‌పూర్‌లో ప్రారంభమైన ఈ సదస్సు మూడు రోజుల పాటు కొనసాగనుంది. ఆదివారం ప్రధాని మోడీ పోలీసు ఉన్నతాధికారుల ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి దేశ రాజధాని బయటే పోలీసు వార్షిక సదస్సులు నిర్వహిస్తున్నారు. గతంలో గౌహతి, రాణ్ ఆఫ్ కచ్, హైదరాబాద్‌లలో వార్షిక సదస్సులు జరిగాయి.

మిలిటెంట్ల దాడిలో నలుగురు పోలీసులు హతం

శ్రీనగర్: కశీర్ ఉత్తర భాగంలో మిలిటెంట్లు చేసిన దాడిలో నలుగురు పోలీసులు హతమయ్యారు. శుక్రవారం సోపోర్ నగరంలో గస్తీ నిర్వహణలో ఉన్న పోలీసులు మిలిటెంట్లు అమర్చిన మందు పాతర పేలడంతో పోలీసులు మరణించారు. బారాముల్లా జిల్లాలోని సోపోర్‌లో బడా బజార్, చోటా బజార్‌ల మధ్య మిలిటెంట్లు మందు పాతర అమర్చారు. వేర్పాటు వాదులు బంద్ పిలుపు ఇచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు పలు ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మందు పాతరకు బలయ్యారు.

గ్రాస్ డివైసివ్ పాలిటిక్స్

- జిడిపికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ కొత్త భాష్యం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం బిజెపిపై తీవ్ర విమర్శలు చేశారు. గబ్బర్ సింగ్ టాక్స్ (జిఎస్‌టి), ఫేక్ ఇన్ ఇండియా (మేక్ ఇన్ ఇండియా) అంటూ విమర్శలు గుప్పించిన రాహుల్ తాజాగా నోట్ల రద్దు, జిఎస్‌టి విధానంపై మరోసారి ధ్వజమెత్తారు. గ్రాస్ డివైసివ్ పాలిటిక్స్ (జిడిపి) అంటూ తనదైన శైలిలో వ్యంగ్యంగా అభివర్ణించారు. 201718 నాటికి జిడిపి 6.5శాతంగా ఉండనుందన్నఅంచనాలపై ఆయన ట్విట్టర్‌లో స్పందించారు. జైట్లీ మేధస్సు, ప్రధాని మోడీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థ కుదేలు అవుతుందని రాహుల్ పేర్కొన్నారు. జిడిపిని స్థూల విభజన రాజకీయాలు (గ్రాస్ డివైసివ్ పాలిటిక్స్)గా మార్చారని విమర్శించారు. దీంతో పెట్టుబడులు 13 ఏళ్ల కనిష్ఠానికి, బ్యాంకుల పరపతి 63ఏళ్ల కనిష్ఠానికి, ఉద్యోగ కల్పన సైతం 8 ఏళ్ల కనిష్ఠానికి చేరిందని ఆరోపించారు. వ్యవసాయ రంగ స్థూల విలువ జోడింపు (జివిఎ) 1.7 శాతానికి దిగజారిందని, అదే సమయంలో ద్రవ్యలోటు 8 ఏళ్ల గరిష్ఠానికి చేరిందని, పెండింగ్ ప్రాజెక్టులు సైతం పెరిగాయని ఆరోపిస్తూ ట్వీట్ చేశారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గే అవకాశం ఉందని కేంద్ర గణాంక కార్యాలయం అంచనాలను వెలువరించింది. వ్యవసాయం, తయారీ రంగం పేలవ ప్రదర్శనే ఇందుకు కారణమని పేర్కొంది. 201516లో 8 శాతంగా ఉన్న జీడీపీ.. 201617లో 7.1 శాతంగా నమోదైంది. ఈసారి వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్ఠానికి చేరుకుంటుందని శుక్రవారం సిఎస్ఓ పేర్కొన్న సంగతి తెలిసిందే.

రాహుల్‌పై సభా హక్కుల నోటీసు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై సభా హక్కుల నోటీసు జారీ అయ్యింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలంటూ రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు ఆ నోటీసును పంపారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేరును వక్రీకరిస్తూ రాహుల్ గాంధీ ట్వీట్ చేయడంతో ఈ నోటీసు జారీ చేశారని సమాచారం. బిజెపి నాయకుడు, రాజ్యసభ సభ్యుడు భూపిందర్ యాదవ్ రాహుల్ గాంధీపై ఈ నోటీసు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యలతో కూడిన ఓ విడియోను ట్వీట్ చేస్తూ 'జైట్లీ' అనడానికి బదులుగా 'జైట్ లై' అని పేర్కొన్నారు. ఇలా చేయడం ఆయనను అవమాన పరచడమేనంటూ యాదవ్ ఈ నోటీసు ఇచ్చారు. లోక్‌సభ స్పీకర్‌కు సభాహక్కుల నోటీసు పంపేప్పుడు వెంకయ్య నాయుడు 'పరిశీలనలో హక్కుల ఉల్లంఘన జరిగినట్లు ప్రాథమిక సమాచారం(ప్రైమా ఫేసి) ఉంది' అని ప్రస్తావించారు. రాహుల్ తన ట్వీట్‌లో 'డియర్ జైట్‌లై మన ప్రధాని చేసేది చెప్పరని, చెప్పేది చేయరని బహు చక్కగా గుర్తుచేసినందుకు కృతజ్ఞతలు. హ్యాష్‌ట్యాగ్ బిజెపి లైస్' అని రాశారు. మోడీ తనకు పూర్వ ప్రధానులకు వ్యతిరేకంగా చేసిన ప్రసంగం, రాజ్యసభలో జైట్లీ చేసిన వ్యాఖ్యల విడియోలను పోస్టు చేస్తూ ఆయన ట్వీట్ రాశారు. 'జైట్లీ' పేరును కావాలనే 'జైట్‌లై' అని వక్రీకరించి రాహుల్ పేర్కొన్నారని 'ఇది చాలా అగౌరపరిచేదని' బిజెపి సభ్యుడు భూపిందర్ యాదవ్ సభాహక్కుల నోటీసు ఇచ్చారు. ఇదివరలో ఇచ్చిన సభా హక్కుల నోటీసు సంగతి ఏమిటని కూడా యాదవ్ ప్రశ్నించినప్పుడు 'పరిశీలనలో ఉంది' అని వెంకయ్యనాయుడు జవాబిచ్చారు. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యుడైనందున ఆయనపై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు లోక్‌సభ స్పీకర్‌కు పంపారు. ఇప్పటికే రాహుల్‌కు సంబంధించిన పూర్వపు ఫిర్యాదొకటి బిజెపి నేత ఎల్.కె. అద్వాణీ నేతృత్వంలోని ఎథిక్స్ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉంది.

మరో భారీ ప్రయోగానికి ఇస్రో శ్రీకారం

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో భారీ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఇస్రో చరిత్రలోనే అతి భారీ ఉపగ్రహాన్ని పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉపగ్రహ అనుసంధాన అంతర్జాలాన్ని మారుమూల ప్రాంతాలకు అందించే లక్ష్యంతో దీన్ని అంతరిక్షంలోకి పంపనుంది. సుమారు ఆరు టన్నుల బరువుతో పాటు మరో ఆరు సెడాన్లు (4 మనుషులు కూర్చునే స్థలమంత) బరువైన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్ –11 ను ప్రయోగించడానికి దక్షిణ అమెరికాలోని ఫ్రెంచ్ గయానా సిద్ధమవుతోంది. దీంతో డిజిటల్ ఇండియా సాకారమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనిద్వారా మారుమూల గ్రామాల్లోకి సైతం వేగవంత మైన, నాణ్యతతోకూడిన అంతర్జాలాన్ని అందించవచ్చనీ, గ్రామీణప్రాంతాలకు ఇదో వరంలాంటిదనీ పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే భారత టెలికాం రంగంలో ఇదో సంచలనం అవుతుందనీ, ఉపగ్రహ అనుసంధాన అంతర్జాల విప్లవం రానుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.' డిజిటల్ ఇండియాలో పాలుపంచుకునేందుకు మా ప్రయత్నం మేం చేస్తున్నాం. ఉపగ్రహ అనుసంధాన అంతర్జాలం ద్వారా దేశానికి సరికొత్త రూపు తీసుకొస్తాం.ఈ ప్రయోగం ద్వారా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, తాలూకా, రక్షక దళాల సౌకర్యాలపై దృష్టి పెట్టా'మని ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. రూ. 500 కోట్ల వ్యయంతో తయారైన ఈ ఉపగ్రహంలో ప్రతి సోలార్ ప్యానల్‌నూ నాలుగు మీటర్ల పొడవు, వెడల్పు ఉన్న సీలింగ్ కప్పి ఉంటుంది. ఈ భారీ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి ఫ్రెంచ్ ఏరియన్–5 రాకెట్‌ను సిద్ధం చేసింది. గతేడాది ఆగస్టు 31న ప్రవేటు సంస్థలు తయారు చేసిన ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపిన విషయం విదితమే. ఉపగ్రహాలకు అమర్చే హీట్‌షీల్ విషయంలో జాగ్రత్త తీసుకోకపోవడంతో విఫలమైంది. దీంతో ఉపగ్రహాల విషయంలో ఇకపై అప్రమత్తంగా ఉంటామని కిరణ్ కుమార్ తెలిపారు.

కుల రాజకీయాలను అడ్డుకుందాం

- బిజెవైఎం జాతీయ అధ్యక్షుడు పూనమ్ మహాజన్



మన తెలంగాణ/న్యూఢిల్లీ: బిజెపి యువమోర్చా పదాధికారుల సమావేశం శనివారం దేశ రాజధాని ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. బిజెవైఎం జాతీయ అధ్యక్షులు పూనమ్ మహాజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా చెలరేగుతున్న కులాల మధ్య విభేదాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల కుల రాజకీయాలను అడ్డుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వ్యూహాలకు, ప్రతివ్యూహాలతో యువతరాన్ని ఉత్తేజితుల్ని చేయాలని బిజెవైఎం శ్రేణులకు ఈ సమావేశంలో దిశా నిర్దేశం చేసినట్లు తెలుస్తున్నది. ఈ సందర్భంగా బిజెవైఎం జాతీయ కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి, తెలంగాణ బిజెవైఎం అధ్యక్షుడు భరత్ గౌడ్, ఎపి బిజెవైఎం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తం గా కాంగ్రెస్, కమ్యూనిస్టులు కులాల మధ్య చిచ్చు రాజేస్తున్నారని ఆరోపించారు.ఈ రాజకీయాలను బిజెవైఎం తిప్పికొడుతుందని వెల్లడించారు. దేశంలో యువతరాన్ని జాగృతం చేసి ఐక్యత కోసం పోరాడతామని తెలిపారు.

అనుమతించని పరిశ్రమలకు లైసెన్సులు: డిపిసిసి

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరంలో అనుమతి లేని పరిశ్రమలు సైతం జనావాస ప్రాంతాల్లో పనిచేసేందుకు అధికారులు లైసెన్సులు ఇస్తున్నారని ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ(డిపిసిసి) ఆరోపించింది. అలాంటి పరిశ్రమలకు ఇప్పుడు నీరు, విద్యుత్ నిషేధిస్తూ నోటీసులు జారీ చేసింది. వాటికి పర్యావరణ శాఖ నుంచి 'పరిశ్రమ స్థాపించే అనుమతి' లేదని పేర్కొంది. డిపిసిసి అనుమతి లేకుండానే పారిశ్రామిక వాడల్లో, జనావాసాల్లో, అనుమతించని ప్రాంతాల్లో పరిశ్రమలు పనిచేస్తున్నాయని తన ప్రకటనలో ఆ కమిటీ పేర్కొంది.

లోయలో పడిన మినీబస్సు

ఉధంపూర్ : జమ్ము కశ్మీర్‌లో ని ఉధంపూర్‌లో ఒక మినీ బస్సు లోయ పడిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా, 15 మంది గాయాల పాలయ్యారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. రాంనగర్ నుంచి ఉధంపూర్ వైపుగా వెళుతున్న బస్సు అదుపుతప్పడంతో ఈ ఘటన జరిగింది. డ్రైవర్ బ్యాలెన్స్ కోల్పవడంతో బస్సు వంద అడుగుల లోయలోకి పడిపోయింది. ఘటన జరగగానే సమీపంలో ఉన్న కొందరు అక్కడకు చేరుకుని శవాలను వెలికి తీశారు. శనివారం 1.30 ప్రాంతంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికార ప్రతినిధి మీడియాకు వివరించారు. గాయ పడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని ఆయన తెలిపారు. ప్రమాద స్థలం నుంచి గాయపడిన వారిని సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు.

మా తరపున ఎవరో పాల్గొంటున్నారు

- రజనీ అభిమాన సంఘం

చెన్నై: టివి చర్చల్లో తమ తరపున పా ల్గొంటున్న వారితో తమకు ఎటువం టి సంబంధం లేదని అఖిల భారత రజనీకాంత్ అభిమానుల సంఘం (ఆలిండియా రజనీకాంత్ ఫ్యాన్స్ అ సోసియేషన్) స్పష్టం చేసింది. శనివా రం ఈ విషయమై అభిమానుల సం ఘం నిర్వాహకుడు విఎం సుధాకర్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. టివి చర్చల్లో పాల్గొంటున్న వారితో తమకెంటువంటి సంబం ధం లేదని, రజనీ మక్కల్ మంద్రమ్ ఎవ్వరికీ చర్చల్లో పాల్గొనేందుకు అనుమతినివ్వలేదని ఆయన తేల్చి చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న కీలక పరిణామాలపై వేరెవరో అభిప్రాయాలు వ్యక్త పరుస్తున్నారని, ఆ అభిప్రాయలతో రజనీకాంత్‌కు ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఢిల్లీ పోలీసుల అదుపులో నిందితులు

- షాలిమార్‌బాగ్ గ్యాంగ్‌రేప్ కేసులో ముగ్గురు అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని శాలిమార్ బాగ్‌లో పదహారేళ్ల యువతిపై సామూహిక అత్యాచారం చేసిన ముగ్గురు వ్యక్తులను శనివారం నాడు పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితులను శివప్రసాద్ అలియాస్ బబువా(33),అరుణ్‌యాదవ్ (36),కమలేష్ అలియాస్ బాబా (28)గా గుర్తించారు. ఇళ్లలో పనిచేస్తున్న ఆ యువతి తన బాయ్ ఫ్రెండ్‌తో కలిసి హైదర్‌పూర్ మురికివాడకు సమీపంలో ఉన్న ఒక పార్కులో కూర్చుని ఉంది. ఇది గమనించిన ముగ్గురు వ్యక్తులు వారిని సమీపించి ఆమె బాయ్‌ఫ్రెండ్‌పై చేయి చేసుకున్నారు. ఆమె వారిని ప్రతిఘటించడానికి ప్రయత్నించింది.అయినా ఫలితం లేకపోయింది. ముగ్గురు కలిసి ఆమె బాయ్‌ఫ్రెండ్‌ను చితకబాది ఆ తర్వాత ఆమెపై సామూహికఅత్యాచారం చేశారు. ముగ్గురు నిందితుల్లో శివప్రసాద్ ఆటోడ్రైవర్ కాగా, అరుణ్‌యాదవ్ పెస్టిసైడ్స్ డిస్ట్రిబ్యూటర్‌గా, రాజేష్ జులాయిగా తిరుగుతున్నాడు. ఈ ఘటన గతేడాది డిసెంబర్ 16 న జరిగింది.

లాలూ కూతురు, అల్లుడిపై రెండో అభియోగపత్రం

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో రాష్ట్రీయ జనతా దళ్(ఆర్‌జెడి) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు మిసా భారతి, ఆమె భర్త శైలేష్ కుమార్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) రెండో అభియోగ పత్రాన్ని ఢిల్లీ కోర్టులో దాఖలు చేసింది. కోర్టు రెండు అభియోగపత్రాలను ఫిబ్రవరి 5న పరిశీలించనుంది. పదేపదే అభియోగపత్రాలు దాఖలు చేస్తుండడంపై చిరెత్తిన ప్రత్యేక న్యాయమూర్తి ఎన్.కె.మల్హోత్రా ఇడిని 'అసలు కేసు విచారణను కొనసాగనివ్వరా?' అని కసురుకున్నారు. 'మీరు విచారణను కొనసాగనిస్తారా లేక ఇలాగే ఫిర్యాదులు దాఖలు చేస్తూ పోతారా? ఎన్ని అనుబంధ అభియోగపత్రాలు దాఖలు చేస్తారు? మీది ప్రముఖ దర్యాప్తు సంస్థ. కానీ మీరిలా ప్రవర్తించడం సరైంది కాదు. మీరు దాఖలు చేస్తున్నందంతా లొసుగులతో ఉంటోంది' అని వ్యాఖ్యానించారు. దీనికి ముందు ఇడి దక్షిణ ఢిల్లీలోని బిజ్వాసన్ ప్రాంతంలో ఉన్న పాలమ్ ఫామ్ హౌస్‌ను జప్తు చేసుకుంది.

మంచు తుపానుకు ఆరుగురు బలి

శ్రీనగర్: కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో శుక్రవారం సాయంత్రం సంభవించిన మంచు తుపాను పలువురి ప్రాణాలు తీసింది. కుప్వారాటాంగ్దర్ రోడ్డులో 8 మందితో ప్రయాణిస్తున్న టాటా సుమో వాహనం ఈ తుపాను ధాటికి గురైంది. గల్లంతైన వారిలో శనివారం ఆరుగురి మృతదేహాలు వెలికి తీసినట్లు అధికారులు వెల్లడించారు. మరో ఉద్యోగిని సహాయక బృందాలు రక్షించినట్లు తెలిపారు.

తమిళనాడులో రోడ్డెక్కని బస్సులు



చెన్నై: రవాణా కార్మికుల సమ్మె కారణంగా తమిళనాడులో రవాణా స్తంభించింది. సుమారు 14వేల బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. వారాంతంలో సుదూర ప్రాంతాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. వేతనాలు పెంచాలని, పదవీ విరమణ పొందిన కార్మికులకు పింఛ న్లు ఇవ్వాలని, తదితర డిమాండ్లపై అనేకసార్లు ప్రభుత్వాన్ని కలిసినా వారు నుంచి స్పందన లేకపోవడంతో గురువారం రాత్రి నుంచి రావా ణా కార్మికులు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. కార్మికుల సమ్మెపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

9 రోజులు.. వెయ్యి విమానాలు రద్దు!

న్యూఢిల్లీ : దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సుమారు వెయ్యి విమాన సర్వీసులను రద్దు చేయబోతోంది. ఈ మేరకు అన్ని విమానయాన సంస్థలకు ఇప్పటికే నోటీసులు అందాయి. జనవరి 18 నుంచి 26 వరకు రోజూ గంట 45 నిమిషాల పాటు ఎటువంటి విమాన సేవలు అందుబాటులో ఉండవు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు విమాన సేవలను నిర్వహించరాదని నోటీస్ టు ఎయిర్‌మెన్ (ఎన్‌ఓటీఏఎం) ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా సమయాల్లో వెళ్లాల్సిన విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. ఇక అంతర్జాతీయ విమానయాన సంస్థలు ఆ సమయంలో నడిచే విమానాలను రీషెడ్యూల్ చేశాయి.

నందన్ నీలేకనికి ప్రశంసలు

బెంగళూరు: ఇన్ఫోసిస్ సిఇఓ లీల్ పరేఖ్ వేతనంపై ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి.బాలకృష్ణన్ ప్రశంసలు కురిపించారు. సరైన నిర్ణయం తీసుకున్నారంటూ ఇన్ఫీ బోర్డు సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనిని అభినందించారు. గత బోర్డు చేసిన 'దుర్వినియోగాలను' సరిచేయడానికి, ప్రస్తుత సిఈఓకు సహేతుకమైన జీతాలను ఫిక్సింగ్ చేశారన్నారు. ముఖ్యంగా మాజీ సీఈవో విశాల్ సిక్కా కంటే తక్కువ వేతనం ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత నష్టాలను సరిచేయడానికి నందన్ సరియైన పని చేశారని, ప్రస్తుత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాలరీ స్ట్రక్చర్ రీజనబుల్‌గా ఉందని శనివారం వ్యాఖ్యానించారు.



కాంగ్రెస్‌లోకి మాజీ ఎంఎల్‌సి పోట్ల

- ఢిల్లీలో రాహుల్ సమక్షంలో చేరిక

మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం ఖమ్మం జిల్లాకు చెందిన టిఆర్‌ఎస్ నేత మాజీ ఎమ్మెల్సి పోట్ల నాగేశ్వరరావు ఆ పార్టీని వీడి ఢిల్లీలో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజ్యసభ సభ్యులు రేణుకాచౌదరి చొరవతో, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా సమక్షంలో ఆయనతో పాటు, వైరా టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి మాలోతు రాందాస్ నాయక్, జూలూరుపాడు, సింగరేణి మండలాలకు చెందిన పలువురు టిడిపి, టిఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ శాలువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వర రావు మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు.

ముస్లింలు రొయ్యలు తినొద్దు!

- ఫత్వా జారీ



హైదరాబాద్: నగరానికి చెందిన ఇస్లామీయ ధార్మిక విద్యా సంస్థ జామియా నిజామియా ముస్లింలు రొయ్యలు తినొద్దంటూ ఫత్వాను జారీ చేసింది. రొయ్యలు చేపల వర్గంలోకి రావని, వాటిని తినడం మానుకోవాలని తెలిపింది. ముస్లింలకు కొన్ని ఆహార పదార్థాలు 'హరామ్' (నిషిద్ధ) కేటగిరిలోకి వస్తాయి. కాగా ఇప్పుడు తాజాగా రొయ్యలు కూడా ఆ కేటగిరిలోకే వస్తాయని ఆ ధార్మిక విద్యా సంస్థ పేర్కొంది. జామియా నిజామియా వందేళ్లుగా పనిచేస్తున్న ఇస్లామీయ ధార్మిక విద్యా సంస్థ. హైదరాబాద్‌లో దానికొక ప్రత్యేక గౌరవం ఉంది.

నీలగిరి రైలు ప్రయాణికులకు బస్సు ప్రయాణం ఉచితం


కొయంబత్తూరు: నీలగిరి ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్‌లో కొయంబత్తూరు నుంచి మెట్టుపాలయం వరకు రిజర్వు టికెట్లపై ప్రయాణించే వారికి దక్షిణ రైల్వే ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని అందిస్తోంది. మెట్టుపాలయం వద్ద ప్లాట్‌ఫామ్‌ను పొడిగించే ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. కొయంబత్తూరు నుంచి మెట్టుపాలయం రైల్వే మార్గంలో ఫిబ్రవరి 1 నుంచి ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రయాణికులకు అందనుంది. కేవలం రిజర్వుడు టికెట్టు ప్రయాణికులకే ఈ సదుపాయం వర్తిస్తుందని డివిజనల్ మేనేజర్ హరిశంకర్ వర్మ చెప్పారు.

పోలీస్ సదస్సులో మోడీ ప్రసంగం

భోపాల్: గ్వాలియర్‌లోని టెకాన్‌పూర్‌లో ఉన్న సరిహద్దు భద్రతా దళం అకాడమిలో జనవరి 7–8న జరిగే పోలీస్ ఉన్నత స్థాయి సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన డిజిపి, ఐజిపిల ఈ ఉన్నత స్థాయి వార్షిక సదస్సులో భద్రతకు సంబంధించిన విషయాలను ఉన్నత పోలీస్ అధికారులు చర్చించనున్నారని అధికారిక ప్రకటన పేర్కొంది. ప్రధాని ఇదివరలో 2014లో గువాహతిలో. 2015లో గుజరాత్‌లోని కచ్‌కు చెందిన ధోరోడలో, 2016లో హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమిలో ఇలా ఉన్నత స్థాయి పోలీస్ అధికారుల సమావేశంలో పాల్గొన్నారు.

'కమలా' ప్రమాదం మానవ తప్పిదమే

ముంబయి: ముంబయిలోని కమలా మిల్స్ సముదాయంలో గత నెలలో జరిగిన అగ్నిప్రమాదంపై నివేదికను అగ్నిమాపకశాఖ అధికారులు ఉన్నతాధికారులకు సమర్పించారు. మోజో బ్రిస్టో రెస్టారెంట్‌లో తొలుత అగ్నికీలలు ప్రారంభమై అవి వన్ అబౌ రెస్టారెంట్‌కు వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు రెస్టారెంట్లకు మద్యం సరఫరా చేసేందుకు అనుమతి లేదు. నిబంధనలకు వ్యతిరేకంగా రెండు రెస్టారెంట్లలో మద్యం సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. వీటికి తోడు వన్ అబౌ పబ్ మొత్తం మంటలు త్వరగా వ్యాపించే వస్తువులతో రూపొందించారు. కమలా మిల్స్ సముదాయంలోని ఓ భవనంపై ఉన్న ఖాళీ స్థలంలో ఈ వన్ అబౌ రెస్టారెంట్‌ను నడుపుతున్నారు. తాత్కాలికంగా వెదురు కర్రలతో షెడ్ వేసి నిర్వహిస్తున్నారు. వీటిలో ప్లాస్టిక్ షీట్, కాటన్ దుస్తులు ఎక్కువగా ఉండటంతో మంటలు త్వరగా వ్యాప్తి చెందాయి. మంటలు చెలరేగగానే వన్ అబౌలో పనిచేస్తున్న బౌన్సర్ అక్కడ ఉన్న వారందరినీ రక్షించడం కోసం బాత్‌రూమ్ వైపు వెళ్లమని ఆదేశించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దీంతో అందరూ ప్రాణాలను రక్షించుకోవడం కోసం బాత్‌రూమ్‌లో తలదాచుకున్నారు. కానీ మంటల వేడి, పొగ కారణంగా చాలా మంది ఊపిరి ఆడక అదే బాత్‌రూమ్‌లో చనిపోయారు. మృతుల్లో బౌన్సర్ కూడా ఉన్నాడు. ఈ ప్రమాదం మానవ తప్పిదం కారణంగానే జరిగిందని అధికారులు తెలిపారు.



ట్రంప్‌వి అబద్ధాలంటున్న కొత్త పుస్తకం

వాషింగ్టన్: వైట్ హౌస్ ప్రధాన వ్యూహకర్త పదవి నుంచి తాను ఉద్వాసన పలికినపుడు స్టీవ్ బానన్ ఏడ్చాడని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం నాడు చెప్పారు. తన ఉద్యోగం కోసం కాళ్లావేళ్లా పడి బ్రతిమాలాడినట్లు కూడా అతడిపై వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ అతడిని డిస్మిస్ చేశారన్న వార్త తప్పు అంటూ ఒక కొత్త పుస్తకంలో విమర్శ ఉంది. ట్రంప్ వన్నీ అబద్ధాలని కూడా అందులో పేర్కొన్నారు. ఈ పుస్తకంపై ట్రంప్ ట్వీట్ చేస్తూ తనని, తన కుటుంబాన్ని పుస్తకం తీవ్రంగా విమర్శించడాన్ని తప్పుబట్టారు. చివరకు అధ్యక్ష ఎన్నికలో గెలవాలని తాను అనుకోలేదని కూడా రాయడాన్ని ట్రంప్ ఉదహరించారు. ట్రంప్ గెలవడం ఇష్టంలేని మెలానియా (ట్రంప్ భార్య) ఆయన గెలుపు వార్త విని విలపించినట్లు కూడా ఆ పుస్తకంలో రాశారు. 'ఫైర్ అండ్ ఫ్యూరీ' అనే శీర్షిక గల ఆ పుస్తకంలో అంతా తప్పుడు సమాచారమే ఉందని వైట్ హౌస్ కూడా వ్యాఖ్యానించింది. మైఖేల్ వుల్ఫ్ అనే రచయిత రాసిన ఆ పుస్తకం శుక్రవారం నాడు బుక్ స్టోర్స్‌కు విడుదలయింది. ఆ పుస్తక ప్రచురణ నిలిపివేయడానికి ట్రంప్ ప్రయత్నించారు. ఆ పుస్తకం ఆవిష్కరణ తేదీకి ముందే స్టోర్‌లకు విడుదలయింది.

మన తెలంగాణ
11
హైదరాబాద్
ఆదివారం
7, జనవరి 2018
www.manatelangana.news

మరో నాలుగు గంటల్లో సునామీ


వాషింగ్టన్ : మరో నాలుగు గంటల్లో సునామీ రాబోతోంది. తీర ప్రాంతాలను వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు వెళ్లండి' అంటూ వచ్చిన ఓ హెచ్చరిక అమెరికాలోని ఒరెగాన్ వాసులను కొద్దిసేపు భయభ్రాంతులకు గురి చేసింది. అధికారుల తప్పిదం వల్ల సునామీ ముంచుకు రాబోతుందని ఓ తప్పుడు హెచ్చరిక రావడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. అనంతరం అది తప్పుడు హెచ్చరిక అని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమెరికాలోని చిన్న తీర ప్రాంతం ఒరెగాన్. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో అక్కడి పోలీసు అధికారులకు మరో నాలుగు గంటల్లో సునామీ రాబోతోందని సందేశం వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఒరెగాన్ తీర ప్రాంతాలకు వెళ్లి అక్కడి వారందరినీ ఖాళీ చేయించేందుకు ప్రయత్నం చేశారు. ఆ సందేశం వచ్చిన 15 నిమిషాల్లో మరో సందేశం వచ్చింది. అధికారుల పొరపాటు వల్ల సునామీ హెచ్చరిక వచ్చిందని, అదంతా అసత్య వార్త అని ఆ సందేశం సారాంశం. ఎటువంటి ప్రమాదం లేదని తెలియడం వల్ల అంతా హమ్మయ్య అనుకున్నారు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని, మరెప్పుడు ఇటువంటి తప్పు జరగకుండా చూసుకుంటామని సిటీ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి ఒకరు తెలిపారు.

మెక్సికో సరిహద్దు గోడకు 18 బిలియన్ డాలర్లు కావాలి

వాషింగ్టన్ : అమెరికా మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం కోసం ట్రంప్ యంత్రాంగం 18 బిలియన్ డాలర్లు వెచ్చించేందుకు ప్రతిపాదనలు చేసింది. రానున్న పదేళ్లలో మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి ఈ మొత్తం కావాలని తెలిపింది. మెక్సికోతో గోడకు సంబంధించి అధ్యక్షుడు ట్రంప్ ప్రతిజ్ఞ చేసిన దానికనుగుణంగా బ్లూప్రింట్‌ను విడుదల చేశారు. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల సమయం నుంచే మెక్సికో సరిహద్దులో పెద్ద గోడ కడతానని చెప్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు సరిహద్దులో ఎక్కడెక్కడ, ఎలా గోడ నిర్మించాలి, ఎంత వ్యయం అవుతుందని అంచనాలు వేస్తున్నారు. ఈ ఏడాది 118 కిలోమీటర్ల మేర టెక్సాస్, కాలిఫోర్నియాల్లో గోడ నిర్మాణం లేదా ఫెన్సింగ్ పునర్నిర్మాణానికి ట్రంప్ యంత్రాంగం 1.6 బిలియన్ డాలర్లు కావాలని కోరింది. వచ్చే ఏడాది కూడా మరో 1.6 బిలియన్ డాలర్లు కావాలని కోరినట్లు అధికారులు తెలిపారు.కస్టమ్స్, సరిహద్దు రక్షణ దళాలు సరిహద్దు రక్షణ వ్యయం కోసం 33బిలియన్ డాలర్లు కావాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇందులో గోడ కోసం 18 బిలియన్ డాలర్లు, టెక్నాలజీ కోసం 5.7బిలియన్ డాలర్లు, రోడ్డు నిర్మాణం నిర్వహణ కోసం ఒక బిలియన్ డాలర్లు, సరిహద్దులో 5000 కొత్త పెట్రోల్ ఏజెంట్లకు, 2500 సరిహద్దు ఇన్స్‌పెక్టర్లకు,ఇతర సిబ్బందికి కలిపి 8.5బిలియన్ డాలర్లు కావాలని కోరినట్లు అధికారులు తెలిపారు.

మహారాష్ట్రలో శాంతిభద్రతలకు ఢోకాలేదు

పెట్టుబడుదారులకు భరోసా ఇచ్చిన సిఎం ఫడ్నవీస్



ముంబై : మహారాష్ట్రలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. ఫిబ్రవరి 18 నుంచి మూడు రోజుల పాటు జరిగే పెట్టుబడుల సదస్సుకు సంబంధించి సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో సీఎం వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు తగ్గుముఖం పట్టాయని, పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకున్నాయని ముంబైలో శనివారం విలేకరుల సమావేశంలో చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులను పెంచే ఉద్దేశ్యంతో జరిగే ఈ మూడు రోజుల సదస్సును ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు. ఈ సదస్సును విజయవంతం చేసేందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ ఎంతో తీవ్రంగా కృషి చేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలిపేందుకు పెట్టుబడులు సదస్సు ఉపయోగపడుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి సుభాష్ దేశాయ్ ధీమా వ్యక్తం చేశారు. దేశ జిడిపిలో మహారాష్ట్ర వాటా 15 శాతం ఉందని, దేశం చేసే ఎగుమతుల్లో నాల్గవ వంతు ఎగుమతులు మహారాష్ట నుంచే జరుగుతున్నాయని ఆయన గుర్తుచేశారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

నగదు, సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్, ఇన్నోవా, ఎల్ఇడి టివి స్వాధీనం

మన తెలంగాణ/హైదరాబాద్/ గచ్చిబౌలి: గత ఆరు నెలలుగా ఆన్ లైన్



బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్ తెలిపారు. శనివారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడుతూ వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున కమీషన్ రూపంలో తీసుకుంటున్న బెట్టింగ్ ముఠాను మాదాపూర్, శంషాబాద్ , బాచుపల్లి, కూకట్‌పల్లి పోలీస్ సిబ్బంది జాయింట్‌గా పకడ్‌బందీ సమాచారంతో వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. రవి కిరణ్ రెడ్డి, కొటి రెడ్డి, అజయ్‌రెడ్డి, గుంటూరు జిల్లా రెంటచింతలకు చెందిన వారని ఆయన తెలిపారు. వీరు పెద్దగా చదువుకోలేని కారణంతో తేలికగా డబ్బును సంపాదించాలనే కారణంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ద్వారా అక్రమంగా సంపాదించవచ్చని ఆయన తెలిపారు. వీరందరూ వెంకీ బాబు ఇతను వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తని గుంటూరులో గత రెండు సంవత్సరాల నుంచి బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నాడని ఆయన తెలిపారు. విశాఖపట్నంను బేస్ చేసుకోని పెద్ద ఎత్తున బెట్టింగ్‌లకు పాల్పడడం జరుగుతుందన్నారు. రవికిరణ్‌రెడ్డి మరో ఇద్దరు కోటిరెడ్డి, అజయ్ రెడ్డిలకు అసిస్టెంట్‌లుగా ఏర్పర్చుకొని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి ప్రగతి నగర్‌లోని లక్ష్మి నిలయంలో ఓ పెంట్ హౌస్‌ను అద్దెకు తీసుకొని గ్యాంగ్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బెట్టింగ్ నిర్వహణలో భాగంగా ముందుగా రిజిస్టర్ చేసుకున్న బ్యాంక్ అకౌంట్‌ను తెరిచి బెట్టింగ్‌లో పాల్గొనే సభ్యులు డబ్బులను డిపాజిట్ చేయాలని, ఏటీఎంపై ఎంత పందెంకాస్తున్నది స్పష్టంగా తెలపడం జరుగుతుందని గెలిచిన వారికి 20శాతం కమిషన్ తీసుకొని మిగిలిన పైకంను ఆన్‌లైన్ సర్వీస్‌ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడం జరుగుతుందని బెట్టింగ్ రాయుళ్లు తెలిపారు. ఇండియాలో ఐపిఎల్ లాగానే ఆస్ట్రేలియాలో ప్రీమియర్ లీగ్ డిసెంబర్, జనవరి నెలలో నిర్వహిస్తారని దానిని ఆసరా చేసుకొని ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. శక్రవారం ఆస్ట్రేలియాలోని బ్రిస్ బెయిన్ నగరంలో బెస్టకాచస్, బ్రిస్ చేయిన్ కిడ్స్ జట్ల మధ్య క్రికెట్ జరుగుతుండడాన్ని గమనించి మధ్యాహ్నం 1:40 మధ్య బెట్టింగ్ నిర్వహిస్తుండగా కచ్చితమైన సమాచారంతో ఎస్ఓటి పోలీసులు దానరెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. దాడిలో 15లక్షల28వేల 460 రూపాయల నగదు, మూడు ల్యాప్‌ట్యాపులు, ఒక నోట్ ప్యాడ్, ఒక కమ్యూనికేటర్ ఎం111, 21 నోకియా మొబైల్స్, 17 ఇతర మొబైల్స్, ఒక ఎల్ఇడి టివి, ఒక ఇన్నోవా వాహనాన్ని వివిధ బ్యాంకుల చెక్కు బుక్కులు, డెబిట్ కార్డులు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మొత్తం ఐదుగురు సభ్యులున్న ముఠాలో నలుగురిని అరెస్ట్ చేయగా ప్రదాన నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే అతనిని పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు.

పాక్‌ను ఎలా అదుపు చేయాలో తెలుసు



వాషింగ్టన్ : పాకిస్థాన్‌తో ఎలా వ్యవహరించాలన్న విషయంలో అన్ని రకాల మార్గాలు టేబుల్‌పై సిద్ధంగా ఉన్నాయని అమెరికా అధ్యక్ష నివాసం శ్వేతసౌధం వెల్లడించింది. తాలిబన్లు, హక్కనీ నెట్‌వర్క్ ఉగ్రవాదులపై పాక్ తగిన చర్యలు తీసుకోకపోతే ఏం చెయ్యాలో తమకు తెలుసని హెచ్చరించింది. ఉగ్రవాదులకు పాక్ స్వర్గధామంలా ఉంటోందని ఆరోపిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. పాక్‌కు అమెరికా దాదాపు 2బిలియన్ డాలర్ల సహాయాన్ని నిలిపేసిన అనంతరం అమెరికా మరోసారి ఈ విధంగా హెచ్చరించింది. అమెరికాపాక్‌ల మధ్య ఈ పరిస్థితిని పరిష్కరించే విషయంపై ఎలాంటి అనుమానం అవసరం లేదని ..అందుకు అన్నిమార్గాలు టేబుల్‌పై ఉన్నాయని వైట్‌హౌస్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం పాక్‌పై తీసుకునే చర్యల గురించి కచ్చితమైన వివరాలు వెల్లడించలేమని, కానీ, తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. అఫ్గానిస్థాన్ సరిహద్దులో ఉగ్రస్థావరాలపై పాక్ దాడులు జరపాలని అమెరికా కోరుకుంటోందన్నారు. అదే విధంగా ఉగ్రవాదులపై చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామని, అలా జరిగితే ఇరు దేశాల మధ్య తిరిగి సానుకూల పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఉగ్రవాదుల అంశంపై పాక్ త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా పరస్పర సహకారానికే మొగ్గు చూపుతుందని తెలిపారు. ఉగ్రవాదుల విషయంలో అమెరికా ఎంత సీరియస్‌గా ఉందో పాక్ గుర్తించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ముష్కరులపై పాక్ తీసుకునే చర్యలను బట్టే తిరిగి అమెరికా నుంచి సాయం పొందే అంశం ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించారు.

పాక్‌కు ఎలాంటి సాయం చేయబోం : వాషింగ్టన్: 'రానున్న రోజుల్లో పాకిస్థాన్‌కు అమెరికా అందించే సాయాన్ని మొత్తం నిలిపివేయాలని బిల్లును ప్రవేశపెడతాను. ఆ దేశానికి ఇచ్చే సాయాన్ని మన దేశంలోని రహదారుల నిర్మాణం, మౌలిక సదు పాయాలను మెరుగుపరుచుకునేందుకు ఉపయోగించాలి. మన దేశాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది.. అంతేకానీ ఇతర దేశాలను కాదు. విదేశాలకు సాయం చేయడానికి ముగింపు పలికి మన దేశాన్ని వృద్ధి చేసుకోవాల్సిన సమయం ఇది' అని అమెరికా సెనెటర్ రాండ్ పౌల్ మాట్లాడుతున్న వీడియోను శుక్రవారం ట్వీట్ చేశారు. ఆయన చేసిన ట్వీట్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ స్పందించారు. చాలా 'మంచి ఆలోచన' రాండ్ అంటూ అభినందించారు. 'మా దేశం జెండాలను తగులబెడుతున్న పాకి స్థాన్ వంటి దేశాలకు యూఎస్ ఇక కొంచెం కూడా సాయం చేయదు. 2002 నుంచి ఇప్పటి వరకు మేము దాదాపు 33 బిలియన్ డాలర్ల సాయాన్ని ఇచ్చాం. కానీ వాళ్లు మాకు తిరిగి ఏం ఇచ్చారు? గత కొన్నేళ్లుగా బిన్‌లాడెన్ ఆ దేశంలో నివసిస్తుంటే కనీసం అతడిని పట్టుకునేందుకు కూడా సాయం చేయలేదు. లాడెన్‌ను పట్టుకునేందుకు సాయం చేసిన వాళ్లని జైల్లో పెట్టింది' అని రాండ్ వీడియో ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమెరికా సాయం అతి స్వల్పం

పాక్ ప్రధాని షాహిద్ ఖక్వాన్ అబ్బాసీ



ఇస్లామాబాద్ : అమెరికా నుంచి తమ దేశానికి అందుతున్న సాయం చాలా చాలా స్వల్పమని పాక్ ప్రధాని షాహిద్ ఖక్వాన్ అబ్బాసీ అన్నారు. తాము సొంత నిధులతోనే ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్నామని, యూఎస్ మిలియన్ల డాలర్ల నిధులు ఇస్తున్నట్లు వస్తున్నవార్తలన్నీ అవాస్తవమని ఆయన కొట్టి పారేశారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'గత ఐదేళ్లుగా అమెరికా పాక్‌కు ఇస్తున్న ఆర్థిక సాయం ఏటా 10 మిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉంది. ఇది చాలా చాలా స్వల్పం. నేను పత్రికల్లో వచ్చిన వార్తలను గమనించాను. 900 మిలియన్ డాలర్లుగా ఉంది. అదంతా అవాస్తవం' అని ఆయ న స్పష్టం చేశారు. 2016లో అమెరికా పాక్‌కు 778 మిలియన్ డాలర్లు ఆర్థిక సాయం చేసిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. 'పాకిస్థాన్ సార్వభౌమ దేశం. పాక్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉందని కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలన్నీ అసత్యాలు. మా సొంత నిధులను ఖర్చుపెట్టుకుంటూ ఉగ్రవాదులతో మేము యుద్ధం చేస్తున్నాం' అని అబ్బాసీ చెప్పుకొచ్చారు. ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడం లేదన్న కారణంతో పాకిస్థాన్‌కు ఏటా ఇచ్చే1.15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7,290 కోట్లు) భద్రత సాయాన్ని అమెరికా ప్రభుత్వం శుక్రవారం నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో 2016 సంవత్సరానికి కాంగ్రెస్ ఆమోదించిన 255 మిలియన్ డాలర్ల (రూ.1,616 కోట్లు) విదేశీ మిలటరీ నిధులు కూడా ఉన్నాయి.

సౌదీలో 11 మంది రాకుమారులు అరెస్ట్



దుబాయ్ : సౌదీ అరేబియాలో రాజ వంశానికి చెందిన 11 మంది రాకుమారులను ప్రభుత్వం అరెస్ట్ చేసింది.ఈ విషయాన్నిఅక్కడి న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. రియాద్‌లో సౌదీ రాజుకు చెందిన ఓ రాజభవనం ఎదుట ఆందోళన చేసే ప్రయత్నం చేశారు. అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించినా వెళ్లకపోవడంతో వారిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. రాజ కుటుంబానికి చెందిన భద్రత బలగాలు వారి అరెస్ట్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు న్యూస్ వెబ్‌సైట్‌లో తెలిపింది. తమ బంధువుకు సంబంధించిన ఓ కేసు తీర్పులో పరిహారం ఇవ్వాలని, రాజ వంశీయులకు నీటి, విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించడాన్నిరద్దు చేస్తూ రాజు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయడానికి ప్రయత్నించారు. ఈ 11మంది రాకుమారులను అత్యంత భద్రత ఉండే హైర్ జైలుకు తరలించినట్లు సమాచారం.

ఒకే వేదికపై రజనీ, కమల్



మలేషియా: ఒకప్పుడు సినిమాల విషయంలో ఒకరిపై ఒకరు పోటీ పడిన కమల్‌హాసన్, రజనీకాంత్‌లు ఇప్పుడు రాజకీయంగా తమను తాము నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల రజనీకాంత్ తన రాజకీయ ప్రస్థానంపై ప్రకటన చేసిన తర్వాత తొలిసారి ఓ వేడుకలో పాల్గొన్నారు. నడిఘర్ సంఘం మలేషియాలో ఏర్పాటు చేసిన స్టార్ నైట్ షోకు కమల్, రజనీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి కమల్‌హాసన్‌తో కలిసి రజనీ వేదిక పంచుకున్నారు. మలేషియా వేదికగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పలువురు తమిళనటులు కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ఒకేసారి స్టేడియంకు చేరుకున్నారు. నిర్వాహకులు, అభిమానులు వారికి ఘన స్వాగతం పలికారు. తాను రాజకీయాల్లోకి రానున్నట్లు త్వరలోనే పార్టీని స్థాపించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయనున్నట్లు రజనీ ఇటీవల వెల్లడించారు. అయితే అంతకుముందు రజనీ రాజకీయ ప్రవేశంపై కమల్ తనదైన శైలిలో విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. రాజకీయంగా రజనీకి సవాల్ విసిరే వారిలో కమల్‌హాసన్ కూడా ఒకరు కావడం గమనార్హం. అయితే కమల్, రజనీల మధ్య రాజకీయ పోరు తప్పదన్న నేపథ్యంలో కమల్‌కు వ్యతిరేకంగా కొన్ని హిందూ సంఘాలు ఉద్యమిస్తున్నాయి. రజనీకి కూడా వ్యతిరేక సెగ తగులుతోంది. ఇటువంటి సమయంలో వీరిద్దరూ కలిసి ఓ వేడుకలో పాల్గొనడంపై పలు ఊహాగానాలు వెలువడుతున్నాయి. రాజకీయంగా ఇరువురి మధ్య చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది.

నర్సింగ్ కళాశాలల్లో బయోమెట్రిక్

కెఎన్ఆర్‌హెచ్‌యు ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్ : కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అనుబంధ న ర్సింగ్ కళాశాలలల్లో విధిగా బయోమెట్రిక్ అమ లు కానుంది. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. విశ్వవిద్యాలయ ఛాన్సలర్, గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ ఆదేశాల మేరకు ఎం.ఎస్సీ (నర్సింగ్), బి.యస్సీ (నర్సింగ్), పోస్ట్ బేసిక్ బి.యస్సీ (నర్సింగ్) కోర్సులను నిర్వహిస్తున్న కళాశాలలన్నీ తప్పనిసరిగా బోధనా సిబ్బందికి, విద్యార్థులకు బయోమెట్రిక్‌ను అమలు చేయాలని విశ్వవిద్యాలయం నిర్దేశించింది.బయోమెట్రిక్‌ను అమలు చేయడంలో అలసత్వం వహిం చే కళాశాలలపై చర్యలు తప్పవని రిజిస్ట్రార్ హెచ్చరించారు.

24 గంటల విద్యుత్ ఖ్యాతి ఎవరిది?

పార్టీల మధ్య మాటల యుద్ధం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా యావత్తు దేశ దృష్టిని ఆకర్షించడంతో ఇప్పుడు ఈ ఖ్యాతి ఎవరికి దక్కాలనేదానిపై పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని అధికార టిఆర్ఎస్ వ్యాఖ్యానిస్తూ ఉంటే గతంలో తమ హయాంలో పడిన అడుగుల వల్లనే ఇప్పుడు ఫలాలు అందుతున్నాయని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రం ఈ ఏడాది చివరికల్లా దేశమంతటా నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేయాలని కేంద్రం రూపొందించిన పథకం వల్లనే సాధ్యమైందని బిజెపి వ్యాఖ్యానిస్తోంది. దేశవ్యాప్తంగా మిగులు విద్యుత్ ఉన్నందువల్ల నిరంతరాయ విద్యుత్ తెలంగాణలో కూడా సాధ్యమైంది తప్ప ఈ మూడున్నరేళ్లలో అదనంగా ఒక్క యూనిట్ కూడా ఉత్పత్తి కాలేదని తెలంగాణ జెఎసి వ్యాఖ్యానిస్తోంది. మూడు పార్టీలు, జెఎసి మధ్య మాటల యుద్ధం గత మూడు రోజులుగా ముమ్మరంగా సాగుతోంది. సవాళ్ళు, ప్రతిసవాళ్ళు విసురుకుంటున్నాయి. 24 గంటల విద్యుత్ సాకారం కావడానికి ఖ్యాతి తమదంటే తమదని పార్టీలు వాదించుకుంటున్నాయి. విద్యుత్ సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ప్రభుత్వం నిర్దిష్టంగా తీసుకున్న చర్యలను బహిర్గతం చేయకపోవడంతో సహజంగా విపక్షాలు కూడా ఇది తెలంగాణ ప్రభుత్వ గొప్పదనమేమీ కాదని కాంగ్రెస్ వాదిస్తోంది. ఈ మూడున్నరేళ్ళలో ఒక్క యూనిట్‌ను కూడా తెలంగాణ ప్రభుత్వం అదనంగా ఉత్పత్తి చేయలేదని, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ద్వారా అదనపు విద్యుత్‌ను సమకూర్చుకుని ఇది ప్రభుత్వ గొప్పదనంగా వ్యాఖ్యానించుకోవడం సహేతుకం కాదని ఆ పార్టీ నాయకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్ ఆలీ, దాసోజు శ్రవణ్ తదితరులు వ్యాఖ్యానిస్తున్నారు. మిగులు విద్యుత్‌ను అమ్ముకోలేక అనేక విద్యుత్ ఉత్పత్తి సంస్థలు కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తూ ఉన్నాయని, ఇలాంటి సమయంలో తెలంగాణ ఆ సంస్థల నుంచి కొనుగోలుచేసి సమకూర్చుకుందే తప్ప ఇందులో తెలంగాణ సాధించిన 'గొప్ప' ఏమీ లేదని వ్యాఖ్యానించారు. నిజంగా ఇలాంటి చిత్తశుద్ధే ఉన్నట్లయితే అధికారంలో ఉన్నంతకాలం ఆ పని ఎందుకు చేయలేదని కాంగ్రెస్‌పై అధికార టిఆర్ఎస్ నేతలు నిప్పులు చెరిగారు. కేంద్ర ప్రభుత్వం 'ఉదయ్' ద్వారా సాయం



చేయకపోతే, 24 గంటల విద్యుత్ సరఫరా పథకాన్ని ప్రవేశపెట్టి ఉండకపోతే, సంస్కరణలను అమలుచేసి ఉండకపోతే తెలంగాణ ఈ లక్ష్యాన్ని సాధించి ఉండేదా అని బిజెపి నేత లక్ష్మ ణ్ ప్రశ్నించారు. కేంద్రాన్ని విస్మరించి అంతా తన గొప్పే అని కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ప్రచారం కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఇదంతా ఒక ఎత్తయితే తెలంగాణ జెఎసి వాదన మరో రకంగా ఉంది. దేశం మొత్తంమీద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12.29 లక్షల మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం కాగా ఇంతకంటే 1.08 లక్షల మిలియన్ యూనిట్లు ఎక్కువగానే ఉత్పత్తి అవుతున్నట్లు కేంద్ర విద్యుత్ సాధికార సంస్థ తన వార్షిక నివేదికలో పేర్కొనిందని జెఎసి గుర్తుచేసింది. అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నందువల్లనే నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమైంది తప్ప ఈ మూడున్నరేళ్ళలో ఒక్క విద్యుత్ సంస్థ కూడా అదనపు విద్యుత్‌ను ఉత్పత్తి చేయలేదని నొక్కిచెప్పింది. రైతులు ప్ర స్తుత పరిస్థితుల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరిపోతుందని, తప్ప భూగర్భ జల మట్టం పెరగకుండా 24 గంటల విద్యుత్ అవసరం లేదనే అభిప్రాయంతో ఉన్నారని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ ఆర్భాటంగా ప్రారంభించి మధ్యలోనే వదిలేసిన భూపాలపల్లి, జైపూర్ ప్రాజెక్టులను టిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిందని, సౌర విద్యుత్‌పై కూడా దృష్టి పెట్టి రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు వేసి సత్ఫలితాలు సాధించిందని, ఇదంతా సిఎం కెసిఆర్ ముందుచూపుకు, పట్టుదలకు నిదర్శనమని టిఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.24గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా ఇప్పుడు ఎవరి గొప్పదనమనే అంశం చుట్టే అని రాజకీయ పార్టీలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఖ్యాతి ఎవరికి సొంతమనేది ఈ పార్టీలన్నింటి మాటల యుద్ధంలోని సారం. ఖ్యాతికోసం జరిగే ఈ పాకులాటలో ఏ పార్టీ విజయం సాధిస్తుందనేదానికి ఎన్నికలే కొలమానంగా కనిపిస్తున్నాయి.

మూడో వివాహం చేసుకున్న ఇమ్రాన్ ఖాన్ ?

ఇస్లామాబాద్ (పాకిస్థాన్): పాకిస్థాన్ మాజీ క్రికెటర్, ప్రతిపక్ష నేత ఇమ్రాన్ ఖాన్ మూడో వివాహం చేసుకున్నారంటూ వార్తలు వస్తున్నాయి. ఆ దేశానికి చెందిన ఓ పత్రిక దీనిపై ఓ కథనాన్ని వెలువరించింది. కావాలనే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆయన సన్నిహితులు, పార్టీ నేతలు ఆ వార్తలను కొట్టిపారేశారు. పాకిస్థాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ ఛైర్మన్ అయిన ఇమ్రాన్ ఈ నెల ఒకటో తేదీన మూడో వివాహం చేసుకున్నారని సదరు పత్రిక పేర్కొంది. ఆయనను ఆధ్యాత్మికంగా మార్గదర్శనం చేసే ఒకామెను ఆయన వివాహం చేసుకున్నారని, కొంత కాలంగా వారిద్దరూ సన్నిహితంగా మెలుగుతున్నారని తెలిపింది. పార్టీ కోర్‌కమిటీ సభ్యుడైన ముఫ్తీ సయిద్ నేతృత్వంలో లాహోర్‌లోని అతని స్నేహితుడి ఇంట ఈ వివాహం జరిగిందని తెలిపింది. వివాహం జరిగిన మరుసటి రోజు నేరుగా ఇస్లామాబాద్ కోర్టులో హాజరయ్యారని పేర్కొంది. అయితే, ఇమ్రాన్ ఖాన్‌కు వివాహం జరిగిందంటూ వస్తున్న వార్తలను ఇమ్రాన్ రాజకీయ కార్యదర్శి అవన్ చౌద్రీ, పార్టీ అధికార ప్రతినిధి నయీమ్ ఉల్ హక్ కొట్టిపారేశారు. ఆయనపై అవినీతి ఆరోపణలు చేసిన వారే వివాహమంటూ ఇలాంటి కట్టు కథలు అల్లుతున్నారని పార్టీ నేత మజారీ ట్వీట్ చేశారు. కాగా, 1995లో జమీమా గోల్డ్‌స్మిత్‌ను తొలి వివాహం చేసుకున్న ఇమ్రాన్ తొమ్మిదేళ్ల తర్వాత ఆమెకు విడాకులు ఇచ్చారు. 2004లో రెహ్మాన్ ఖాన్ అనే టీవీ యాంకర్‌ను వివాహమాడిన ఇమ్రాన్ పది నెలలకే ఆ బంధాన్ని తెంచుకున్నారు. ఈ నేపథ్యంలో మూడో పెళ్లి వార్తలు వచ్చాయి.



మన తెలంగాణ
12
హైదరాబాద్
ఆదివారం
7, జనవరి 2018
www.manatelangana.news

విరాట్ కోహ్లిపై అభిమానుల సెటైర్లు



న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్‌పై సోషల్ మీడియా వేదికగా అభిమానులు సెటైర్లు వేస్తున్నారు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో కెప్టెన్ కోహ్లి ఐదు పరుగులు మాత్రమే చేసి ఔటైన విషయం తెలిసిందే. దీనిపై అభిమానులు సోషల్ మీడియాలో ఫైర్ అవుతున్నారు. నిర్జీవంగా ఉండే భారత పిచ్‌లపై డబుల్ సెంచరీలతో హడలెత్తించే కోహ్లి బౌన్సీ పిచ్‌లపై తేలిపోయాడని విమర్శించారు. సొంత గడ్డపై సులువుగా 200 పరుగులు కొట్టే కోహ్లికి బౌన్సీ పిచ్‌లపై 20 పరుగులు కూడా చేయడం కష్టమేనని వారు సెటైర్లు వేశారు. మరికొందరూ అనుష్క వల్ల కోహ్లి ఆటపై దృష్టి పెట్టలేకపోతున్నాడని, అతను మళ్లీ మాములు స్థితికి చేరాలంటే ఇంకో 20, 30 ఇన్నింగ్స్‌ల వరకు అభిమానులు వేచి చూడాల్సిందేనని కొద్దరు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అనుష్క ప్రభావం నుంచి బయట పడడం కోహ్లికి శక్తికి మించిన పనేనని, ఇక అతను పూర్వంలా బ్యాట్‌తో చెలరేగడం కష్టమేనని మరి కొందరు అభిప్రాయపడ్డారు. ఇక, బౌన్సీ పిచ్‌లపై చెలరేగి ఆడే అజింక్య రహానెను పక్కన బెట్టడంపై కూడా అభిమానులు ఫైర్ అయ్యారు. రహానె అంటే కోహ్లికి ఇష్టముండదని, అందువల్లే అతనికి తరచు తుది జట్టుకు దూరంగా ఉంచుతాడని ఆరోపించారు.



సఫారీ పైచేయి.

- **తడబడిన బ్యాటింగ్, ఆదుకున్న హార్దిక్, భారత్ 209 ఆలౌట్,**
- **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 65/2**

స్కోరుబోర్డు:

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: డీన్ ఎల్గర్ (సి) సాహా (బి) భువనేశ్వర్ కుమార్ 0, మార్క్రామ్ ఎల్బీ(బి) భువనేశ్వర్ 5, హాషిం ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3, ఎబి.డివిలియర్స్ (బి) జస్‌ప్రిత్ బుమ్రా 65, డుప్లెసిస్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్య 62, డికాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43, ఫిలాండర్ (బి) షమి 23, కేశవ్ మహారాజ్ రనౌట్ 35, రబడా (సి) సాహా (బి) అశ్విన్ 26, డేల్ స్టెయిన్ నాటౌట్ 16, మోర్నీ మోర్కెల్ ఎల్బీ (బి) అశ్విన్ 2, ఎక్స్‌ట్రాలు 6, మొత్తం 73.1 ఓవర్లలో 286 ఆలౌట్.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 19–4–87–4, మహ్మద్ షమి 16–6–47–1, జస్‌ప్రిత్ బుమ్రా 19–173–1, హార్దిక్ పాండ్య 12–1–53–1, రవిచంద్రన్ అశ్విన్ 7.1–1–21–2.

భారత్ మొదటి ఇన్నింగ్స్: మురళీ విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, శిఖర్ ధావన్ (సి) అండ్ (బి) స్టెయిన్ 16, చటేశ్వర్ పుజారా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 26, విరాట్ కోహ్లి (సి) డికాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ శర్మ ఎల్బీ (బి) రబడా 11, రవిచంద్రన్ అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 12, హార్దిక్ పాండ్య (సి) డికాక్ (బి) రబడా 93, వృద్ధిమాన్ సాహా ఎల్బీ (బి) స్టెయిన్ 0, భువనేశ్వర్ కుమార్ (సి) డికాక్ (బి) మోర్నీ మోర్కెల్ 25, మహ్మద్ షమి నాటౌట్ 4, జస్‌ప్రిత్ బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబడా 2, ఎక్స్‌ట్రాలు 14, మొత్తం 73.4 ఓవర్లలో 209 ఆలౌట్.

బౌలింగ్: ఫిలాండర్ 14.3–8–33–3, స్టెయిన్ 17.3–6–51–2, మోర్కెల్ 19–6–57–2, రబడా 16.4–4–34–3, కేశవ్ మహారాజ్ 6–0–20–0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్రామ్ (సి) భువనేశ్వర్ (బి) హార్దిక్ పాండ్య 34, డీన్ ఎల్గర్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్య 25, రబడా (బ్యాటింగ్) 2, హాషిం ఆమ్లా (బ్యాటింగ్) 4, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం 20 ఓవర్లలో 65/2.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 6–3–16–0, జస్‌ప్రీత్ బుమ్రా 4–0–14–0, మహ్మద్ షమి 5–1–15–0, హార్దిక్ పాండ్య 4–0–17–2, రవిచంద్రన్ అశ్విన్ 1–0–3–0.



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్‌కు కష్టాలు తప్పేలా లేవు. ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేశామన్న ఆనందం బ్యాట్స్‌మెన్ వైఫల్యం వల్ల నీరుగారింది. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 209 పరుగులకే కుప్పకూలింది. ఒక దశలో 92 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన భారత్‌ను హార్దిక్ పాండ్య (93), భువనేశ్వర్ కుమార్ (25) అసాధారణ బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. వీరిద్దరి పోరాటంతో భారత్ స్కోరు 200 పరుగులు దాటింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ చేపట్టిన దక్షిణాఫ్రికా శనివారం ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. ఓపెనర్లు మార్క్రామ్ (34; 43 బంతుల్లో 7x4), ఎల్గర్ (25; 54 బంతుల్లో 4x4)లను హార్దిక్ పాండ్య పెవిలియన్ పంపించాడు. అయినా తొలి ఇన్నింగ్స్‌తో కలుపుకొని దక్షిణాఫ్రికా ఆధిక్యం ఇప్పటికే 142 పరుగులకు చేరింది. డివిలియర్స్, డుప్లెసిస్, ఆమ్లా వంటి ఆటగాళ్లు ఇంకా బ్యాటింగ్ చేయాల్సి ఉండడంతో భారత్‌కు కష్టాలు ఖాయంగా కనిపిస్తున్నాయి.

నెమ్మదిగా...

అంతకుముందు 28/3 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం రెండో రోజు బ్యాటింగ్ చేపట్టిన భారత్ ప్రారంభంలో చాలా నెమ్మదిగా ఆడింది. రోహిత్ శర్మ, చటేశ్వర్ పుజారా జాగ్రత్తగా ఆడుతూ వికెట్‌ను కాపాడుకున్నారు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా ఆత్మరక్షణకే ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో స్కోరు నత్తను తలపించింది. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన రోహిత్ శర్మ 59 బంతుల్లో ఒక ఫోర్‌తో 11 పరుగులు చేశాడు. లంచ్ విరామ సమయానికి భారత్ 4 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. అయితే భోజన విరామం తర్వాత భారత కష్టాలు ప్రారంభమయ్యాయి. సౌతాఫ్రికా బౌలర్లు వరుసగా వికెట్లు తీస్తూ భారత్‌ను కష్టాల్లో పడేశారు. అప్పటివరకు కుదురుగా బ్యాటింగ్ చేస్తున్న పుజారా 92 బంతుల్లో 5 ఫోర్లతో 26 పరుగులు చేసి ఫిలాండర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే అశ్విన్ (12) కూడా వెనుదిరిగాడు. తర్వాత వచ్చిన వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా (0) ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. దీంతో భారత్ 92 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పడింది.

ఆదుకున్న హార్దిక్

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను యువ ఆటగాడు హార్దిక్ పాండ్య తనపై వేసుకున్నాడు. అతనికి భువనేశ్వర్ కుమార్ అండగా నిలిచాడు. ఇద్దరు సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. భువీ సమన్వయంతో బ్యాటింగ్ చేయగా, హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దూకుడుగా ఆడిన పాండ్య 46 బంతుల్లోనే పది ఫోర్లతో 50 పరుగులు చేశాడు. అతన్ని ఔట్ చేసేందుకు సౌతాఫ్రికా కెప్టెన్ తరచు బౌలర్లను మార్చినా ఫలితం లేకుండా పోయింది. టి–విరామ సమయానికి భారత్ స్కోరు ఏడు వికెట్లకు 185 పరుగులకు చేరింది. అయితే కుదురుగా ఆడుతున్న భువనేశ్వర్ (25; 86 బంతుల్లో 4x4)ను మోర్నీ మోర్కెల్ వెనక్కి పంపాడు. మరోవైపు 95 బంతుల్లో 14 ఫోర్లు, ఒక సిక్స్‌తో 93 పరుగులు చేసిన పాండ్యను రబడా ఔట్ చేశాడు. దీంతో పాండ్య సెంచరీ చేయకుండానే నిరాశతో వెనుదిరిగాడు. తర్వాత భారత్ 209 పరుగుల వద్ద ఆలౌటైంది. సౌతాఫ్రికా బౌలర్లలో ఫిలాండర్, రబడా మూడేసి వికెట్లు పడగొట్టారు. స్టెయిన్, మోర్కెల్‌కు రెండసి వికెట్లు దక్కాయి.


తేలి పోయారు

సొంతగడ్డపై సెంచరీల మీద సెంచరీలు కొట్టే టీమిండియా బ్యాట్స్‌మెన్ బౌన్సీ పిచ్‌లపై మాత్రం ఘోరంగా విఫలమవుతారు. గతంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ గడ్డపై జరిగిన సిరీస్‌లలో కూడా భారత్‌కు ఇలాంటి అనుభూతే ఎదురైన విషయం తెలిసిందే. తాజాగా దక్షిణాఫ్రికాతో ప్రారంభమైన మొదటి టెస్టులో కూడా భారత బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. బౌలర్లు అసాధారణ బౌలింగ్‌తో సౌతాఫ్రికాను 286 పరుగులకే కట్టడి చేసిన విషయం తెలిసిందే. అయితే బ్యాట్స్‌మెన్ చెత్త ఆటతో బౌలర్ల శ్రమను వృథా చేశారు. హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్‌లు సమన్వయంతో బ్యాటింగ్ చేసి భారత్ పరువును కాపాడారు. లేకుంటే టీమిండియా వందలోపే ఆలౌట్ అయ్యే ప్రమాదంలో చిక్కుకుంది. ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై తాము రాణించలేమనే సంప్రదాయాన్ని భారత ఆటగాళ్లు మరోసారి నిరూపించారు. ఓపెనర్లు శిఖర్ ధావన్, మురళీ విజయ్, కెప్టెన్ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ప్రత్యర్థి బౌలర్ల దూకుడు ముందు చేతులెత్తేశారు. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌లలో ఒక్కరు కూడా కనీసం 30 పరుగుల వ్యక్తిగత స్కోరును సైతం అందుకోలేక పోయారు. చటేశ్వర్ పుజారా మాత్రమే కాస్త మెరుగ్గా ఆడాడు. అతను కూడా 26 పరుగులకే వెనుదిరిగాడు. మురళీ విజయ్ (1), శిఖర్ ధావన్ (16), కెప్టెన్ కోహ్లి (5), రోహిత్ శర్మ (11) పేలవమైన బ్యాటింగ్ అభిమానులను నిరాశ పరిచారు. సొంతగడ్డపై వరుస డబుల్స్ సెంచరీలతో చెలరేగిన కెప్టెన్ కోహ్లి దక్షిణాఫ్రికా గడ్డపై ఆడిన తొలి మ్యాచ్‌లోనే విఫలమయ్యాడు. అతని వైఫల్యం జట్టుపై తీవ్రంగానే పడింది. కోహ్లి ఐదు పరుగులు మాత్రమే చేసి నిరాశ పరిచాడు. ఇక జట్టును ఆదుకుంటాడని భావించిన ధావన్, విజయ్‌లు కూడా విఫలమయ్యారు. ఇక, రెండో రోజు రోహిత్, పుజారాలపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. అయితే వీరిద్దరూ కూడా నిరాశే మిగిల్చారు. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొలేక తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. అశ్విన్, సాహా కూడా జట్టుకు అండగా నిలువడంలో విఫలమయ్యారు. అయితే హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్ అసాధారణ పోరాట పటిమతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ అద్భుతంగా ఆడడంతో భారత్ కాస్త గౌరవప్రద స్కోరును సాధించడంలో సఫలమైంది. కీలక ఇన్నింగ్స్ ఆడిన పాండ్య (93) సెంచరీకి సమీపంలో ఔట్ కావడం అభిమానులను నిరాశకు గురిచేసింది.

ఫైనల్లో నిక్, హారిసన్

బ్రిస్బేన్: ప్రతిష్ఠాత్మకమైన బ్రిస్బేన్ ఓపెన్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో నిక్ కిర్గియస్ (ఆస్ట్రేలియా), రియాన్ హారిసన్ (అమెరికా) ఫైనల్‌కు చేరుకున్నారు. ఆదివారం జరిగే ఫైనల్లో వీరిద్దరు పోటీ పడతారు. శనివారం జరిగిన సెమీఫైనల్లో ఆస్ట్రేలియా సంచలనం నిక్ కిర్గియస్ 3–6, 6–1, 6–4 తేడాతో డిఫెండింగ్ చాంపియన్, టాప్ సీడ్ గ్రిగర్ డిమిత్రోవ్ (బల్గేరియా)ను ఓడించాడు. తొలి సెట్‌లో ఓడి పోయిన కిర్గియస్ తర్వాత చెలరేగి ఆడాడు. వరుసగా రెండు సెట్‌లలో గెలిచి తుది పోరుకు చేరుకున్నాడు. మరోవైపు టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన దిమిత్రోవ్‌కు సెమీస్‌లోనే చుక్కెదురైంది. హోరాహోరీగా సాగిన మరో సెమీస్‌లో హారిసన్ 4–6, 7–6, 6–4 తేడాతో అలెక్స్ డి మినౌర్‌ను ఓడించాడు. వైల్డ్‌కార్డ్ ద్వారా టోర్నీకి అర్హత సాధించిన అలెక్స్ అద్భుత ఆటతో సెమీస్‌కు దూసుకెళ్లాడు. ఇక్కడ కూడా హారిసన్‌కు గట్టి పోటీనే ఇచ్చాడు. తొలి సెట్‌ను గెలిచి పైచేయి సాధించాడు. అయితే తర్వాత పుంజుకొని ఆడిన హారిసన్ వరుసగా రెండు సెట్లలో గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. రెండున్నర గంటలకు పైగా సాగిన హోరాహోరీ పోరాటంలో ఇద్దరు సర్వం ఒడ్డి పోరాడారు.

మహారాష్ట్ర ఓపెన్ విజేత సిమన్స్



పూనె: ప్రతిష్ఠాత్మకమైన మహారాష్ట్ర ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో గిల్స్ సిమన్స్ (ఫ్రాన్స్) టైటిల్ గెలుచుకున్నాడు. శనివారం జరిగిన ఫైనల్లో సిమన్స్ 7–6, 6–2 తేడాతో రెండో సీడ్ కెవిన్ అండర్సన్‌ను ఓడించాడు. ఒకప్పుడూ ప్రపంచ టెన్నిస్‌లో అగ్రశ్రేణి క్రీడాకారుల్లో ఒకడిగా కొనసాగిన సిమన్స్ వరుస వైఫల్యాలతో సతమతమయ్యాడు. గతంలో సిమన్స్ పురుషుల సింగిల్స్‌లో ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ప్రస్తుతం అతను 89వ ర్యాంక్‌లో కొనసాగుతున్నా డు. కాగా, మహారాష్ట్ర ఓపెన్ టోర్నమెంట్‌లో టైటిల్ గెలవడం ద్వారా మళ్లీ పూ ర్వవైభవం దిశగా అడుగులు వేస్తున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 14వ స్థా నంలో కొనసాగుతున్న అండర్సన్‌తో జరిగిన మ్యాచ్‌లో సిమన్స్ అసాధారణ ఆటతో చెలరేగిపోయాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన సిమన్స్ వరుసగా రెండు సెట్‌లు గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. తొలి సెట్‌లో పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. అయితే చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న సిమన్స్ సెట్‌ను దక్కించుకున్నాడు. ఇక, రెండో సెట్‌లో అతనికి ఎదురేలేకుండా పోయింది. అద్భుత షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. అతని ధాటికి అండర్సన్ ఎదురునిలువలేక పోయాడు. సునాయాసంగా సెట్ ను గెలిచి ప్రతిష్ఠాత్మకమైన టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

కివీస్ ఘన విజయం



వెల్లింగ్టన్: పాకిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ 'డక్ వర్త్ లూయిస్' నిబంధన ప్రకారం 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కివీస్ 50 ఓవర్లలో ఏడు వి కెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. తర్వాత బ్యాఇంగ్‌కు దిగిన పా కిస్థాన్ 30.1 ఓవర్లలో 166/6 స్కోరు వద్ద ఉన్నప్పుడు వర్షం మొదలైంది. దీంతో ఆట ముందుకు సాగలేదు. ఈ పరిస్థితుల్లో డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం న్యూజిలాండ్‌ను విజేతగా ప్రకటించారు. కాగా, శనివారం బేసిన్ రిజర్వ్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలి చిన పాకిస్థాన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. అయితే ఈ వ్యూహం తిరగబ డింది. కివీస్‌కు ఓపెనర్లు మార్టిన్ గుప్టిల్, కొలిన్ మున్రో శుభారంభం అందించారు. ఇద్దరు పాక్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఇన్నిం గ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. మున్రో తన మార్క్ షాట్లతో చెలరేగి పోయాడు. పాక్ బౌలర్లను హడలెత్తించిన మున్రో 35 బంతుల్లోనే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 58 పరుగులు చేశాడు. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 83 పరుగులు జోడించాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ విలియమ్స న్‌తో కలిసి గుప్టిల్ మరో మెరుగైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇద్ద రు పాక్ బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ రెండో వికెట్‌కు 73 పరు గులు జోడించారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన గుప్టిల్ 4 ఫోర్లు, రెండు సిక్సర్లతో 48 పరుగులు చేశాడు. తర్వాత కివీస్ వరుస క్రమంలో వికెట్లను కోల్పోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా కివీస్ కెప్టెన్ విలియమ్సన్ జోరును కొనసాగించాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన విలియమ్సన్ 117 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్స్‌తో 115 పరుగులు చేశాడు. అతనికి హెన్రి నికోలస్ అండగా నిలిచాడు. ధాటిగా ఆడిన నికోలస్ 4 ఫోర్లతో 50 పరుగులు చేశాడు. దీంతో కివీస్ స్కోరు 315కి చేరింది. తర్వాత బ్యా టింగ్‌కు దిగిన పాకిస్థాన్‌కు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ అజహర్ అలీ ఆరు పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఆ వెంటనే స్టార్ ఆటగాడు బాబర్ ఆజమ్ (0) ఖాతా తెరవకు ండానే ఔటయ్యాడు. ఈ రెండు వికెట్లు సౌథికి దక్కాయి. తర్వాత వచ్చి న సీనియర్ ఆటగాడు మహ్మద్ హాఫీజ్ (1) కూడా నిరాశ పరిచాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ ఫకర్ జమాన్ ఒంటరి పోరాటం చేశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన జమాన్ 86 బంతుల్లో 5ఫోర్లు, 4 భారీ సిక్సర్లతోఓ 82 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. అతనికి ఫహీం అశ్రఫ్ 17(నాటౌట్) అండగా నిలిచాడు. అయితే ఈ సమయంలో వ ర్షం రావడంతో ఆటను అర్ధాంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. అప్ప టికి పాక్ స్కోరు ఆరు వికెట్లకు 166కి చేరింది. కానీ, వర్షం తగ్గక పోవడంతో ఆట మళ్లీ ప్రారంభం కాలేదు. డక్‌వర్త్ పద్ధతిలో ఫలితాన్ని తేల్చారు. దీనిలో కివీస్ విజయం సాధించింది. ఈ విజయంతో న్యూజిలాండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది.



పట్టు బిగించిన ఆస్ట్రేలియా

ఇంగ్లాండ్‌తో చివరి టెస్టు

సిడ్నీ: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న యాషెస్ చివరి టెస్టులో ఆస్ట్రేలియా పట్టుబిగించింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌటైంది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 479 పరుగులు చేసింది. దీంతో ఆసీస్‌కు ఇప్పటికే 133 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. మరో ఆరు వికెట్లు చేతిలో ఉండడంతో ఈ మ్యాచ్‌లో కూడా ఆసీస్ గెలుపు అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఓవర్‌నైట్ స్కోరు 193/2తో శనివారం మూడో రోజు బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ఉస్మాన్ ఖ్వాజా, కెప్టెన్ స్మిత్ అండగా నిలిచారు. ఇద్దరు ఇంగ్లాండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. ఇదే సమయంలో ఖ్వాజా సెంచరీని పూర్తి చేశాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన స్మిత్ ఐదు బౌండరీలతో 83 పరుగులు చేసి వెనుదిరిగాడు. మరోవైపు ఉస్మాన్ ఖ్వాజా 381 బంతుల్లో 18 ఫోర్లు, ఒక సిక్స్‌తో 171 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ సందర్భంగా షాన్ మార్ష్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 101 పరుగులు జోడించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన షాన్ మార్ష్ పది ఫోర్లతో 98 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. అతనికి మిచెల్ మార్ష్ 63 (నాటౌట్) అండగా నిలిచాడు. ఇప్పటికే ఇద్దరు ఐదో వికెట్‌కు అజేయంగా 104 పరుగులు జోడించారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.